www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
శనివారం | 8-3-2025 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 322
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: నవమి ఉ.8.17 తదుపరి దశమి, నక్షత్రం: ఆర్ద్ర రా.11.28 తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.7.54 నుంచి 9.30, అమృతఘడియలు: మ.1.29-3.05, దుర్ముహూర్తం: ఉ.6.32-8.06, రాహుకాలం ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 6.19
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నాగబాబు నామినేషన్
హాజరైన మూడు పార్టీల నేతలు



శాసనమండలి ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న నాగబాబు, పక్కన మంత్రులు నాదెండ్ల మనోహర్, లోకేశ్, ఎమ్మెల్యేలు కొణతాల, విష్ణుకుమార్ రాజు

12

కాస్త మెరుగే.. అయినా బరువే!

ఉద్యోగాలు చేస్తున్న మహిళల పరిస్థితి గతం కంటే నయం.. కానీ ఇప్పటికీ అనేక సవాళ్లు

దాదాపు సగం మంది ఉద్యోగినులకు తమ జీతం మీద నిర్ణయాధికారం కరువే

ఒకవైపు ఉద్యోగం చేస్తూనే.. ఇంటి పనంతా తామే చేసుకుంటున్నవారు 27% మంది

పురుషుల్లో మొదలైన మార్పు.. ఇంటి పనుల్లో తోడ్పాటు.. మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగినుల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' సర్వే



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉద్యోగాలు చేసే మహిళల పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది! అదే సమయంలో.. మహిళలపై తరతరాలుగా వస్తున్న కట్టుబాట్ల బరువు మాత్రం ఇంకా పోలేదు! నిర్ణయాలు తీసుకోగలిగే స్వాతంత్ర్యం ఉన్నవారు, భర్త, పిల్లల తోడ్పాటు అందుకుంటున్నవారు గణనీయంగానే ఉన్నా.. తమ జీతం మీద తమకే హక్కులేని వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది!! మహిళా దినోత్సవం సందర్భంగా.. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాల్లో... ఉద్యోగినులపై 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ప్రత్యేక సర్వేలో వెల్లడైన వాస్తవాలివి. ఈ సర్వేలో పాల్గొన్న ఉద్యోగినుల్లో.. కుటుంబ అవసరాల కోసమే తాము పని చేస్తున్నామని

మిగతా 11వ పేజీలో...

మహిళా దినోత్సవాన అతివలకు కూటమి కానుకలు

అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంపు..

కార్యకర్తలకు 1.79 లక్షల నుంచి 2.32 లక్షలు

హెల్పర్లకు 1.09 లక్షల నుంచి 1.41 లక్షలకు

లక్ష మంది మహిళలకు పారిశ్రామిక 'సాయం'

నేడు ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

11

మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా ఏపీ

పరిశ్రమలు స్థాపించే మహిళలకు అండగా ప్రభుత్వం

వారికి ప్రభుత్వపరంగా 45% ప్రోత్సాహకాలు: సీఎం

అనుమానాస్పదం

వివేకా హత్య కేసులో కీలక వ్యక్తులు, సాక్షుల మరణాలను తేలిగ్గా తీసుకోకూడదు

రంగన్న మృతిపై నిగ్గు తేల్చాల్సిందే



మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

పరిటాల కేసు తరహాలోనే ఇక్కడా మిస్టరీ మరణాలు

కేబినెట్ భేటీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

రంగన్నను పోలీసులే చంపారని జగన్ మీడియాలో ఎందుకని తొలుత ప్రసారం చేశారు?

ఆయన మృతిని సర్కారుపైకి నెట్టే కుట్రే ఇది

వ్యవస్థీకృత నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజకీయాలను నేరపూరితం చేసిన జగన్

సమాజాన్ని ఏమార్చేందుకే టీవీ,పత్రిక ఏర్పాటు

వీరిని అదుపు చేయకపోతే ప్రమాదం: సీఎం

వివేకా హత్య అనంతర పరిణామాలు వివరించిన డీజీపీ

హత్యా రాజకీయాలకు చెక్ పెట్టాలి: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలను పూర్తిగా నేరమయం చేసేలా అధునాతన విధానంలో నేరాలకు పాల్పడుతున్నారని, రాజకీయాల్లో వ్యవస్థీకృత నేరాలు చేసే వారిని అదుపు చేయకపోతే మొత్తం వ్యవస్థే దెబ్బతినే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక వ్యక్తులు, సాక్షులు వరుసగా అనుమానాస్పద స్థితిలో చనిపోతుండటాన్ని తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదంటూ

మిగతా 12వ పేజీలో...

జగన్ జమానాలో భారీ 'ఫ్రీ హోల్డ్' స్కాం



11.56 లక్షల ఎకరాల్లో రీవెరిఫికేషన్ పూర్తి

నిబంధనలకు విరుద్ధంగా 5.08 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్

22ఏ సమస్యలూ పరిష్కరిస్తాం

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదన లేదు: అనగాని

13

డీపీవోల కేడర్ క్రమబద్ధీకరణకు కేబినెట్ ఓకే

కుప్పంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్

పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కు

రాజమండ్రిలో అగ్రి కళాశాలకు 10.72 ఎకరాలు

పర్యాటక భూముల కేటాయింపు పాలసీకి ఓకే

12

సొంత ఆదాయానికే సర్కారు గండి!



గనుల శాఖలో అసంబద్ధ నిర్ణయంతో గజిబిజి

నాలుగున్నర నెలలు సీనరేజీ కలెక్షన్ నిలిపివేత

కోల్పోయిన ఆదాయం సుమారు 800 కోట్లు

గత ఏడాది నవంబరు నుంచి పునరుద్ధరణ ఎందుకు ఆపారో... ఆపి ఏం సాధించారో!?

కాంట్రాక్టర్ల బకాయిలుగా చూపిస్తూ ముఖ్యమంత్రికి గనుల శాఖ నివేదికలు!

సమస్య తెలిసీ పరిష్కరించని ప్రభుత్వం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ ఆదాయానికి గండి కొట్టిందెవరు? 2024-25 ఆర్థిక సంవత్సరంలో గనుల ఆదాయం భారీగా తగ్గిపోవడానికి కారణమేమిటి? 'సీనరేజి కాంట్రాక్టర్లు భారీగా బకాయి పడ్డారు. అందుకే... ఆదాయం పడిపోయింది' అని గనుల శాఖ అధికారులు సమాధానం చెబుతున్నారు. ముఖ్యమంత్రి కూడా విషయం లోతుల్లోకి వెళ్లకుండా, సమస్యను అధ్యయనం చేయకుండా, అధికారులు చెప్పినదానికే తలూపుతున్నారు. అసలు విషయం ఏమిటంటే... గనుల ఆదాయానికి గండి కొట్టింది ప్రభుత్వమే! ఖజానాకు క్రమం తప్పకుండా ఆదాయాన్ని తెచ్చే సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్టులను నాలుగున్నర నెలలపాటు నిలిపివేశారు. అదే సమయంలో... సీనరేజీ కాంట్రాక్టు లేని జిల్లాల్లోనూ అన్ని రకాల మినరల్స్‌కు పర్మిట్లు నిలిపివేశారు. సరిగ్గా ఆ నాలుగు నెలల్లోనే సర్కారుకు దాదాపు 800 కోట్ల విలువైన ఆదాయం పోయింది. సీనరేజీ వసూలు కాంట్రాక్టులను నిలిపివేసి ప్రభుత్వం ఏమైనా

మిగతా 2వ పేజీలో...

బోరుగడ్డ బొంకులు!

బెయిలు పొడిగింపు కోసం నాటకాలు

తల్లికి అనారోగ్యం నిజమే!

అనిల్‌కు బెయిలు రాకముందే ఆస్పత్రిలో చేరిక

18న సర్జరీ, 23న డిశ్చార్జి

తొలి విడతలో 28 దాకా బెయిలుపై అనిల్

పొడిగింపు పొందేందుకు తప్పుడు మార్గం

నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌తో హైకోర్టుకు టోకరా

బెయిల్ రద్దుకు పోలీస్ పిటిషన్



(గుంటూరు/అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొడుకు ఎలాంటి వాడైనా సరే... తల్లి బాగోగులు చూసుకోవాల్సిందే! కానీ... తల్లి అనారోగ్యాన్ని అడ్డం పెట్టుకుని, తప్పుడు మెడికల్ సర్టిఫికెట్‌తో హైకోర్టును బురిడీ కొట్టించి, బెయిలు పొందితే? వైసీపీ హయాంలో రాజ్యాంగేతర శక్తిగా చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ చేసింది ఇదే! 'మాయమైపోయాడు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'ఇంత జరిగిందా' అని అధికారవర్గాలు ఉలిక్కిపడ్డాయి. తల్లికి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత

మిగతా 14వ పేజీలో...



ఎమ్మెల్యే చదలవాడపై సీఎం సీరియస్

వివరణ కోరాలని పల్లాకు ఆదేశం

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఎక్సైజ్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఆయన వ్యవహరించిన తీరుపై వివరణ తీసుకోవాలని ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఎమ్మెల్యే ప్రవర్తన పార్టీ నియమావళికి విరుద్ధంగా ఉందని, పార్టీ

మిగతా 12వ పేజీలో...

ఏఎన్‌యూ బీఈడీ ప్రశ్నపత్రం లీక్

పరీక్షకు అరగంట ముందే బయటకు

ఘటనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం.. పరీక్ష రద్దు

3

'తిరుపతి' తొక్కిసలాటపై ఇద్దరు ఐపీఎస్ అధికారులకు సమన్లు!

3

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

నెట్‌వర్క్ ఆస్పత్రుల నోటీసు

2

రాష్ట్రానికి 'టాటా ఎనర్జీ'

49 వేల కోట్లతో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి

ఎన్ఆర్ఈడీసీఏపీతో ఒప్పందం

పునరుత్పాదక రంగంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: మంత్రి లోకేశ్

12

7.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం: సీఈఓ




మంత్రులు లోకేశ్, గొట్టిపాటి, సీఎస్ విజయానంద్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేస్తున్న టాటా, ఏపీ ప్రతినిధులు

ఏపీలో ప్రీమియర్ ఎనర్జీస్ ప్లాంట్

నాయుడుపేట వద్ద 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్ ఏర్పాటు

10

నియోజకవర్గాల పునర్విభజనపై చర్చిద్దాం రండి



చంద్రబాబు, రేవంత్ సహా 7 రాష్ట్రాల సీఎంలు

29 పార్టీల అధినేతలకు సీఎం స్టాలిన్ ఆహ్వానం

22న చెన్నైలో ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం

2

రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



» ఒడియా నవల 'దాడీ బుధా'ను 'ఈతచెట్టు దేవుడు' పేరిట తెలుగులోకి..

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ప్రముఖ ఒడియా రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గోపీనాథ్ మహంతి రచించిన 'దాడీ బుధా' అనే నవలను తెలుగులో 'ఈతచెట్టు దేవుడు' పేరిట అనువదించినందుకు తుర్లపాటిని ఈ పురస్కారం వరించింది. ఒడిశాలోని బరంపురంలో నివసిస్తున్న తుర్లపాటి రాజేశ్వరి ఒడియా నుంచి తెలుగులోకి అనేక రచనల్ని అనువాదం చేశారు. బరంపురంలో ఆమె అనేక సంవత్సరాలు అధ్యాపకురాలిగా పనిచేసిన తర్వాత పదవీవిరమణ చేశారు. స్వతంత్రంగా కూడా తెలుగు సాహిత్యంలో రచనలు చేశారు. కాగా, తెలుగుతో పాటు 21 భాషల్లో అనువాద పురస్కారాలను శుక్రవారం కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు ప్రకటించారు. తెలుగు అనువాద పురస్కారాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించిన న్యాయ నిర్ణేతల్లో 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధి ఎ. కృష్ణారావు, ప్రముఖ రచయితలు దాసరి అమరేంద్ర, గుడిపాటి వేంకటేశ్వర్లు ఉన్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

» ట్రస్టుకు నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం నోటీసు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం మరోసారి ట్రస్టుకు నోటీసు పంపించింది. శనివారం నుంచి రాష్ట్రంలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సంబంధిత వైద్య సేవలన్నింటినీ నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే ప్రభుత్వం రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టిందని, ఆస్పత్రుల నెలవారీ నిర్వహణ చేయలేకపోతున్నామని తెలిపింది. ప్రభుత్వం బడ్జెట్‌లో ఎన్టీఆర్ వైద్య సేవకు కేటాయించిన రూ.4 వేల కోట్ల బడ్జెట్‌కు బకాయిలే దాదాపు సమానంగా ఉన్నాయని పేర్కొంది. ఇప్పటికే తాము ట్రస్ట్, ప్రభుత్వంతో పలుమార్లు చర్చించామని, బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారన్న దానిపై స్పష్టత లేదని తెలిపింది. ప్యాకేజీ రేట్ల రివిజన్ సమయంలోనూ తమను సంప్రదించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికే తమ సామర్థ్యానికి మించి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా సేవలు అందించామని, బకాయిల నేపథ్యంలో కొనసాగించలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

హైకోర్టులో నలుగురు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు నలుగురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, కర్నూలు జిల్లాల పరిధిలోని దేవాలయాలకు అన్నె దేవి సుభాషిణి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాల పరిధిలోని దేవాలయాలకు తూము వేణుగోపాల్ స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమితులయ్యారు. తెన్నేటి కుమారరత్నంను ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డుకు, దారపు కృష్ణను అనంతపురం జేఎన్‌టీయూకు స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ న్యాయ శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు ఇచ్చారు.

వీడ్కోలు సభలో కెనడా ప్రధాని ట్రూడో కంట నీరు



అట్టావా, మార్చి 7: కెనడా ప్రధానిగా బాధ్యతల నుంచి తప్పుకొన్న జస్టిన్ ట్రూడో... వీడ్కోలు సమావేశంలో భావోద్వేగానికి లోనయి కన్నీటిపర్యంతమయ్యారు. కెనడా వాసులను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి రోజూ కృషి చేశానని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను విమర్శిస్తూ 'అంతర్జాతీయ సంబంధాలంటే రియల్ ఎస్టేట్ డీల్స్ కాద'ని వ్యాఖ్యానించారు.. లిబరల్ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, ప్రజాదరణ రేటింగ్స్ తగ్గిపోవడంతో ట్రూడో జనవరి నెలలో ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఇంతవరకు ఆపద్ధర్మ ప్రధానిగా విధులు నిర్వరిస్తున్నారు. పదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉండడం గమనార్హం. ఆదివారం లిబరల్ పార్టీ కొత్త ప్రధానిని ఎన్నుకోనున్న నేపథ్యంలో గురువారం ట్రూడోకు వీడ్కోలు పలికారు. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై అనుసరిస్తున్న వైఖరి నేపథ్యంలో ట్రూడో చేసిన ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకొంది. కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా మార్చుతామని, ట్రూడో గవర్నర్ అవుతారని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. కెనడాపై 25% ప్రతీకార సుంకం కూడా విధించారు.

నియోజకవర్గాల పునర్విభజనపై

చర్చిద్దాం రండి



చంద్రబాబు సహా 7 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ ఆహ్వానం

» 29 పార్టీల అధినేతలకు కూడా

» 22న చెన్నైలో సమావేశం

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 29 పార్టీల అధినేతలకు ఆహ్వానం పంపారు. ఇటీవల నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానం మేరకు ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న చెన్నైలో సమావేశం తలపెట్టారు. దీనికి రావాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్, కేరళ సీఎం విజయన్, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, పశ్చిమబెంగాల్ సీఎం మమత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఒడిసా సీఎం మోహన్‌చంద్ర మాఝీలకు ఆహ్వాన లేఖలు పంపించారు. ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటుకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆమోదం తెలపాలని, అదే సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన రాజకీయపార్టీలు ఈ కమిటీలో తమ తరఫున ప్రతినిధులను సభ్యులుగా నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించబోయే నియోజకవర్గాల పునర్విభజన ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమైందని, ఈ వ్యవహారాన్ని రాజకీయపరంగా, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2021లో జరగాల్సిన జనగణన ఆలస్యం కావడంతో నియోజకవర్గాల పునర్విభజన.. 2031లో జరగనున్న జన గణన ప్రకారం జరుగుతుందని భావించామని, అయితే అంతకంటే ముందే పునర్విభజన చేపట్టనుండడంతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లడం ఖాయమని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు తీరని నష్టం కలుగుతుందన్నారు. పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, అయితే అప్రజాస్వామికంగా చేపడుతున్న పునర్విభజననే వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. "జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించినందుకు మనకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చోకూడదు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ లేఖ రాసినవారిలో మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం జగన్, పుదుచ్చేరి సీఎం ఎన్. రంగస్వామి, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు. వీరితో పాటు కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిసా, పంజాబ్, తదితర రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నేతలకు కూడా స్టాలిన్ లేఖలు రాశారు.

వచ్చే ఏడాది ఎన్నికలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన అంశాలపై సీఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని పేర్కొంటూ ఇటీవల కాలంలో కేంద్రంపై నిప్పులు చెరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా స్టాలిన్ పోరాటం ప్రారంభించారు. జనాభా నియంత్రణను పాటించిన రాష్ట్రాలకు ఈ పునర్విభజన ద్వారా నష్టం కలుగుతుందని, అదేసమయంలో జనాభా నియంత్రణను పట్టించుకోని బీజేపీ పాలిత ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అన్ని ప్రాంతీయ భాషలకూ

కేంద్రం ప్రాధాన్యం

మెడికల్, ఇంజనీరింగ్ పాఠాలు తమిళంలోకి అనువదించాలని స్టాలిన్‌కు చెబుతున్నా: షా

చెన్నై, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం కల్పిస్తోందని, మోదీ అధికారంలోకి వచ్చాకే సీఐఎస్ఎఫ్ ఎంపిక పరీక్షలు తమిళం సహా ఇతర ప్రాంతీయ భాషల్లో రాసే సదుపాయం కల్పించారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. తమిళనాడులోని రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని తక్కోలం వద్దనున్న రాజాదిత్య చోళన్ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) శిక్షణా కేంద్రంలో శుక్రవారం జరిగిన 56వ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన పదిమందికి రాష్ట్రపతి పతకాలు, ఇరువురికి జీవన్ రక్షా పతకాలు, 10 మందికి ప్రత్యేక పతకాలను ప్రదానం చేశారు. అనంతరం అమిత్‌షా ప్రసంగిస్తూ.. మెడికల్, ఇంజనీరింగ్ కోర్సుల పాఠ్యాంశాలను తమిళంలో అనువదించాలని, అది తమిళ మాధ్యమ విద్యార్థులకు సులభంగా ఉంటుందని గత రెండేళ్లుగా తమిళనాడు సీఎం స్టాలిన్‌కు తాను ప్రతిపాదిస్తూనే ఉన్నానని తెలిపారు. ప్రధాని మోదీ తమిళ భాషకు, తమిళ సంస్కృతీ సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. భారతీయ సంస్కృతిని తమిళ సంస్కృతి మరింత పటిష్ఠం చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ కోటిమంది పౌరులకు సీఐఎస్ఎఫ్ పటిష్ఠమైన భద్రతను కల్పిస్తుండటం హర్షణీయమన్నారు. సీఐఎస్ఎఫ్ ప్రాంతీయ శిక్షణా కేంద్రానికి చోళవంశీయుడైన రాజాదిత్య చోళుడి పేరు పెట్టడం అన్ని విధాలా ప్రశంసనీయమని చెప్పారు. సీఐఎస్ఎఫ్‌లో ఈ యేడాది లక్షమందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు.

లోకం తీరు



2050కల్లా 44 కోట్ల మందికి ఊబకాయం

బరువు తగ్గడంపై ప్రజలు దృష్టి పెట్టాలి:మోదీ

సిల్వస, మార్చి 7: జీవనశైలి కారణంగా వచ్చే వ్యాధులు మన ఆరోగ్యానికి పెను ముప్పుగా పరిణవిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందులో ఊబకాయం ఒకటని, అనేక జబ్బులకు ఇదే మూలకారణమని చెప్పారు. ఇటీవల విడుదలైన ఒక సర్వే ప్రకారం మన దేశంలో 2050 నాటికి 44 కోట్ల మంది ప్రజలు ఊబకాయ సమస్య బారిన పడే అవకాశం ఉందని మోదీ తెలిపారు. శుక్రవారం ఆయన కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీలోని సిల్వస పట్టణంలో రూ.2,587 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. ఊబకాయం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలన్నారు. బరువు తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించాలని తాను ఇప్పటికే ప్రజలకు విజ్ఞప్తి చేశానన్నారు. అందరూ 10 శాతం తక్కువగా వంట నూనెలను కొనుగోలు చేస్తామని ప్రతినబూనాలని కోరారు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం, సైక్లింగ్ చేయాలని చెప్పారు.

సుంకాల తగ్గింపునకు

భారత్ ఒప్పుకొంది

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

» ఎలాంటి వ్యాఖ్య చేయని విదేశీ వ్యవహారాల శాఖ



వాషింగ్టన్, మార్చి 7: అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. వారు ఇంతవరకు చేసినదాన్ని ఇప్పుడు ఎవరో ఒకరు బయటపెడుతున్నందున పన్నులు తగ్గింపునకు అంగీకరించారని వ్యాఖ్యానించారు. అయితే భారత విదేశీ వ్యవహారాల శాఖ మాత్రం దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయకపోవడం గమనార్హం. ట్రంప్ ప్రకటన మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. రానున్న కొద్ది నెలల్లో వాహనాల తయారీ సంస్థ అయిన టెస్లా భారత్ మార్కెట్‌లో ప్రవేశించనుంది. టెస్లా వాహనాలపై భారత్ ప్రస్తుతం 110% దిగుమతి సుంకం విధిస్తోంది. మరోవైపు, కెనడా వస్తువులు అమెరికాకు అవసరం లేదని ట్రంప్ చెప్పారు. కెనడా నుంచి కలపను దిగుమతి చేసుకోబోమని, అమెరికా అడవుల్లోని కలపను ఉపయోగించుకుంటామని తెలిపారు. అమెరికా పాల ఉత్పత్తులపై కెనడా 220 శాతం సుంకం విధిస్తుండడాన్ని తప్పుపట్టారు. రష్యాపైనా బ్యాంకింగ్ ఆంక్షలు, సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్‌తో చర్చలు జరిపి, కాల్పులు విరమించే వరకు ఇవి కొనసాగుతాయని తెలిపారు. అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి లేఖ రాసినట్టు తెలిపారు.

చిన్న కత్తి చాలు.. గొడ్డలెందుకు

'ఆపరేషన్లు చేసే చిన్న కత్తి చాలు.. చిన్న గొడ్డలి ఎందుకు?' అంటూ తన సలహాదారు ఎలాన్ మస్క్‌కు ట్రంప్ సూచించారు. డోజ్ సారథిగా మస్క్... ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను, వ్యయాన్ని భారీగా తగ్గిస్తుండడంతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డోజ్ అద్భుతంగా పనిచేస్తోందని ప్రశంసిస్తూనే.. ప్రభుత్వ విభాగాలకు కార్యదర్శులే తప్ప మస్క్ అధిపతి కాదని స్పష్టం చేశారు. సిబ్బందిని తగ్గించాలని ఆయన సిఫార్సు చేసినా, పూర్తిగా అమలు చేయాల్సిన పనిలేదని కూడా తెలిపారు.

భారత్-చైనా భాయీ భాయీ!

» ఇరు దేశాలు చేతులు కలిపితే ప్రపంచ ప్రజాస్వామ్యం బలోపేతం

» ఏనుగు, డ్రాగన్ కలిసి డ్యాన్స్ చేయాలి

» చైనా విదేశాంగమంత్రి వాంగ్ ఈ



బీజింగ్, మార్చి 7: భారత్-చైనా చేతులు కలిపితే అంతర్జాతీయంగా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని, ప్రపంచ దక్షిణాది దేశాలు శక్తిమంతమవుతాయని చైనా విదేశాంగమంత్రి వాంగ్ ఈ పేర్కొన్నారు. నియంతృత్వం, దౌర్జన్య రాజకీయాలకు వ్యతిరేకంగా ఈ రెండు దేశాలూ అగ్రగామి పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పరోక్షంగా అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చైనా పార్లమెంటు వార్షిక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాంగ్ శుక్రవారం దేశ, విదేశ మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై మాట్లాడారు. భారత్ చిహ్నమైన ఏనుగును, చైనా చిహ్నమైన డ్రాగన్‌ను ప్రస్తావిస్తూ.. 'ఏనుగు, డ్రాగన్ కలిసి నాట్యం చేయటమే భారత్-చైనా సంబంధాలకు సరైన మార్గం. ఒకరికొకరికి నష్టం చేసుకోవటం కంటే పరస్పరం సహకరించుకోవాలి. ఒకరి మీద ఒకరం నిఘా పెట్టుకోవటం కంటే.. చేతులు కలిపి సమిష్టిగా పని చేయాలి. దీనివల్లే మన రెండు దేశాలకూ లబ్ధి చేకూరుతుంది' అని వాంగ్ తెలిపారు. ప్రాచీన నాగరికతలకు నిలయమైన ఇరుదేశాలూ సరిహద్దు సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని వాంగ్ చెప్పారు. ఈ ఏడాది భారత్-చైనా దౌత్య సంబంధాలు 75వ వార్షికోత్సవాన్ని జరుపుకొంటాయని గుర్తు చేస్తూ.. గత సుదీర్ఘ అనుభవాల నేపథ్యంలో కొత్త ప్రణాళికలు రచించి ఇరుదేశాల సుస్థిర అభివృద్ధి కోసం భారత్‌తో కలిసి పని చేయటానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. చైనాతోపాటు పలు దేశాలపై విధిస్తున్న సుంకాలపై తీవ్రంగా స్పందిస్తూ.. అంతర్జాతీయ సహకారాన్ని పక్కనపెట్టి, ఏ దేశానికి ఆ దేశం సొంత ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తే ప్రపంచం ఆటవికరాజ్యంగా మారుతుందని వాంగ్ వ్యాఖ్యానించారు. చిన్న, బలహీన దేశాలు తొలుత తీవ్రంగా నష్టపోతాయి.. అంతర్జాతీయ నిబంధనలు, వ్యవస్థలు ధ్వంసమవుతాయని హెచ్చరించారు.

సొంత ఆదాయానికే సర్కారు గండి!

(మొదటి పేజీ తరువాయి)

సాధించిందా? అంటే ఏమీలేదు. దీనివల్ల నష్టపోయింది ప్రభుత్వమే! వాస్తవాలు ఇలా ఉంటే, గనుల శాఖ మాత్రం ఆ నాలుగు నెలల కాలంలో కోల్పోయిన ఆదాయాన్ని కాంట్రాక్టు సంస్థలు చెల్లించాల్సిన బకాయిలుగా చూపిస్తోంది. ఇదెలా సాధ్యం? 'వసూలు ఆపండి' అని ఆదేశించింది ప్రభుత్వమే కదా!

అంచనా రూ.2వేల కోట్లు

గత ప్రభుత్వం 2023లో ఉమ్మడి జిల్లాల ప్రతిపాదికన గనుల శాఖలో మైనర్ మినరల్స్ సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్టులు(ఎస్‌సీసీ) తీసుకొచ్చింది. అంతకుముందు గనుల శాఖనే నేరుగా మైనింగ్ లీజుదారుల నుంచి సీనరేజీ, డెడ్‌రెంట్, కన్సిడరేషన్, ఇతర అనేకరకాల ఫీజులను వసూలుచేసి ప్రభుత్వానికి జమ చేసేది. దీని వల్ల అనేక లీకేజీలు ఉంటున్నాయన్న నిపుణుల సూచనలతో సీనరేజీ కలెక్షన్‌ను ఉమ్మడి జిల్లాల వారీగా ప్రైవేటు సంస్థలకు నాడు అప్పగించారు. తొలుత ఏడు జిల్లాలకు (శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, విజయనగరం, కడప, తూర్పుగోదావరి జిల్లాలు) ఏజెన్సీలను ఎంపిక చేశారు. 2023 నుంచి రెండేళ్ల కాలపరిమితితో ఆ సంస్థలు సీనరేజీ వసూలు చేసి నెలవారీగా ప్రభుత్వానికి చెల్లింపులు చేస్తున్నాయి. కాగా.. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో గనుల శాఖనే వసూళ్లు చేస్తోంది. ఇటు కాంట్రాక్ట్ జిల్లాలు, అటు గనులశాఖ నియంత్రణలో ఉన్న జిల్లాల్లో ఏటా రూ.2వేల కోట్ల ఆదాయం రావాలి.

కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్‌లోనే సీనరేజీ కాంట్రాక్ట్‌లను నిలిపివేశారు. బహుశా... పాత కాంట్రాక్టర్లను మార్చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం కావొచ్చు. దీంతోపాటు ఇతర కారణాలతో సీనరేజీ కాంట్రాక్టులను అనధికారికంగా నిలిపివేశారు. పోనీ... వెంటనే కొత్త వాళ్లకు కాంట్రాక్టులు అప్పగించి, వసూళ్లు చేశారా అంటే అదీ లేదు. నాలుగున్నర నెలలపాటు విషయాన్ని నానబెట్టేశారు. గనులశాఖ నియంత్రణలో ఉన్న ఆరు జిల్లాల్లోనూ అన్ని రకాల పర్మిట్లను ఆపారు. దీంతో సర్కారుకు 1,300 కోట్లపైనే నష్టం జరిగినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. చివరికి... గత ఏడాది నవంబరు నుంచి తిరిగి సీనరేజీ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించారు. అప్పటికే ఉన్న కంపెనీలనే కొనసాగించారు. ఆపడం ఎందుకు, మళ్లీ వాళ్లనే కొనసాగించడం ఎందుకు? ఈ నాలుగు నెలలు ఎందుకు ఆపారు? ఆపడం వల్ల ఏమైనా కొత్త విషయాలు కనిపెట్టిందా? అంటే ఏమీలేదు.

ఆ సంస్థలపై బకాయి పిడుగు

రూ.800 కోట్లను తాము చెల్లించాల్సిన బకాయిగా చూపడంపై కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాటిని మాఫీ చేయాలని గత కొంతకాలంగా కోరుతున్నాయి. అలాగే, తమ కాంట్రాక్ట్ నిలిపివేసినందుకు అదనంగా మరో నాలుగు నెలల కాలాన్ని పొడిగించాలని కోరుతున్నాయి. వీటిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని గనుల శాఖ సర్కారుకు నివేదించాలి. సమస్య ఏమిటో, దానికి మూలాలు ఎక్కడున్నాయో తెలిసినా దీనిపై ప్రభుత్వం స్పందించడంలేదు. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోవడం లేదు. నష్టాలు వస్తున్నాయని నివేదికలపై నివేదికలు ఇస్తున్నారేగానీ, వాటికి పరిష్కారమార్గాలు, ప్రత్యామ్నాయాల గురించి గనుల శాఖ సీఎం వద్ద ప్రస్తావించడం లేదు. ఈ విషయంలో మంత్రివర్గస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని సీఎం పలుమార్లు ప్రస్తావించినా, ఆ దిశగా గనుల శాఖ నుంచి ప్రతిపాదనలు తెప్పించుకోలేదు. దీంతో ఐదు నెలలుగా ఈ విషయంలో ప్రతిష్ఠంభన నెలకొంది. ఈలోగానే కంపెనీల కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసిపోతోంది. ఇప్పటికే చిత్తూరు (రాఘవ కన్‌స్ట్రక్షన్స్), అనంతపురం(అమిగోస్) జిల్లాల కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసింది. శ్రీకాకుళం ఈనెల 17, కడప ఈనెల 28, తూర్పుగోదావరి ఏప్రిల్ 14, విజయనగరం జూలై 17, గుంటూరు సెప్టెంబరు 28తో కాంట్రాక్ట్ ముగియనుంది. చిత్తూరు, అనంతపురం జిల్లా ల్లో వసూళ్లను తిరిగి గనుల శాఖ అధికారులకు అప్పగించారు.

మినరల్స్ పర్మిట్లను వెంటనే

పునరుద్ధరించండి

» సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలి

» పరిశ్రమతో పాటు ప్రభుత్వానికీ నష్టమే

» నీతి ఆయోగ్ ఎదుట ఫెమీ ఆవేదన



విజయవాడలో జరిగిన జాతీయ సెమినార్‌లో ప్రసంగిస్తున్న ఫెమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.హెచ్.రావు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వంలో మైనర్ మినరల్స్‌పై పన్నుల మీద పన్నులు బాదారు. చివరకు కరోనా పేరు చెప్పి ఫీజులు వసూలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా తమ పరిస్థితి మారుతుందని ఆశించాం. గత ఎనిమిది నెలలుగా పర్మిట్లు ఆపేశారు. ఎందుకు ఆపారో చెప్పడం లేదు. దీనివల్ల పరిశ్రమ దెబ్బతింటోంది. ఇంకెంతకాలం పర్మిట్లు ఆపుతారు? దీనివల్ల పరిశ్రమతో పాటు ప్రభుత్వానికి తీవ్ర నష్టమే. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని సత్వర నిర్ణయం తీసుకోవాలి" అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీ (ఫెమీ) డిమాండ్ చేసింది. రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చే మినరల్స్ పర్మిట్లను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఫెమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.హెచ్.రావు ప్రభుత్వాన్ని కోరారు. మైనర్ మినరల్స్ రంగంలో సవాళ్లు, అవకాశాలు అన్న అంశంపై ఫెమీ శుక్రవారం విజయవాడలో జాతీయ సెమినార్ నిర్వహించింది. నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్, ఉప సలహాదారు ఆర్.శర్వణ భావన్, కేంద్ర గనుల శాఖ అధికారులు ఆర్.ఎం. భట్టాచార్జీ, ఐబీఎమ్ డిప్యూటీ కంట్రోలర్ డి.డి.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనర్ మినరల్స్‌పై జాతీయ స్థాయిలో ఉన్న సమస్యలు, ప్రత్యేకించి ఏపీలో నెలకొన్న పరిస్థితుల గురించి డాక్టర్ సి.హెచ్.రావు ప్రస్తావించారు. 'ఎన్నికలకు ముందు లోకేశ్ పాదయాత్రలో మేం కలిసి సమస్యలను ప్రస్తావించాం. పన్నుల భారం సమీక్షించాలని విజ్ఞప్తి చేశాం. ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబుపై మాకు పూర్తి నమ్మకం ఉంది. పర్మిట్ల విషయంలో సీఎం జోక్యం చేసుకొని పరిష్కారం చూపాలి' అని ఆయన కోరారు. గత ఎనిమిది నెలల కాలంగా అన్ని రకాల పర్మిట్లు ఆపారన్న అంశంపై నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్ ఆరా తీశారు. జాతీయ మైనర్ మినరల్ పాలసీలో మార్పులు తీసుకురావాలని, ఒకే దేశం, ఒకే మైనర్ మినరల్ పాలసీ, ఒకే పన్ను విధానాన్ని తాను సమర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పుట్టా రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మైనింగ్ రంగ నిపుణులు, సిమెంట్, మైనింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు

» కలెక్టర్లకు ఫార్మాట్ పంపిన ప్రభుత్వం

» ఫిర్యాదుల ఆధారంగా రద్దుకు ఆదేశం

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించడం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. అక్రమంగా జరిగిన ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆడిట్ సందర్భంగా బయటపడిన దొంగ రిజిస్ట్రేషన్లు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కలెక్టర్లు రిజిస్ట్రేషన్ల రద్దు ప్రక్రియను చేపడతారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఏది ప్రభుత్వ భూమో కాదో తేల్చే అధికారం కలెక్టర్‌దే. సాక్ష్యాల ఆధారంగా ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ల పత్రాలను ఆయా మండల తహశీల్దార్ ద్వారా సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దు చేయిస్తారు. ఈ మేరకు కలెక్టర్లకు ప్రభుత్వం ఫార్మాట్లు పంపింది. దేవదాయ, ఇతర ప్రభుత్వ భూములు మళ్లీ స్వాధీనం చేసుకోవడానికి ఈ చర్యలు చేపట్టింది. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆడి ట్ ద్వారా బయటపడిన ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలను ఆ శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఏఎన్‌యూ బీఈడీ ప్రశ్నపత్రం లీక్

» పరీక్షకు అరగంట ముందే బయటకు
» ఘటనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం.. పరీక్ష రద్దు

అమరావతి, పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పరిధిలో జరుగుతున్న బీఈడీ పరీక్షలకు సంబంధించి మొదటి సెమిస్టర్ ప్రశ్నపత్రం లీక్ అయింది. ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పరీక్ష శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. దానికి అరగంట ముందే ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలుస్తోంది. సీడీ ద్వారా ఆన్‌లైన్‌లో అరగంట ముందుగా ప్రశ్నపత్రాన్ని విడుదల చేశామని, కానీ అది ఎలా బయటికి వచ్చిందో తమకు తెలియదని సంబంధిత అధికారులు బుకాయిస్తున్నారు. మొబైల్ ద్వారా అరగంట ముందే ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టినట్టు సమాచారం. అధికారుల అలసత్వం, అక్రమాలు కారణంగానే ప్రశ్నపత్రం లీక్ అయినట్టు భావిస్తున్నారు. పరీక్షా కేంద్రాల నిర్వహణ, అబ్జర్వర్ల నియామకంలో కొందరు ఇష్టానుసారం వ్యవహరించడం వల్లనే పేపర్ బయటకొచ్చిందని చెబుతున్నారు. యూనివర్సిటీ పరిధిలో పరీక్షల నిర్వహణ వ్యవహారాలన్నీ తెర వెనక ఉండి నడిపిస్తున్న వర్సిటీకి చెందిన అధికార పార్టీ నాయకుడిగా చెప్పుకుంటున్న ఓ ఉద్యోగి కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల మాస్ కాపీయింగ్ తదితర అవకతవకలతో పాటు ప్రస్తుత పేపర్ లీకేజీ ఘటన వెనుక కూడా ఆ ఉద్యోగి హస్తం ఉందని కళాశాలల యాజమాన్యాలు భావిస్తున్నాయి.

లీకేజీ వెనుక ఎవరున్నా ఉపేక్షించం: లోకేశ్

ఏఎన్‌యూ పరిధిలో శుక్రవారం బీఈడీ మొదటి సెమిస్టర్ ప్రశ్నపత్రం లీక్ కావడంపై ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరున్నా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చ ర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల నివేదికపై సంతృప్తి చెందని ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేసినట్టు తెలిపింది.

ఉన్నత విద్యలో మార్పుతోనే దొరస్వామికి నివాళి

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
» అధికార లాంఛనాలతో దొరస్వామి అంత్యక్రియలు


దొరస్వామికి నివాళులు అర్పిస్తున్న వెంకయ్యనాయుడు

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో మార్పులు తీసుకురావడం ద్వారానే దొరస్వామికి ఘన నివాళులు అర్పించినట్టు అవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నా రు. పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి పార్థివదేహాన్ని బెంగళూరులో శుక్రవారం ఆయన దర్శించి, నివాళులు అర్పిం చారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన అనంతరం వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. దొరస్వామితో తనకు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధం ఉందని, తాము కలిసిన ప్రతిసారి ఉన్న త విద్య అంశంపై చర్చించుకునేవారమని తెలిపారు. కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వీరప్పమొయిలీ, ఏపీ ఎమ్మెల్యేలు గురజాల జగన్, భానుప్రకాశ్, అమిలినేని సురేంద్రబాబు సహా పలు విద్యాసంస్థల ప్రముఖులు దొరస్వామికి ఘన నివాళులు అర్పించారు. బనశంకరిలోని ఆయ న నివాసం నుంచి హనుమంతనగర్ క్యాంపస్‌కు పార్థివ దేహాన్ని శుక్రవారం తీసుకువచ్చారు. అక్కడి నుంచి బనశంకరిలోని శ్మశానవాటికదాకా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అధికార లాంఛనాలతో కుమారుడు జవహర్ దొరస్వామి అంత్యక్రియలు నిర్వహించారు.

వీఐటీ–ఏపీలో విటోపియా–2025

» 'వసుదైకం' పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు
» మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలు


శ్రావణ్: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా-2025 పేరిట మూడు రోజుల భారీ సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా 'వసుదైకం': రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్ విటోపియా-2025ను శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 9వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతిభ, క్రీడా స్ఫూర్తి, సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పేలా రూపొందించారు. పలు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్న సాంస్కృతిక ర్యాలీ: 'వసుదైకం'తో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సంప్రదాయ వస్త్రధారణతో తమ ప్రాంతీయ నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న విటోపియా-2025 మన దేశ సంప్రదాయాలు, సంస్కృతికి అద్దంపట్టేలా ఉందని, ఇది మరపురాని వేడుక అవుతుందని శ్రావణ్‌కుమార్ తెలిపారు. విటోపియా-2025 విద్యార్థులకు అనుకూల వాతావరణాన్ని పెంపొందించడానికి వీటీటీ-ఏపీ రూపొందించిన అద్భుత కార్యక్రమమని వీఐటీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శంకర్ విశ్వనాథన్ వెల్లడించారు. విద్యా సంబంధ విషయాల్లో ప్రోత్సాహంతో పాటు, విద్యార్థుల్లో సృజనాత్మకత వ్యక్తీకరణకు, వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వేదికగా నిలుస్తుందని వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటా రెడ్డి తెలిపారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

» అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో 65 మంది ఎంపిక

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లకు నారాయణ విద్యాసంస్థలకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణలు శుక్రవారం వెల్లడించారు. హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, భారత ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఎంపికలు నిర్వహిస్తోందని వారు తెలిపారు. ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌లో.. ఆస్ట్రానమి క్యాంప్‌కు 14 మంది, ఫిజిక్స్ జూనియర్ సైన్స్ క్యాంప్‌లకు 9 మంది చొప్పున, జూనియర్ ఆస్ట్రానమి, కెమిస్ట్రీ, బయాలజీ క్యాంపులకు ఏడుగురు చొప్పున విద్యార్థులు, ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. తమ విద్యా సంస్థల నుంచే 65 మంది ఎంపిక కావడం ఆనందంగా ఉందని, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏ పోటీల్లోనైనా నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో బేసిక్స్‌కు ప్రాధాన్యమిస్తూ పూర్తిస్థాయి నాలెడ్జ్ ఉండేలా వారిని తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఈడీ పునీత్ అభినందించారు.

'తిరుపతి' తొక్కిసలాటపై ఇద్దరు ఐపీఎస్ అధికారులకు సమన్లు?

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనపై ఈ నెల 20వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ అప్పటి టీటీడీ సీవీఎస్వో, ఇప్పటి ఇన్‌చార్జి శ్రీధర్, మణికంఠ చందోలు(చిత్తూరు ఎస్పీ)కు ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం రాత్రి సమన్లు జారీ చేసినట్టు తెలిసింది. అలాగే, తొక్కిసలాట రోజున బైరాగిపట్టెడ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న 43 మంది టీటీడీ విజిలెన్సు సిబ్బందికీ సమన్లు పంపినట్టు సమాచారం. కాగా, మూడోదశ విచారణలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి వారం రోజులపాటు జస్టిస్ సత్యనారాయణమూర్తి కలెక్టరేట్‌లో దాదాపు వంద మందిని ప్రత్యక్షంగా విచారించి, వాంగ్మూలాలు స్వీకరించనున్నారు.

గవర్నర్‌ను కలిసిన ఉన్నత విద్యామండలి చైర్మన్

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల (వీసీ) నియామకం, ఇతర వర్సిటీల అంశాలను చైర్మన్.. గవర్నర్‌కు వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా విద్యార్థుల పార్టీ!

బంగ్లాదేశ్‌లో షేక్‌హసీనా పాలనమీద తిరుగుబాటు చేసి, ఆమెను గద్దెదించే లక్ష్యంతో సుదీర్ఘకాలం ఉద్యమాన్ని నడిపించిన విద్యార్థినాయకులు ఇటీవల ఒక కొత్త పార్టీ ఆరంభించడం విశేషమైన పరిణామం. పార్లమెంట్ భవనం ఎదురుగా వేలాది విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో నేషనల్ సిటిజెన్స్ పార్టీ (ఎన్సీపీ) ఆరంభం ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఒక ఉద్యమం, అనంతరకాలంలో కొత్త శక్తుల ప్రవేశంతో హసీనా వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెంది, అంతిమంగా ఆమె స్వదేశాన్ని వీడి భారత్ చేరింది. ఎన్సీపీ ఏర్పాటు అంత సునాయాసంగా ఏమీ సాధ్యపడలేదని, జమాతే ఇస్లామీ విద్యార్థి సంఘానికి చెందిన ఇద్దరు నాయకులకు చోటిచ్చే విషయంలో వివాదం రేగి, తిరుగుబాట్లు, సర్దుబాట్లతో ప్రస్తుతానికి సద్దుమణిగిందని అంటారు. రాబోయే కాలంలో విద్యార్థినాయకులంతా ఒక్కటిగా, పటిష్ఠంగా పార్టీని ముందుకు తీసుకుపోగలరా అన్నది అటుంచితే, బంగ్లాదేశ్ రాజకీయాలను దశాబ్దాలుగా గుప్పిట్లో పెట్టుకున్న రెండు వంశాలకు ఈ కొత్త పార్టీ సవాలు విసిరే సూచనలైతే ఉన్నాయి.

బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబూర్ రహ్మాన్ కుమార్తె హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఒకవైపు, సైనిక పాలకుడు జియావుర్ రహ్మాన్ కుమార్తె ఖలీదాజియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పి) మరోకవైపు ఉంటూ పరస్పర ఘర్షణలతో దేశాన్ని ఒక యుద్ధక్షేత్రం లాగా మార్చేశారు. వారి వైరానికి వందలాదిమంది బలైనారని తెలిసిందే. ఎవరు అధికారంలో ఉన్నా ఎదుటిపక్షం నాయకులను జైళ్ళలో పెట్టడానికీ, కార్యకర్తల ప్రాణాలు తీయడానికి వెనుకాడేవారు కాదు. ఈ ఇరువురి అనంతరం దేశాన్ని ఏలడానికి వారసులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. హసీనాను దేశంనుంచి తరిమివేసి, ఖలీదా జియాను జైలునుంచి బయటకు తేవడం ఇటీవలి పరిణామం. ఖలీదా కుమారుడు బిఎన్‌పి నాయకత్వహోదాలో ఉంటూ, ఇంతకాలమూ వెనుకపట్టుపట్టిన పార్టీని ఉద్ధరించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా ఒక కొత్తపార్టీ పెట్టడం రెండు ప్రధానపార్టీలకూ పెద్ద సమస్యే.

ఉద్యమానంతరం ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన వీరిని, దేశానికి నాయకత్వం వహించడానికి ప్రజలు అంగీకరిస్తారా? అన్నది ప్రధానం. పార్టీ డిక్లరేషన్ ఎంతో అందమైన, ఉన్నతమైన ఆదర్శాలనూ, ఆశయాలనూ ప్రకటించింది. దారిద్ర్యం, అసమానతలు, అధికార దుర్వినియోగం నుంచి ప్రజలకు రక్షణలను ఇస్తామన్నది. ప్రజల్లో ఏ వర్గాన్నీ నిర్లక్ష్యం చేయబోమనీ, సామాజిక, సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని కాపాడుతూ, బహుళత్వాన్ని పరిరక్షించుకుంటూ, సుసంపన్నమైన దేశాన్ని నిర్మించుకుంటామని ప్రకటించింది. నాయకత్వస్థానాల్లో మహిళలు, దళితులకు ప్రాతినిధ్యం దక్కడం, కోటా వ్యతిరేక ఉద్యమంలో కనిపించిన అన్ని వర్గాలకూ ఇప్పుడూ చోటు ఉంటూ, పార్టీ నాయకత్వం వైవిధ్యభరితంగా ఉండటం మెచ్చదగింది. ఇక, భారత్ అనుకూల, పాకిస్థాన్ అనుకూల రాజకీయాలకు తమ దేశంలో చోటులేదని ఎన్సీపీ కన్వీనర్ చేసిన ప్రకటన ఆచరణసాధ్యమైనదేనా? అన్నది ప్రశ్న. దేశప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనే నవీన వ్యవస్థల, విధానాల నిర్మాణం జరుగుతుందని ఆయన అన్నారు. ఇది అవామీలీగ్, బిఎన్‌పిలకంటే జమాత్‌ను దృష్టిలో పెట్టుకొని చేసిన వ్యాఖ్య అని విశ్లేషకుల అభిప్రాయం. హసీనా లేకపోవడంతో జమాత్ అన్ని రంగాల్లోనూ చక్రం తిప్పుతోందని, ప్రభుత్వ ఉద్యోగాల్లోకి చొరబడుతోందని వార్తలు వినబడుతున్న నేపథ్యంలో, అది స్వయంగా తన విద్యార్థినాయకులతో ఒక పార్టీ పెట్టించే పనిలో ఉందని కూడా అంటున్నారు.


దేశం సంక్లిష్టమైన స్థితిలో ఉండగా, యూనస్ ప్రభుత్వంమీద ప్రజా విశ్వాసం సన్నగిల్లుతున్న నేపథ్యంలో ఎన్సీపీ ఆవిర్భావం జరిగింది. ఇప్పటివరకూ ఈ విద్యార్థి నాయకులకు మంచిపేరే ఉన్నందున, అవినీతి రహిత స్వచ్ఛ రాజకీయాలకు కట్టుబడివుంటామన్న వారి హామీని ప్రజలు విశ్వసించవచ్చు. పార్టీ ర్యాలీలో ఖురాన్, భగవద్గీత పఠనం బహుళత్వానికీ, లౌకికవాదానికి కట్టుబడివుంటానన్న హామీకి రుజువు కావచ్చు. మతవాద జమాత్, మితవాద బీఎన్పీల విలువలు, సిద్ధాంతాలకు దూరంగా, భిన్నంగా నడవాలనుకుంటున్న ఈ పార్టీని బంగ్లాదేశ్ ప్రజలు ఎంత ఆదరిస్తారో చూడాలి.

సమాజంలో నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్న లైంగిక హింస, అసమానతలు, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటివి మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలుస్తున్నాయి. లింగ వివక్ష సమసిపోవడమే ఈ సమస్యకు మేలైన పరిష్కారం. నా దృష్టిలో మహిళా సాధికారతకు నిదర్శనం మహిళలకు సమానంగా ఆస్తి హక్కు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు వంటివే.

మహిళా సాధికారతతోనే వికసిత భారతం

మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

నేను ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి యువతతో కలవడం, వారి ఆకాంక్షలను తెలుసుకోవడం, నా అనుభవాలను పంచుకోవడం, భవిష్యత్ దిశగా వారికి దిశానిర్దేశం చేయడాన్ని నా కర్తవ్యంగా ముందుకు సాగుతున్నాను. ఈ సమయంలో ఓ విషయం నన్ను ఎంతగానో ఆకట్టుకునేది. ఏ విద్యాసంస్థ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడ మంచి ప్రతిభ చూపిన వారికి నా చేతుల మీదుగా అవార్డులు అందింపజేసేవారు. ఆ



సమయంలో నా చేతుల మీదుగా అవార్డులు అందుకునే వారిలో... ఎక్కువ శాతం (65 శాతానికి పైగా) ఆడపిల్లలే ఉండేవారు. అవకాశం ఇస్తే... వారు ఏ విధంగా ఎదగగలరు అనే విషయానికి ఇదే ఉదాహరణ. విద్యా రంగంలోనే కాదు, నేడు అనేక రంగాల్లో మహిళా సాధికారత ఫలాలు మనం చూస్తూనే ఉన్నాం. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చెప్పిన ఓ మాట నాకు జ్ఞప్తికి వస్తోంది.

"మహిళలు ఇతరులపై ఆధారపడకుండా, తమ జీవితాలను తాము నియంత్రించుకోగలిగే విధంగా, తమ సవాళ్ళను తామే పరిష్కరించుకునే విధంగా సాధికారత పొందాలి."

ఈ ఆకాంక్షలోని అంతర్యాన్ని ఈ తరం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. మహిళా సాధికారత, స్త్రీ స్వేచ్ఛను అనేక కోణాల్లో ఆలోచించి అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా సంప్రదాయవాదులం అని చెప్పుకుంటూ మహిళా స్వేచ్ఛకు అడ్డంకిగా మారుతున్న ఆలోచనా విధానాల్లో మార్పు రావలసిన అవసరం ఉంది. భారతీయ సంస్కృతి స్త్రీని శక్తి స్వరూపంగా పూజించింది. 'శక్తి రూపేణ సంస్థిత' అంటూ మన సనాతన ధర్మం అమ్మవారిని అభివర్ణించింది. ఇక్కడ నదుల పేర్లు స్త్రీ రూపాలే. భూమాత, ప్రకృతి మాత, చెట్టు తల్లి... ఇలా మనిషికి మేలు చేసే ప్రతిదీ అమ్మ స్వరూపంగా భావించాం. విద్యలకు సరస్వతి మాతను, వేదాలకు గాయత్రి మాతను, సంపదకు లక్ష్మీ మాతను, ధైర్యానికి పార్వతీ మాతను పూజిస్తాం. సీతారాములు, పార్వతి పరమేశ్వరులు, లక్ష్మీ నారాయణులు అంటూ అగ్రస్థానాన్ని అమ్మవారికే ఇస్తూ వస్తున్నాం. అంతేనా శివుడు అర్ధనారీశ్వరుడుగా సగభాగం అమ్మవారికి ఇస్తే, శ్రీమహావిష్ణువు గుండెల్లో నిలుపుకున్నాడు. ఇక్కడ మనం గమనించాల్సింది... ఇంతగా స్త్రీలను భారతీయ సంస్కృతి గౌరవించింది.

ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న భారతదేశం మీద కన్నేసిన పరాయి దేశాలు, మన సంస్కృతిని నాశనం చేసి, మన మీద పెత్తనం చేయాలని చూశాయి. అదే సమయంలో భారతదేశం మాత్రమే గాక... భారతీయ స్త్రీల సాధికారత సైతం చీకటిలోకి వెళ్ళిపోయింది. స్వరాజ్యం సాధించుకునే



సమయానికి పరదేశీయులకు భయపడి ఏర్పాటు చేసుకున్న ఆంక్షలు సంప్రదాయాలుగా మారిపోయాయి. అవే మహిళా సాధికారతకు అడ్డంకిగా మారడం విచారకరం. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే... ముందుగా సమాజం ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలి. "స్త్రీలను గౌరవించి, వారికి అధికారం ఇచ్చే దేశాన్ని అభివృద్ధి చెందిన, నాగరిక దేశంగా భావించాలి" అన్న స్వామి వివేకానంద పలుకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ శక్తిగా భారత్ ఎదిగే క్రమంలో ప్రధాన అడ్డంకిగా మారుతున్న వివక్షలు, అసమానతలకు వ్యతిరేకంగా యువతీ యువకులు గళం ఎత్తాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితి రావాలంటే ముందుగా 'స్త్రీ విద్య' ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలి. పురుషుడి చదువు అతడికి మాత్రమే భవిష్యత్‌ను ఇస్తే, స్త్రీ విద్య మొత్తం కుటుంబ అభివృద్ధికి బాటలు వేస్తుంది. మహిళలు విద్యావంతులు కావడం వల్ల శిశుమరణాల రేటు తగ్గుతుంది. కుటుంబ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పిల్లల పోషణ, ఆరోగ్యంతో పాటు వారి విద్యాపరమైన అవకాశాల మీద సానుకూల ప్రభావం ఏర్పడి అనేక సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. భారత ప్రభుత్వం ప్రారంభించిన బేటీ బచావ్ - బేటీ పఢావ్, సుకన్య సమృద్ధి యోజన లాంటి పథకాలు సమాజంలో మార్పునకు బీజాలు వేశాయి. నేను నెల్లూరు వెళ్ళినప్పుడు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వచ్చి, నన్ను కలిసే చాలా పేద కుటుంబాలు ఈ పథకాల వల్ల తమకు ఎలాంటి ఉపయోగాలు లభించాయో తెలియజేస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది.

స్వరాజ్యం సముపార్జించుకుని 75 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా మహిళా విద్య, మహిళా సాధికారత లాంటి అంశాల మీద మాట్లాడాల్సిన పరిస్థితి రావడం ఓ విధంగా బాధాకరమే. అయితే గత పదేళ్లుగా మొదలైన మార్పులు ప్రజా ఉద్యమాలుగా రూపుదాల్చి, వికసిత భారత సాకారం దిశగా ముందుకు సాగుతుండటం ఆనందదాయకం. ప్రపంచ వ్యాప్తంగా అనేక పెద్ద దేశాలతో పోల్చి చూస్తే, భారత్ సాధించిన మహిళా సాధికారత వేగం ఆశ్చర్యం కలిగించకమానదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం మహిళా భద్రత, మహిళా సాధికారతను మరింత కీలకంగా భావించి ముందుకు సాగడం వల్లనే ఈ మార్పు సాధ్యమైందని భావిస్తున్నాను. ఈ స్ఫూర్తిని ప్రజలు కూడా అందిపుచ్చుకోవాలి. సమాజంలో నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్న లైంగిక హింస, అసమానతలు, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటివి మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలుస్తున్నాయి. లింగ వివక్ష సమసిపోవడమే ఈ సమస్యకు మేలైన పరిష్కారం. నా దృష్టిలో మహిళా సాధికారతకు నిదర్శనం మహిళలకు సమానంగా ఆస్తి హక్కు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు వంటివే. సమాజం ఆలోచనా ధోరణిలో మార్పు ద్వారానే ఇది సాధ్యమౌతుంది.

సమాజం ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చి వచ్చి, మహిళా శక్తిని బలహీన పరుస్తున్న కొన్ని అంశాల్లో పునరాలోచన జరగాలని సూచిస్తూ... మహిళామణులు విద్య, సాధికారతలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగి, వికసిత భారత నిర్మాణాన్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాను.

■ **ముప్పవరపు వెంకయ్యనాయుడు**
పూర్వ ఉపరాష్ట్రపతి

ప్రాంతాల ఆధిపత్యాలు.. ఆగ్రహాలు!

ఉత్తరాది ఆధిపత్యం... హిందీ సామ్రాజ్యవాదం... ఒకప్పుడు దక్షిణాదిన ప్రముఖంగా వినపడేవి. ఇప్పుడు మళ్లీ ఆ మాటలకూ ఆ భావాలకూ ప్రాచుర్యం వస్తోంది! వచ్చే ఏడాది చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలతో పాటు నూతన విద్యావిధానం అమలుకు కేంద్రం చేపడుతున్న చర్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేస్తున్న విమర్శలు వివాదాస్పద గతాన్ని గుర్తుకు తెస్తున్నాయి. అందులో మంచీచెడూ ఉండొచ్చు. చూసేచూపును బట్టే అది ఉంటుంది. ఉత్తరాది ఆధిపత్య భావన వెనుక ఎంతో చరిత్ర ఉంది.

రాజ్యాంగ రూపకల్పనప్పుడు జరిగిన చర్చల్లోనే హిందీ అమలుపై తీవ్ర విభేదాలు తలెత్తాయి. దక్షిణాది నేతల అభిప్రాయాలకు తగిన విలువ ఇవ్వకుండా హిందీని జాతీయభాషగా అమలుచేయటానికి ఉత్తరాది నేతలు గట్టిగానే ప్రయత్నించారు. హిందీని వ్యతిరేకించేవారు జాతీయవాదులే కారనీ ఘాటుగానూ విమర్శించారు. జాతీయ భాషనే ఎంపిక చేసుకోలేకపోతే స్వాతంత్ర్యానికి అర్థం ఏముంటుందన్న ప్రశ్నా తలెత్తింది. దక్షిణాది నాయకులను సమాధానపరచటానికి రాజీసూత్రాన్ని కనుక్కొని 15 ఏళ్లపాటు హిందీ అమలును వాయిదా వేశారు. అప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ అధికారభాషగా ఇంగ్లిషు కొనసాగుతుందనీ 1965 జనవరి 26 నుంచి హిందీ జాతీయ భాషగా అమలయ్యేలా రాజ్యాంగ నిబంధనను రూపొందించారు. హిందీ అమలును రాజ్యాంగంలో పొందుపరచటం దక్షిణాది నేతలకు ఇష్టం లేకపోయినా ఉత్తరాది నేతల సంఖ్యాబలం వల్ల ఆమోదించక తప్పలేదు. అందుకే ఆ నిబంధనపై విమర్శలు ఆగలేదు. తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా అప్పటికే తీవ్ర ఉద్యమాలు జరిగాయి. 1937లోనే రాజాజీ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో హిందీ అమలు కోసం ఉత్తర్వులు జారీచేయటం పెను వివాదానికి దారితీసింది.

పెరియార్ రామస్వామి నాయకర్ సారథ్యంలో ఆత్మగౌరవ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలంతో జస్టిస్‌పార్టీ 1920ల్లోనే అధికారంలోకి వచ్చింది. ఆర్యులు వలసవాదులనీ బ్రాహ్మణులు ఆర్య సంస్కృతికి ఆద్యులనీ ఆ సంస్కృతిలోనే ఇతర కులాల అణచివేత ఉందనీ ద్రావిడులే భారత ప్రాచీన నాగరికతకు అసలు నిర్మాతలనీ ఉత్తరాది నుంచి వారిని తరిమివేశారనీ.. అంటూ పెరియార్ చేసిన వాదనలు చదువరులను బాగా ప్రభావితం చేశాయి. సంస్కృత సాహిత్యాన్నీ పురాణాలనూ ఆయన తీవ్రంగా విమర్శించారు. మతగ్రంథాలను తగలపెట్టించారు. హిందీ సామ్రాజ్యవాదం అనే భావన అప్పుడే ప్రాచుర్యం పొందింది. తమిళం నుంచి సంస్కృత పదాలను తొలగించే ప్రయత్నమూ ప్రారంభమైంది. మరుగునపడిన తమిళ పదాలను మళ్లీ వాడుకలోకి తీసుకువచ్చారు. తమిళ భాషే కొత్తరూపు సంతరించుకుంది. అట్లా ద్రవిడ ఉద్యమంలో హిందీ వ్యతిరేకత, ఉత్తరాది ఆధిపత్యాన్ని నిలువరించే భావనలు ఊపిరిపోసుకున్నాయి. దక్షిణాది ద్రావిడుల కోసం ప్రత్యేక దేశాన్ని ఏర్పాటుచేయాలనే డిమాండును రామస్వామి చేశారు. పాకిస్థాన్ ఏర్పడినట్లే ద్రవిడస్థాన్ ఆవిర్భవించాలనీ కోరారు. ద్రవిడస్థాన్‌కు మద్దతు ఇవ్వాలని జిన్నాకు విజ్ఞప్తి కూడా చేశారు. జిన్నా దాన్ని తిరస్కరించారు. ఆర్యుల దండయాత్రలు, ద్రవిడుల స్థితిగతులు, కులవ్యవస్థ పుట్టుపూర్వోత్తరాల గురించి రామస్వామి నాయకర్‌తో పాటు 19వ శతాబ్దిలో బ్రిటిషు అధికారులు- చరిత్రకారులు-భాషా శాస్త్రవేత్తలు వెల్లడించిన అభిప్రాయాలను ఇప్పటి సామాజిక శాస్త్రాల దృష్టితో అంగీకరించటం కష్టం. అయినప్పటికీ వాటి ఆధారంగా తలెత్తిన రాజకీయ ఉద్యమాలను ఇంకా కొనసాగిస్తున్నామని చెప్పుకొనే నేతలు మాత్రం పాత భావాలు పరమ



పార్లమెంటు ఉభయ సభలకు సమానాధికారాలు కల్పించి, ఎగువసభలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారా జటిలమైన నియోజకవర్గాల పునర్విభజన సమస్యకు అంబేడ్కర్ సూచించినట్లుగా పరిష్కారం దొరకొచ్చు. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగసవరణలు తీసుకురావటానికి చూపించే ఉత్సాహం రాష్ట్రాలకు సమానహక్కులు కల్పించటంలోనూ ప్రదర్శించటమే ప్రాప్తకాలజ్ఞత కావొచ్చు! రాష్ట్రాల మధ్య సమానత్వం నెలకొంటే ప్రాంతీయవాదాలు బలహీనం అవుతాయి. నిజమైన జాతీయవాదం బలోపేతమూ అవుతుంది.

సత్యాలన్నట్లే వ్యవహరిస్తున్నారు. సిద్ధాంత భూమికలు లోపభూయిష్టమని తెలిసినా రాజకీయ అవసరాలు ఆ పనిని చేయనివ్వవు.

ద్రవిడస్థాన్ డిమాండును పక్కనబెట్టి చూస్తే ఆత్మగౌరవ ఉద్యమం తమిళ సమాజ ముఖచిత్రాన్ని చాలా మార్చివేసింది. మధ్యస్థాయి కులాలకు రాజకీయ ప్రాధాన్యాన్ని కల్పించింది. కింది కులాల్లో రాజకీయ చైతన్యాన్ని తెచ్చింది. పట్టణ పేదల్లో కొత్త ఆశలను చిగురింపచేసింది. తమిళభాష ఆధారంగా ప్రాంతీయ జాతీయవాదాన్ని అభివృద్ధి చేసింది. సంక్షేమ పథకాలను ప్రభుత్వ విధానాల్లో కీలకం చేసింది. విద్యా, ఉద్యోగాల్లో ఏకకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించి రిజర్వేషన్ల కల్పనకు గట్టి భూమికను ఏర్పాటు చేసింది. ద్రవిడ ఉద్యమంపై పరిశోధన చేసిన 'రాబర్ట్ ఎల్ హార్డ్‌గ్రేవ్' వీటిపై వివరంగానే రాశారు.



■ **రాహుల్ కుమార్**

తమిళనాడులో ఒకప్పటి హిందీ వ్యతిరేకత ఇప్పుడెంత ఉందో స్పష్టంగా చెప్పలేం. అక్కడి ప్రైవేటు పాఠశాలల్లో కూడా హిందీ, సంస్కృతాలను తృతీయ భాషలుగా తీసుకోవటం సర్వసాధారణమైంది. ఇతర ద్రవిడ భాషల పట్ల తమిళనాడులో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనటానికి దాఖలాల్లేవు. తెలుగు మాతృభాషగా ఉన్నవారు 2011 జనాభా లెక్కల నాటికి 42,34,302 మంది ఉన్నారు. తెలుగు బోధనను తమిళనాడు ప్రభుత్వం లెక్కచేయటం లేదనే ఆరోపణలు చాలానే ఉన్నాయి. ఒక్క తమిళనాడే కాకుండా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోనూ మూడో భాషగా హిందీ, సంస్కృతాలకే ప్రాధాన్యం పెరుగుతోంది. హిందీ రాష్ట్రాల్లోనైతే దక్షిణాది భాషలకు అక్కడి ప్రభుత్వాలు నామమాత్రపు ప్రాధాన్యాన్ని కూడా ఇవ్వలేదు. నిక్కచ్చిగా చెప్పుకోవాలంటే త్రిభాషా సూత్రం (మాతృభాష-ఇంగ్లిషు-మరో రాష్ట్ర భాష) విఫలమైంది.

విషయగ్రహణ సామర్థ్యం పెంచకుండా మార్పులు చేర్పులతో ఎన్ని త్రిభాషా సూత్రాలు పెట్టినా ఫలితం ఉండదు. త్రిభాషా సూత్రాన్ని పెట్టింది జాతీయ సమైక్యత కోసమే తప్ప గ్రహణ సామర్థ్యాలతో దానికి ఎలాంటి సంబంధం లేదు. నూతన విద్యావిధానంలో హిందీని బలవంతంగా నేర్చుకోవాలనే నిబంధన ఏదీలేదనీ కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. హిందీని తప్పనిసరిగా ఒక అంశంగా నేర్వాలని మొదటి ముసాయిదాలో పెట్టి విమర్శలు రావటంతో తర్వాత తొలగించారు.

ఏకభాష ద్వారా రాజకీయ ఐక్యతను, జాతీయభావాన్ని పెంపొందించాలన్న ఆదర్శం స్వాతంత్ర్యోద్యమ కాలంలో బలంగా ఉండేది. ఒకే భాష, ఒకే జాతి అన్నది యూరపు దేశాల్లోని జాతీయవాదానికి ఆధారం. ఏక భాషను అలవర్చి భావసమైక్యతను సాధించటం భారత్‌లో అంత తేలికగా సాధ్యం కాదు. ప్రధాన ప్రాంతీయ భాషలకు సమాన సామర్థ్యముండి, శతాబ్దాల సాహిత్య చరిత్ర కలిగిన పరిస్థితి మనలాగా మరోచోట ఉందని చెప్పలేం! ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా ఒక మతం, ఒక భాష ఆధారంగా ప్రజలందరినీ ఐక్యం చేద్దామని అనుకోవటం అత్యాశే అవుతుంది. ఈ అత్యాశ పెరిగినప్పుడల్లా మన ప్రజాస్వామ్యం గాడి తప్పుతోంది.

నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనపై ఆందోళనలు మొదలైన నేపథ్యంలో ఉత్తరాది ఆధిపత్యం గురించి అంబేడ్కర్ తన చివరిరోజుల్లో చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ చాలా ప్రాధాన్యత ఉంది.. భాషాప్రయుక్త రాష్ట్రాలపై కొన్ని ఆలోచనల పేరుతో ఆయన రాసిన చిన్న పుస్తకంలో 1955 నాటికే నెలకొన్న ఆందోళనల గురించి ప్రస్తావించారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం(ఎస్ఆర్‌సీ)లో సభ్యుడైన కె.ఎం.పణిక్కర్ తన అసమ్మతి పత్రంలో ఉత్తరాది ఆధిక్యత దేశ ఐక్యతకు ఎలా భంగకరంగా పరిణమిస్తుందో వివరిస్తూ చేసిన వ్యాఖ్యలను అంబేడ్కర్ ఉదహరించారు. ఒక రాష్ట్ర జనాభా ఎంత ఉన్నా ఫర్వాలేదనే ధోరణిలో ఎస్ఆర్‌సీ సిఫార్సులు ఉన్నాయనీ దీనివల్ల కలిగే విపత్తు గురించి కనీస ఆలోచన చేయలేదనీ అంబేడ్కర్ విమర్శించారు. ఎస్ఆర్‌సీ చేసిన ఘోరతప్పిదం అదేనని కూడా వ్యాఖ్యానించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దకపోతే దేశానికి తీవ్రనష్టం వాటిల్లుతుందనీ హెచ్చరించారు. ఉత్తరాదినీ దక్షిణాదినీ సమదృష్టితో చూడకపోవటం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టుగా మారుతుందని కూడా చెప్పారు. ఒకే భాష ఉన్నప్పటికీ పెద్ద రాష్ట్రాలను విభజించాలనీ సూచించారు. సాధ్యమైనంతవరకూ జనాభాపరంగా రాష్ట్రాలు ఒక స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోకపోతే వచ్చే అనర్థాలు చాలానే ఉంటాయనీ హెచ్చరించారు. ఎస్ఆర్‌సీ సిఫార్సులతో రాష్ట్రాల మధ్య వ్యత్యాసమే కాదు.. ఉత్తరాది-దక్షిణాది అనే భేద భావం ఏర్పడిందనీ వ్యాఖ్యానించారు. అమెరికాలో ఎగువ, దిగువ సభలకు సమాన అధికారాలు ఉన్నాయనీ, ఆర్థిక బిల్లులకు ఎగువసభ అయిన సెనేట్ ఆమోదం తప్పనిసరి అనీ అట్లా రాష్ట్రాల మధ్య సమతూకం ఏర్పడటం వల్లే అక్కడ నిజమైన సమాఖ్య వ్యవస్థ ఉందనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. హిందీని జాతీయభాషగా ఆమోదించటానికి ఉద్దేశించిన రాజ్యాంగ ముసాయిదాలోని 115 అధికరణ వివాదస్పదమైనంతగా మరేదీ కాలేదనీ సుదీర్ఘ చర్చల తర్వాత ఆ సమస్యపై ఓటింగు పెట్టినపుడు 78 ఓట్లు అనుకూలంగా వస్తే ప్రతికూలంగానూ అన్ని ఓట్లే వచ్చాయని అంబేడ్కర్ గుర్తుచేశారు. చివరికి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఒక ఓటు ఆధిక్యతతో హిందీ (అనుకూల ఓట్లు 78, వ్యతిరేక ఓట్లు 77) జాతీయభాషా స్థానాన్ని గెలుచుకుందనీ ప్రస్తావించారు. విచిత్రం ఏమిటంటే అంబేడ్కర్ కూడా హిందీని జాతీయభాషగా సమర్థించారు. దానితో ఏకీభవించనివారు అప్పుడూ ఇప్పుడూ ఉన్నారు. రాజాజీ అయితే దేశాన్ని ఉత్తరాది, దక్షిణాది అనే రెండు పెడరేషన్లుగా ఏర్పాటుచేసి, ఆ రెండు కలిసి ఒక కాన్ఫెడరేషన్‌గా మారాలనీ సూచించారు. ఆ కాన్ఫెడరేషన్‌కు కూడా మూడు అంశాలపై మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉండాలనీ ఉత్తర, దక్షిణాది సమాఖ్యలకు సమాన ఓటింగ్ హక్కులు ఉండాలనీ ప్రతిపాదించారు.

విషయగ్రహణ సామర్థ్యం పెంచకుండా మార్పులు చేర్పులతో ఎన్ని త్రిభాషా సూత్రాలు పెట్టినా ఫలితం ఉండదు. త్రిభాషా సూత్రాన్ని పెట్టింది జాతీయ సమైక్యత కోసమే తప్ప గ్రహణ సామర్థ్యాలతో దానికి ఎలాంటి సంబంధం లేదు.

70–75 ఏళ్లనాడు రాజాజీ, అంబేడ్కర్ వ్యక్తంచేసిన అభిప్రాయాలు ఇప్పుడు విచిత్రంగా అనిపించొచ్చు. 1971 నాటి జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరపాలన్న స్టాలిన్ డిమాండ్‌కు ఆమోదం లభించినా, మొత్తంగా పునర్విభజన ప్రక్రియనే కేంద్రం వాయిదా వేసినా పరిస్థితిలో పెద్దమార్పు రాదు. సీట్లపరంగా ఇప్పటికే ఉన్న అసమానత్వం అలాగే కొనసాగుతుంది. ఇక జనాభా ప్రాతిపదికగా నియోజకవర్గాల ఏర్పాటును ఎల్లకాలం వాయిదా వేయలేరు. ఒక ఓటుకు ఒకే విలువ ఎల్లకాలం కాదనలేరు. పార్లమెంటు ఉభయ సభలకు సమానాధికారాలు కల్పించి, ఎగువసభలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారా జటిలమైన ఈ సమస్యకు అంబేడ్కర్ సూచించినట్లుగా పరిష్కారం దొరకొచ్చు. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగసవరణలు తీసుకురావటానికి చూపించే ఉత్సాహం రాష్ట్రాలకు సమాన హక్కులు కల్పించటంలోనూ ప్రదర్శించటమే ప్రాప్తకాలజ్ఞత కావొచ్చు! రాష్ట్రాల మధ్య సమానత్వం నెలకొంటే ప్రాంతీయవాదాలు బలహీనం అవుతాయి. నిజమైన జాతీయవాదం బలోపేతమూ అవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఉపకారవేతనాలతోనే సంక్షేమం

పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రభుత్వం పరిరక్షిస్తుందని భారత రాజ్యాంగ పీఠిక, కొన్ని అధికరణలు, మరికొన్ని ప్రత్యేక చట్టాలు నిర్దేశిస్తున్నాయి. పేదల సంక్షేమం కోసం ఉన్నత స్థాయి పాలనాపరమైన అమరిక ఈ దేశంలో వుంది. అయినప్పటికీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి పేదవిద్యార్థి ఒంటరిగానే ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వస్తుంది.

గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థుల సంక్షేమం అథోగతిపాలైంది. దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న ఈ సామాజిక వర్గాలకు ఫీజు రియంబర్స్‌మెంట్ మాత్రమే చెల్లించి నెల వారీగా చెల్లించవలసిన ఉపకారవేతనాలను ఎత్తేశారు. ఆ స్థానంలో 'వసతి దీవెన' పేరుతో పేద విద్యార్థుల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టేశారు. కళాశాలలకు చెల్లించవలసిన ఫీజులు, మెస్ ఛార్జీలు విద్యార్థుల తల్లుల బ్యాంకు అకౌంట్‌లో జమ చేసి మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టారు. ఏభై శాతానికి పైగా కుటుంబాలు ఈ సొమ్మును సొంత ఖర్చులకు వాడుకోవడంతో ఆయా విద్యార్థులు సకాలంలో కాలేజీలకు ఫీజులు చెల్లించలేకపోయారు. ప్రభుత్వం రియంబర్స్‌మెంటుగా ఇచ్చిన ఫీజులు అటు కాలేజీలకు, హాస్టళ్ళకు చేరక విద్యార్థుల భోజనం, వసతుల విషయంలో గందరగోళం నెలకొంది. ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు నేటికీ కాలేజీలు, విశ్వవిద్యాలయాల నుంచి సర్టిఫికెట్లు తీసుకోలేకపోయారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉపకారవేతనాల చెల్లింపు విషయంలో పక్కనున్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ముందంజలో వున్నాయి. ఈ రాష్ట్రాల్లో నెలవారీ భోజనవసతి ఛార్జీలు చెల్లిస్తున్నారు. రూ.6లక్షల వార్షిక ఆదాయానికి మించని కుటుంబాల్లోని విద్యార్థులు అందరికీ ఉపకారవేతనాలు మంజూరు చేస్తున్నారు. గత ప్రభుత్వం సృష్టించిన పథకాల మాయతో ఏపీలో ఉపకారవేతనాల చెల్లింపు క్రమం తప్పింది. విద్యార్థులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ధర్నాలకు, నిరసనలకు దిగారు.

ఏపీలో నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాల పద్ధతుల్లో లబ్ధిదారులకు సంక్షేమాన్ని సమకూరుస్తున్నాయి. నెల వారీ మెస్ ఛార్జీలు ఎత్తేసి ఏడాదికి రూ.10 వేలు చొప్పున సంక్షేమ పథకం పేరుతో చెల్లించడంతో మొత్తంగా కాలేజీ విద్య, ఉన్నత విద్యారంగాల్లో పేద విద్యార్థుల సంక్షేమం ప్రశ్నార్థకమయింది. ప్రైవేటు అనుబంధ కళాశాలల్లో చదువుతున్న పీజీ విద్యార్థులకు గతంలోనే ప్రభుత్వం ఉపకారవేతనాలు నిలిపేసింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కూడా కొన్ని కోర్సులకు ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు రెండింటినీ మంజూరు చేయడం లేదు. పేద విద్యార్థులు కనీసం ప్రభుత్వరంగ విద్యాసంస్థల్లో చదువులు కొనసాగించడానికైనా కష్టాలు పడవలసివస్తున్నది. చివరికి పిహెచ్.డి. చేసే పరిశోధక విద్యార్థులకు కూడా ఉపకారవేతనాలు రద్దు చేయడం అన్యాయం.

ప్రతిపక్షంలో ఉన్నపుడు ఈ అంశాలపై తెలుగుదేశం పార్టీ విమర్శలు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులు తమకు న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఆదిలోనే ఈ పరిస్థితుల్ని పరిష్కరించడం మంచిదని విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు భావిస్తున్నాయి.

ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉపకారవేతనాల్ని తీసేయడం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం పరిశోధనలకు ఫెలోషిప్పులు ఎత్తేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థుల భవిష్యత్తుకు తీరని నష్టం వాటిల్లింది. ఉపకారవేతనం అత్యవసరమైన పరిష్కార సాధనంగా ప్రభుత్వం భావించినప్పుడే పేద విద్యార్థుల సంక్షేమం సాధ్యమవుతుంది. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుంది.

● **డాక్టర్ జీకేడీ ప్రసాదరావు**
జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ ఫ్యాకల్టీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం

నేడు ఒంగోలులో రెండు పీవోడబ్ల్యూ సంస్థల విలీనం

భారతదేశంలో మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సరళీకరణ, కార్పొరేటీకరణ పెరిగిన తర్వాత ప్రతి కుటుంబం పరుగులుపెట్టి పనిచేస్తే తప్ప కుటుంబం గడవని పరిస్థితి దాపురించింది. షాపింగ్ మాల్స్, భవన నిర్మాణ రంగం, హోటళ్ళు, పెట్రోలు బంకుల్లో కూడా మహిళలు పనిచేయాల్సి వస్తోంది. మహిళలకు ఎలాంటి హక్కులు లేకుండా అసంఘటిత రంగంలో శ్రమ దోపిడీకి గురవుతున్నారు. జీవితమే పోరాటమై పెనుగులాడుతున్న మహిళలు చట్టాల అమలుకోసం ఉద్యమించాల్సిరావడం చూస్తే స్వాతంత్ర్య ఫలాలకు మహిళలు ఇంకా ఎంతో దూరంలో వున్నారనిపిస్తుంది.

1970లో పురుడుపోసుకున్న ప్రగతిశీల మహిళా సంఘం ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించింది. నిర్బంధానికి అణచివేతకు గురయ్యింది. అనేక మంది వీరవనితలు అమరులయ్యారు. 12 రాష్ట్రాల్లో గుర్తింపు కలిగిన మహిళా పోరాటాలు నిర్వహించింది. భూమికోసం, ఇళ్ళ స్థలాలకోసం, స్త్రీ పురుష సమానత్వంకోసం లైంగిక హింసకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నిర్మించాం. ఈ క్రమంలో 2013లో సంస్థ చీలికకు గురయ్యింది. ఫలితంగా మహిళా ఉద్యమాలు తీవ్రంగా నష్టాన్ని చవిచూసాయి. వీటిని సమీక్షించుకున్న తర్వాత రెండు సంస్థలు కలిసి భవిష్యత్‌లో ఒకే సంస్థగా పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా విలీనం కావాలని రెండు సంస్థలు భావించాయి. ఈ విలీనానికి ఒంగోలు వేదిక కాబోతుంది.

– **బి.పద్మ**
ప్రధాన కార్యదర్శి, పీవోడబ్ల్యూ

వారి ఆత్మగౌరవాన్ని సంరక్షించండి

మహిళల ఉత్సవం... ఒక్క మార్చి 8వ తేదీకే పరిమితమా? ఈ ఒక్కరోజే మహిళలకందరికీ సందేశాలు, అభినందనలు, శుభాకాంక్షలా? ఈ ఒక్కరోజే స్త్రీ శక్తి... స్త్రీ విముక్తి... స్త్రీ స్వేచ్ఛ... స్త్రీ స్వాతంత్ర్యం... స్త్రీ సమానత్వం... స్త్రీ సాధికారత అంటూ అన్నింటా ఉపన్యాసాలా? ఇలా ఇంకెంత కాలం!


మహిళలు కోరుకుంటున్నవి ఇళ్లో, వాకిళ్లో, బంగారు నగలో, రత్నాలో, వజ్రాలో, ఆభరణాలో కాదు. కేవలం ఒక గుర్తింపు, ఒక గౌరవం, ఒక



నమ్మకం, ఒక ప్రోత్సాహం, ఒక చేయూత. కొంత ఆదరణ... మరికొంత అభిమానం... ఇంకొంత ఆప్యాయత వారికి ఇవ్వండి చాలు! కొంచెం ప్రేమ... ఇంకొంచెం సహకారం... మరికొంచెం విలువ... ఇవ్వండి. కొన్ని అవకాశాలు... ఇంకొన్ని ఉత్సాహాలూ... మరికొన్ని ప్రోత్సాహాలు... ఇవే... ఇలాంటివే... చిన్న, చిన్న విషయాల్ని... చిన్న, చిన్న సుఖాల్ని... చిన్న, చిన్న సంతోషాల్ని మాత్రమే మహిళలు మన నుండి ఆశిస్తున్నారు. ఒకరు ఇచ్చేది స్వేచ్ఛ కాదనీ, 'స్వాతంత్ర్యం' ఎవరి భిక్షా కాదనీ, ఆత్మవిశ్వాసాన్నే ఆలంబనగా చేసుకొని బతికే ఆడవారికి చాలా బాగా తెలుసు. వీలైతే, మహిళలను కష్టపెట్టకుండా, వారిని ఎంతమాత్రం హింసించకుండా, వారిని కాస్త గౌరవించండి. వారి ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని కొంచెం సంరక్షించండి. అదే వారికి కొంచెమైనా విముక్తి, కొండంత స్వేచ్ఛ, కనీస స్వాతంత్ర్యం, సమానత్వం.

మనను సర్వకాల, సర్వావస్థల్లోనూ కాపాడుతున్న అతివలు ఎల్లప్పుడూ ఆదిపరాశక్తులే! మనకొక ఉనికినిచ్చిన, మనుగడనిచ్చిన, అస్తిత్వాన్నిచ్చిన, మన మానవజాతికి ఆధారభూతమైన మహిళను గుర్తించి, గౌరవించండి, అభిమానించండి... చదివించి, చేయందించి, చేయూతనివ్వండి. మహిళల్ని మనం రక్షించుకొంటే, మన భవిష్యత్తునూ మనం సంరక్షించుకొన్నట్టే. భార్యకు తన శరీరంలో సగభాగాన్నిచ్చిన ఈశ్వరుని స్ఫూర్తితో, పురుష జాతి సమస్తం మహిళల్ని ఎల్లప్పుడూ గౌరవించాలనీ కోరుకుంటూ... నారీమణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– **పెన్మెత్స రవి ప్రకాష్ అశోకవర్మ**
శృంగవృక్షం, పశ్చిమ గోదావరి జిల్లా
(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)





అన్నింటా ఆమె

స్వశక్తితో ఎదిగి.. సమాజానికి స్ఫూర్తిగా నిలిచి..

విభిన్న రంగాల్లో రాణిస్తున్న మగువలు

అనురాగం, ఆత్మీయతల కలబోత ఆమె. అన్యోన్యతకు నిలువెత్తు నిదర్శనం ఆమె. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా.. సమాజంలో ఆమె పోషించే ప్రతిపాత్ర ఓ అద్భుతమే. అందుకే ఆమె ఆకాశంలో సగమైంది. బేషజాలకు తావులేని మమకారం.. భేదాలు చూపని గొప్పగుణం.. కష్టసుఖాల్లో సహకారం.. స్త్రీమూర్తికి పెట్టని ఆభరణాలు. మగవారితో సమానంగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన అతివ వంటింటికే పరిమితం కాలేదు. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే..' అన్నట్టు ఉద్యోగాల్లోనే కాకుండా.. ఇష్టమున్న ప్రతి రంగంలో ప్రగతి సోపానంతో పడతి ప్రయాణిస్తోంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయపథాన దూసుకుపోతున్న మహిళామూర్తులపై ప్రత్యేక కథనాలు 8లో..



● కోమరవోలులో భువనేశ్వరి

సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం తాను దత్తత తీసుకున్న పామర్రు మండలం కోమరవోలు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు. 6లో

టెన్షన్ టెన్షన్

పలు కేసుల్లో విచారణకు నోటీసులివ్వాలని పోలీసుల చుట్టూ కొడాలి అనుచరుల ప్రదక్షిణలు

ఇప్పటికే కీలకమైన కేసుల్లో చిక్కుకుని భయాందోళన



అధికారం ఉన్నంతకాలం రెచ్చిపోయారు. కన్నూమిన్నూ కానకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. బెదిరింపులు, కబ్జాలకు పాల్పడ్డారు. అధికారం మత్తు దిగాక.. గుడివాడలోని అరాచక శక్తులకు ఇప్పుడు భయం పట్టుకుంది. మాజీమంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరులు, ఇతర అనుయాయుల్లో టెన్షన్ మొదలైంది. చేసిన తప్పులకు శిక్షలు తప్పవని ముందస్తుగా విచారణలు ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు.

- ఎప్పుడైనా చిక్కుకోక తప్పదని ముందే ప్రయత్నాలు
- గుడివాడ పీఎస్‌కు వెళ్లి నోటీసులివ్వాలని వేడుకోలు
- వన్‌టౌన్ పోలీసుల నోటీసులు, టూటౌన్‌లో ససేమిరా..
- భయంభయంగా కొడాలి అనుచరులు శశిభూషణ్, రాంప్రసాద్
- నాటి అక్రమాలపై రోజురోజుకూ బిగుస్తున్న ఉచ్చు

అనుంగు అనుచరులు

మాజీమంత్రి కొడాలి నాని.. తన అనుచరులు పాలడుగు రాంప్రసాద్, దుక్కిపాటి శశిభూషణ్‌పైనే ఆధారపడతారు. నాని చెప్పకుండా వీరు ఎలాంటి పనులు చేయరు. రానున్న రోజుల్లో వీరిద్దరినీ విచారణ చేయాల్సి వస్తే.. వారిద్దరూ కొడాలి నాని పేరు చెబితే ఆయనకు చిక్కులు తప్పవు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించారు. రాజీనామాలు చేయని వారిని చేసే వరకు బెదిరించారు. గుడివాడలోనూ ఈ వ్యవహారం నడిచింది. దీనిపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది మాజీమంత్రి కొడాలి నాని, వైసీపీ గుడివాడ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్‌పై కేసులు నమోదయ్యాయి. బీఎన్ఎస్ 447, 506 సెక్షన్లను ఈ కేసులో నాని ముందుగా హైకోర్టును ఆశ్రయించడంతో 41ఏ నోటీసులు ఇచ్చి విచారించాలని కొద్దినెలల క్రితం పోలీసులకు ఆదేశాలు అందాయి. ఈ విచారణకు హాజరుకావాలని నానీకి కోర్టు స్పష్టం చేసింది. ఆటోనగర్‌కు చెందిన దుగ్గిరాల ప్రభాకర్ అనే వ్యక్తి బేవరేజెస్ కార్పొరేషన్‌కు గోడౌన్‌ను అద్దెకిచ్చాడు. వైసీపీ అధికారంలోకి రాగానే లీజు, లైసెన్స్‌ల గడువు ముగియకముందే వేరేచోటకు తరలించారు. దీంతో మనోవేదనకు గురై తన తల్లి మృతి చెందినట్టు ప్రభాకర్ ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ మాధవీలత, మాజీమంత్రి ఎమ్మెల్యే కొడాలి నాని, మరికొంతమంది వైసీపీ నాయకులపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 448, 427, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద గత జూలై 6న కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఉన్న శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్ శుక్రవారం గుడివాడలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తమకు 41ఏ నోటీసులు ఇవ్వాలని పోలీసులను అడిగారు. వన్‌టౌన్ పోలీసులు నోటీసులు ఇచ్చినా.. టూటౌన్ నోటీసులు ఇవ్వడానికి ససేమిరా.. అనడంతో వెనుదిరిగారు. సాధారణంగా కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి పోలీసులు ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేస్తారు. విచారణకు ఏ తేదీన హాజరుకావాలో చెబుతారు. అటువంటిది గుడివాడలో వైసీపీ నేతలు నోటీసులు తీసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లడం గమనార్హం.

బిగుస్తున్న ఉచ్చు

- అధికారంలో ఉండగా మాజీమంత్రి కొడాలి నాని చంద్రబాబుపై ఒంటికాలిపై లేచేవారు. నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడేవారు. కుటుంబ ప్రస్తావన తీసుకొచ్చి ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి చంద్రబాబు ప్రస్తుత కుటుంబ సభ్యుల వరకు తిట్టని రోజు లేదు. వీటిపై ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు.
- ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి కూడా కొడాలి నాని అనుయాయుల వ్యవహారాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. వీటికి సంబంధించి కూడా బాధితులు కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది.
- గుడివాడ బైపాస్ రోడ్డు వెంబడి ఓ ప్రైవేట్ వెంచర్‌లో ప్రభుత్వ ఉద్యోగులు మిగతా 6లో..

ఓ పెన్‌గా మాస్ కాపీయింగ్

జగ్గయ్యపేటలో బయటపడుతున్న అక్రమాలు

- స్థానిక హెచ్ఎంలకు సిట్టింగ్ స్క్వాడ్‌లో చోటు
- నిబంధనలకు విరుద్ధంగా ఏఐ కోఆర్డినేటర్లకు కూడా..
- స్క్వాడ్‌లా వెళ్లి విద్యార్థులతో కాపీయింగ్
- సీసీ కెమెరాల్లో కనిపించకుండా జాగ్రత్తలు
- ఓ కళాశాల పీఆర్వోను నిలదీసిన విద్యార్థులు
- డబ్బులు తీసుకుని పరీక్షల్లో హెల్ప్ చేయట్లేదని నిలదీత



పీఆర్వోను చుట్టుముట్టిన విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ సంచలనం రేపుతోంది. ఓపెన్ ఇంటర్‌లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ లోపాయికారీ ఒప్పందాలతో అధికారులు, పలువురు కో-ఆర్డినేటర్లు కుమ్మక్కై, యథావిధిగా కాపీయింగ్‌కు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. జగ్గయ్యపేటలో జరుగుతున్న పరీక్షల్లో మాస్ కాపీయింగే ఇందుకు ఉదాహరణ.

మాస్ కాపీయింగ్ ఇలా..

గతంలో రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్ పరీక్షలు వేర్వేరుగా నిర్వహించేవారు. ప్రైవేట్ కళాశాలల వారే సెంటర్లు ఏర్పాటుచేసి, అభ్యర్థులతో పైరవీలు చేసి ముందస్తు ఒప్పందాలతో, తప్పనిసరిగా పాస్ సర్టిఫికెట్ అంటూ వేలాది రూపాయలు వసూలు చేసేవారు. ఈసారి ఓపెన్, రెగ్యులర్ పరీక్షలు ఒకేసారి జరగటంతో పరీక్షా కేంద్రాలుగా తమ కళాశాలలకు అవకాశం లేకుండాపోయింది. విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఫీజులు కట్టించుకునేందుకు ప్రభుత్వ హైస్కూళ్లు, కొన్ని ప్రైవేట్ స్కూళ్లకు ఏఐ కోఆర్డినేటర్లుగా అవకాశం కల్పించారు. నిబంధనల ప్రకారం ఏఐ కోఆర్డినేటర్లుగా ఉన్న ఉద్యోగులు.. సిట్టింగ్ స్క్వాడ్‌లలో ఉండకూడదు. కానీ, జగ్గయ్యపేటలోని ఓ హైస్కూల్ హెచ్ఎంకు స్థానికంగా ఉన్న రెండు ప్రైవేట్ స్కూళ్లలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌గా అవకాశం కల్పించారు. ఆమె ద్వారానే మాస్ కాపీయింగ్‌కు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. సిట్టింగ్ స్క్వాడ్ పేరుతో అక్కడ పరీక్షా కేంద్రాల్లో తిష్టవేసి తమ విద్యార్థులకు కాపీలు అందిస్తున్నట్టు, అక్కడ సీసీ కెమెరాలు పనిచేయకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రెగ్యులర్ ఇంటర్ కోర్సులు మిగతా 6లో..

పాఠశాలల్లో కనిపించని ఉపాధ్యాయులు

ఓపెన్ ఇంటర్, రెగ్యులర్ ఇంటర్‌కు ఒకేసారి పరీక్షలు రావటంతో మండలంలో అత్యధిక ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించటంతో ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులుగా బోధన సాగట్లేదు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా పరీక్షల బాధ్యతలు అప్పగించటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

చెరువు కట్టకు మోక్షం

- గుడివాడలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తెగిన కట్ట
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల
- కొడాలి నాని హయాంలో పట్టించుకోక అవస్థలు

6లో



మామిడి రెడీ

మూడోవారంలో ప్రారంభంకానున్న ఎగుమతులు

- నున్న మార్కెట్‌లో షాపులు తెరిచేందుకు సిద్ధం
- పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ రూరల్) : మామిడి సీజన్ వచ్చేస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద మామిడి మార్కెట్‌లో ఒకటైన నున్న మ్యాంగో మార్కెట్‌లో ఈనెల మూడో వారంలో షాపులు తెరిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మార్కెట్‌లో మొత్తం 40 దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే మామిడి కాపునకు రావడంతో వ్యాపారులు దుకాణాలను సిద్ధం చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. రైతుల నుంచి మామిడి కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కరోనా నుంచి తగ్గిన వ్యాపారం

నున్న మ్యాంగో మార్కెట్‌లో గతంలో మూడు పూలు ఆరు కాయలుగా ఉన్న మామిడి ఎగుమతులు కరోనా నుంచి తగ్గుముఖం పట్టాయి. ఓపక్క వాతావరణం అనుకూలించక మామిడి దిగుమతులు తగ్గడం వలన సతమతమైన వ్యాపారులు కరోనా కాలంలో మరింతగా దెబ్బతిన్నారు. ఈ ఏడాదైనా దిగుబడి పెరిగి వ్యాపారం అభివృద్ధి చెందుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఇక్కడి నుంచి దేశంలోని పలు రాష్ట్రాలకు మామిడి కాయలు ఎగుమతి చేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలని చూస్తున్నారు. బంగినపల్లి, చెరుకు రసాలు, నీలాలు, కోలాపూరీ, చిన రసాలు, పెద్ద రసాలు, సుందరి తదితర రకాలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి.

లోకల్ మండీలతో కష్టాలు

నున్న మ్యాంగో మార్కెట్‌కు ప్రధానంగా నూజివీడు, విస్సన్నపేట, ఆగిరిపల్లి, తాడేపల్లిగూడెం, ఏలూరు, ద్వారకా తిరుమలతో పాటు తుని, అన్నవరం ప్రాంతాల నుంచి రైతులు మామిడి పంటను దిగుమతి చేస్తుంటారు. అయితే, ఆయా ప్రాంతాల్లో కొంత మిగతా 6లో..

రౌడీ చీటర్

నగరంలో మాజీ హోంగార్డు మాయలు

నోటి దురుసుతో ఉద్యోగం ఊస్టింగ్

- రౌడీషీటర్లతో పరిచయాలు.. మంతనాలు
- షీట్లు తొలగిస్తానని భారీగా వసూళ్లు
- మరోసారి పోలీస్ శాఖలో చేరే ప్రయత్నాలు
- ఓ అధికారి వద్ద పనిచేస్తున్నట్టు స్వీయప్రచారం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అధికారులకు ఎదురుతిరగడం, వారి పట్ల దురుసుగా వ్యవహరించడంతో పోలీసు శాఖలో కొలువును కోల్పోయిన ఓ హోంగార్డు నగరంలో చీకటి వ్యవహారాలను చక్కబెడుతున్నాడు. ముఖ్యంగా సెంట్రల్ జోన్ పరిధిలో వ్యవహారాలను జోరుగా సాగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. చివరికి అతడిపై షీట్ ఉన్నప్పటికీ కౌన్సెలింగ్‌కు పిలవడానికి పోలీసులే భయపడే పరిస్థితి వచ్చింది.

డ్రైవర్‌నంటూ ప్రచారం

గుణదలలో నివాసం ఉండే హోంగార్డును 2017లో ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. పోలీసు శాఖలో పనిచేస్తూ వివిధ పోలీస్‌స్టేషన్లలో తప్పుడు ఫిర్యాదు చేసి పలువురిని ఇబ్బంది పెట్టేవాడు. ఇది మంచి పద్ధతి కాదని వారించిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలపై ఎదురు తిరిగేవాడు. హోంగార్డు చేష్టలతో విసిగిపోయిన అధికారులు వాటిని భరించడం తమవల్ల కాదన్న నిర్ణయానికి వచ్చారు. అతడి బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వాటిపై విచారణ చేయించగా, వాస్తవమేనని తేలడంతో సదరు హోంగార్డును ఉద్యోగం నుంచి తొలగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో అతడిపై కేసులు నమోదు చేశారు. అధికారులు ఉద్యోగం నుంచి తొలగించినా తిరిగి పోలీసు శాఖలోకి అడుగుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. కొత్త పోలీసు కమిషనర్ వచ్చినప్పుడల్లా ఓ అర్జీని అందజేస్తాడు. ఓపక్క ఈవిధంగా వ్యవహరిస్తూనే, మరోపక్క బయట వ్యక్తులకు మాత్రం తాను తిరిగి పోలీసు శాఖలో చేరానని ప్రచారం చేసుకుంటాడు. ఒక ఐపీఎస్ అధికారి పేరు చెప్పి ఆయన వద్ద డ్రైవర్‌గా కొనసాగుతున్నానని పేర్కొంటాడు.

షీటర్లతో బేరాలు

ఈఎంఐ చెల్లించాలని ఇంటికి వచ్చిన ఏజెంట్‌పై దాడి చేయడం, చీటీ పాటల్లో సభ్యుడిగా చేరి డబ్బు తీసుకుని చెల్లించకపోవడం వంటి ఘటనలపై వరుస ఫిర్యాదులు రావడంతో మాచవరంలో అప్పటి పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు మాజీ హోంగార్డుపై షీట్ తెరిచారు. తర్వాత అతడు మాచవరం నుంచి మకాం మార్చేశాడు. అక్కడి నుంచి కార్మెల్‌నగర్‌కు వెళ్లాడు. దీంతో మాచవరం పోలీసులు షీట్‌ను గుణదల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కమిషనరేట్ పరిధిలో షీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. షీటర్లు ఏ కేటగిరీకి చెందినవారైనా కౌన్సెలింగ్‌కు మాత్రం కచ్చితంగా రావాలి. ఈ మాజీ హోంగార్డు మాత్రం కౌన్సెలింగ్‌కు హాజరుకావట్లేదు. దీన్ని గమనించిన పోలీసులు అతడి ఇంటికి వెళ్లారు. కౌన్సెలింగ్‌కు రావాల్సిందేనని చెప్పారు. దీంతో అతడు ఓ భవనంపైకి వెళ్లి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఇక చేసేదిలేక పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు. దీంతో షీటర్ల జాబితాలో ఉన్న మాజీ హోంగార్డు కౌన్సెలింగ్‌కు రాకపోయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. పోలీసు శాఖలో పనిచేస్తున్నప్పుడు ఏర్పడిన పరిచయాలతో పలువురు రౌడీషీటర్లతో మంతనాలు సాగిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉన్న షీట్లను తొలగించే ఏర్పాట్లు చేస్తానని వారితో బేరాలు కుదుర్చుకుంటున్నట్టు సమాచారం.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

- ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు..
- పరీక్షలకు హాజరయ్యే వారికి మాత్రమే..
- హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపిస్తే చాలు

8లో

దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై విచారణ

- మహామండపంలో అధికారుల తనిఖీలు

6లో

కొండవాగు కబ్జాపై అధికారుల చర్యలు

- సర్పంచ్ భర్తపై కేసు నమోదు

6లో

అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు

- జగ్గయ్యపేట చోరీని ఛేదించిన పోలీసులు

6లో



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-15 (శని)
సహర్ (ఉదయం) : 5-08 (ఆది)


ఎంపీ శివనాథ్‌కు వినతి పత్రం అందచేసిన పెన్షనర్లు

ఎంపీ శివనాథ్‌ను కలిసిన పెన్షనర్లు

» పార్లమెంట్‌లో పెన్షన్ పెంపు ప్రస్తావించాలని వినతి

వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్స్‌లో పనిచేసి రిటైర్ అయిన ఈపీఎస్-95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నేషనల్ యాజిటేషన్ కమిటీ ఎన్టీఆర్ జిల్లా సభ్యులు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని కలిశారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఎంపీని కలిసి తమకు ఈపీఎఫ్‌వో పెన్షన్ స్కీమ్ కింద ఇచ్చే పెన్షన్‌ను కోషియారి కమిటీ సిఫార్స్ ప్రకారం కనీస పింఛన్ రూ.7,500లతో పాటు కరువుభత్యం కలిపి ఇచ్చే అంశం పార్లమెంట్‌లో ప్రస్తావించాలని వినతి పత్రం అందచేశారు. పార్లమెంట్‌లో తమ సమస్యను ప్రస్తావించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఈ.పి.ఎస్.95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున దేశవ్యాప్తంగా ఎంపీలందరికీ వినతి పత్రాలు అందచేస్తున్నట్టు తెలిపారు. వారి సమస్యను తెలుసుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించి లోక్‌సభలో ఈ అంశం ప్రస్తావనకు తీసుకువస్తానని చెప్పారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌతిండియా జాయింట్ సెక్రటరీ ఎల్.మురళీ కృష్ణ, నేషనల్ జాయింట్ సెక్రటరీ కె.సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు కొల్లిపర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకస్వాములు

కనకదుర్గమ్మ సేవలో నీతి అయోగ్ సభ్యుడు

ఇంద్రకీలాద్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం, ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రం అందజేశారు.



అన్న వితరణకు విరాళం..


విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన గొట్టుముక్కల సత్యనారాయణ రాజు, కుటుంబ సభ్యులతో శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని, అన్నవితరణ నిమిత్తం అధికారులకు రూ.1,11,116లను చెక్కు అందజేశారు.

కొండవాగు కబ్జాపై అధికారుల చర్యలు

» సర్పంచ్ భర్తపై కేసు నమోదు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డు ప్రాంతంలో కొండవాగు స్థలం కబ్జాపై అధికార యంత్రాంగం చర్యలకు దిగింది.

కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, రెవెన్యూ అధికారులు


కబ్జా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి అక్రమంగా విక్రయాలకు ప్రయత్నించిన సర్పంచ్ భర్తతో పాటు మరికొందరిపై రెవెన్యూ అధికారులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని 1.2 ఎకరం కొండ పోరంబోకు భూమి కబ్జాకు గురైన విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'కొండవాగులో కబ్జాకోరులు' కథనానికి స్పందించిన సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్డీవో కావూరి చైతన్య, రూరల్ ఎమ్మార్వో బి.సుగుణ, ఆర్ఐ రాజేష్ కబ్జాస్థలం పరిశీలించారు. సదరు స్థలం సర్వే నెంబరు 151/2లో ఉన్న ప్రభుత్వ స్థలంగా నిర్ధారించారు. అనంతరం సర్పంచ్ భర్త కాటూరి శ్రీను కబ్జాకు పాల్పడటమే కాకుండా కోర్టు ఉల్లంఘనకు పాల్పడినట్టు నున్న రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాటూరి శ్రీనుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై విచారణ

ఇంద్రకీలాద్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చీరల గోల్‌మాల్‌పై దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ నియమించిన విచారణ కమిటీ సభ్యులు శుక్రవారం మహామండపంలోని చీరల విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు.


చీరల విభాగంలో అధికారుల తనిఖీలు

గుంటూరు డిప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేష్, తూర్పుగోదావరి, పెద్ద అవుటపల్లి గ్రూప్ టెంపుల్ సూపరింటెండెంట్ కె.ఎల్.ఎస్.శెట్టి, రాజమండ్రిలోని ఆర్జేసీ కార్యాలయం సూపరింటెండెంట్ టి.సుబ్రహ్మణ్యంలు చీరల విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆర్డర్ కాపీలు, ఇతర వివరాలను పరిశీలించారు. లీజెస్ విభాగంలో చీరల టెండర్ ఎప్పుడు? ఎన్నిసార్లు నిర్వహించారు.. నిబంధనలు పాటించారా.. తదితర అంశాలను పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చీరల అవకతవకల సమయంలో విధులు నిర్వహించిన గుమస్తాలు టి.సుబ్రహ్మణ్యం, కె.రమేష్, మధులను శనివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం. శనివారం ప్రధాన ఆలయం, ఫెస్టివల్ సెక్షన్‌లో ఉద్యోగులను విచారించనున్నారు. వివరాలను గతంలో విచారణ అధికారిణిగా పనిచేసిన దేవస్థానం ఏఈవో సుధారాణి తెలియజేశారు.

టెన్షన్.. టెన్షన్..

(5వ పేజీ తరువాయి)

ప్లాట్లు కొన్నారు. వారికి గతంలో జీపీఏ కింద రిజిస్ట్రేషన్లు చేయటం జరిగింది. వివిధ కారణాల వల్ల ఒకటి, రెండు రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో అందులోని లొసుగులను ఆధారంగా చేసుకుని ఉద్యోగులకు ఆ ప్లాట్లు చెందకుండా నాని అనుయాయులు అడ్డుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం జరిగింది.

- గుడివాడ పట్టణంలో కల్యాణమండపం దగ్గర తమ అనుయాయులకు చెందిన వెంచర్‌లో ప్లాట్లను విక్రయించారు. ఆ తర్వాత ఆ భూములను ఉద్దేశపూర్వకంగా 22ఏలో చేర్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్లాట్లు కొన్న వారికి అవి అమ్ముకోవటానికి అవకాశం లేకుండాపోయింది. ఈ వ్యవహారంలో కూడా పలువురు బాధితులు కేసులు పెట్టడానికి ఇటీవలే సమావేశాన్ని నిర్వహించినట్టు తెలుస్తోంది.
- గుడివాడలో 25 ఎకరాల మేర దేవదాయ భూముల వివాదం ఎప్పటినుంచో నడుస్తోంది. దీనిపైనా ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశాలు ఉన్నాయి.
- పుట్టగుంటలో చేపల చెరువు అక్రమ తవ్వకాలకు సంబంధించి విజిలెన్స్ ఇప్పటికే విచారణ జరుపుతోందని తెలుస్తోంది.

చెరువు కట్టకు మోక్షం!

» వైసీపీ ప్రభుత్వ హయాంలో తెగిన కట్ట

» యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

» హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

పట్టణవాసుల నీటి అవసరాలను తీర్చేందుకు 48,105 ఎకరాల విస్తీర్ణంలో రెండు పంపుల చెరువులున్నాయి. నాలుగేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో చిన్న చెరువు కట్ట తెగిపోయి లక్షలాది లీటర్ల మంచి నీరు కాలువలు, డ్రెయిన్లలో కలిసింది. నాడు మంత్రిగా ఉన్న కొడాలి నాని కట్ట మరమ్మతులు చేపడతామని హడావుడి చేసి వెంటనే అంచనాలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించి చేతులు దులుపుకున్నారు. ఐదేళ్ల కాలంలో నాని పంపుల చెరువును పరిశీలించిన సందర్భాలు చాలా తక్కువ. చిన్న చెరువు కట్ట తెగినా ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు.

అంతంతమాత్రంగా కట్టల పటిష్టత

పూర్తిస్థాయి సామర్థ్యంతో చెరువులను నింపాల్సిన అధికారులు పెద్ద చెరువు కట్ట పటిష్టతపై అనుమానాలు ఉండటంతో నీటి సామర్థ్యం 1686 మిలియన్ లీటర్లు కాగా, 11 అడుగుల మేర నింపారు. చిన్న చెరువు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 634 మిలియన్ లీటర్లు కాగా, 200 మిలియన్ లీటర్లు నీటిని మాత్రమే గతంలో నింపేవారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తవటంతో పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

> గుడివాడకు శాశ్వత ఎమ్మెల్యే అని చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అధికారంలో ఉండగా పట్టణ వాసుల నీటి కష్టాలు తీర్చే సమయమే లేకపోయింది. నాని మంత్రిగా ఉన్న సమయంలో తెగిన చిన్న పంపుల చెరువు కట్టకు మరమ్మతులు చేయాలనే ఆలోచన కూడా చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై తెగిన చిన్న పంపుల చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నీటిని నిల్వ చేసేందుకు మరో సంప్ వెల్ నిర్మాణానికి రూపకల్పన చేస్తు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

కనీస అవసరాలకు నీరు అవసరం

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలంటే రోజుకు 1.25 కోట్ల లీటర్ల నీరు అవసరం ఉంది. దానికి అనుగుణంగా చెరువుల్లో నీటిని నింపుకోవాలి. చెరువు కట్టలు బలహీనంగా ఉండటంతో పూర్తిస్థాయిలో అధికారులు నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. రెండు చెరువులను పూర్తిస్థాయిలో నింపితేనే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడవచ్చు. పట్టణంలో టిడ్కో కాలనీ విలీనంతో నీటి కష్టాలు మరింత పెరిగాయి. రెండు రోజులకొకసారి నీటిసరఫరా చేసినా సరిపోవడం లేదని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

మరో సంప్‌వెల్ అవసరం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద అండర్ గ్రౌండ్ సంప్‌వెల్ నిర్మించారు. క్లోరినేషన్ అనంతరం నీటిని నిల్వ చేసేందుకు మరో సంప్‌వెల్ అవసరముంది. పట్టణంలోని తొమ్మిది ఎలివేటెడ్ రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని పూర్తిస్థాయిలో నింపకపోవడం, అవసరానికి తగ్గట్టుగా పంపింగ్ చేయలేకపోవడం, నిల్వచేసుకునే వీలులేకపోవడం, విద్యుత్ కోతలు వంటి కారణాలతో నీరు పూర్తిస్థాయిలో ప్రజలకు అందడంలేదు.


కట్ట తెగిన చిన్నపంపుల చెరువుకు మరమ్మతులు

సమస్యకు సత్వర పరిష్కారం : వెనిగండ్ల

పట్టణవాసుల తాగునీటి కష్టాలను వార్డు పర్యటనల్లో గుర్తించా.. చిన్న చెరువు కట్టకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నాం, పూర్తిస్థాయిలో చిన్న చెరువును నింపుతాం. చెరువుల కట్టలు పటిష్ట పరిచి పంపింగ్‌కు విద్యుత్ అంతరాయం రాకుండా ఆ శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాం. పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్య ఉత్పన్నమవ్వకుండా చర్యలు తీసుకుంటాం.

భువనమ్మ వచ్చారు.. రారండి

» భువనేశ్వరి రాకతో కోమరవోలు వాసుల్లో ఆనందోత్సాహం


భువనేశ్వరిని సత్కరిస్తున్న మహిళలు, ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

పామర్రు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిమ్మకూరు పర్యటనకు వచ్చిన ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణను కలిసిన కోమరవోలు వాసులు.. ఒక్కసారి మీ అమ్మమ్మ గ్రామమైన కోమరవోలుకు రావాలని కోరగా బాలయ్య వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఖంగుతిన్న విషయం తెలిసిందే.. అయితే ఆ షాక్‌లో ఉన్న కొమరవోలు వాసుల్లో బాలయ్య సోదరి, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి శుక్రవారం కోమరవోలు రావడం వారిలో నూతన ఉత్తేజం నింపడమేగాక వారి ఆనందానికి అవధుల్లేకుండా చేసింది. భువనమ్మ వచ్చింది రండి.. అంటూ మహిళలు సందడి చేశారు. భువనమ్మ గ్రామానికి రావడం అంటే స్వర్గీయ ఎన్టీఆర్ వచ్చినట్టుగా ఉందని మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో గ్రామానికి రావడం గ్రామస్థులు చేసుకున్న పూర్వజన్మ సుకృతమన్నారు. ఆయన కుమార్తె అయిన భువనేశ్వరమ్మ దత్తతతో గ్రామం ఎంతో అభివృద్ధికి నోచుకోవడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. భువనమ్మతో సెల్ఫీలు దిగేందుకు డ్వాక్రా సంఘాల మహిళలు పోటీపడ్డారు. వృద్ధులు భువనేశ్వరిని మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు వెనుక ఎంతో ధైర్యంగా నిలబడి పార్టీశ్రేణుల్లో ఉత్సాహం కలిగించి విజయానికి దోహదకారిగా నిలిచిన ఘనత భువనమ్మదే అన్నారు. రాబోయే రోజుల్లో ఆమె ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళతామని వర్ల చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, సివిల్ సప్లయిస్ ఛైర్మన్ రావివెంకటేశ్వరరావు, కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, మాజీ జడ్పీటీసీ పెద్దువీరభద్రరరావు, జీవన్‌శక్తి అధినేత కాట్రగడ్డ రమేష్, కొమరవోలు సర్పంచ్ దిరిశం రత్నకుమారి, మండల దేశం పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, గోట్టిపాటి లక్ష్మీదాసు, కృష్ణాడెల్టా సాగునీటి సంఘ వైస్‌ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, దాలిపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న వెంకటపాలెంలో శ్రీవారి కల్యాణోత్సవం

» హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

» ఏర్పాట్లపై అధికారులతో చర్చించిన టీటీడీ ఈవో

తుళ్లూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15న శ్రీవారి కల్యాణోత్సవం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కల్యాణోత్సవ ఏర్పాట్లపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, టీటీడీ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం ఆలయంలో చర్చించారు. ఆలయం ముందున్న ఆవరణలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్యామలరావు విలేకరులతో మాట్లాడుతూ.. కల్యాణం ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందని, 20 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదాలు అందజేస్తామని చెప్పారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ఈవో శ్యామలరావు జెండా ఊపి ప్రారంభించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈవో శ్యామలరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి

- కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ భార్గవ్

విజయవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రయోజనాల్లో కీలకంగా ఉండే హోదా, ప్యాకేజీని వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. త్వరలో చేయబోయే లోక్‌సభ స్థానాల పునర్విభజన వల్ల రాష్ట్రానికి అన్యాయం జరగదని ప్రజలకు హామీ ఇవ్వాలని కోరారు.


జిల్లా అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

పేదరిక నిర్మూలనకు పీ4 పునాది

» జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లోని పదిసూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ఈనెల 8 నుంచి 18 వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక సర్వే జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ నోడల్ అధికారులతో కలిసి పీ4 సర్వేపై వర్చువల్‌గా వర్క్‌షాపు నిర్వహించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, కార్యాలయ అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ4 సర్వే తీరుతెన్నులను పీపీటీ ద్వారా వివరించారు. సర్వే అనంతరం మార్చి 21న సమాచార జాబితాలను గ్రామసభలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా పైన వున్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున వున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ4 విధానం లక్ష్యమని వివరించారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలవుతుందన్నారు. సర్వే ప్రయోజనాలను క్షుణంగా వివరించి, ఖచ్చితమైన డేటాను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు ఎన్యూమరేటర్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్యకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్'గా మాస్ కాపీయింగ్

(5వ పేజీ తరువాయి)

నడవని జూనియర్ కళాశాల పేరున కూడా హాల్ టికెట్లు రావటం విచిత్రం. రెగ్యులర్ ఇంటర్ లేని కళాశాలకు ఓపెన్ ఇంటర్ సెంటర్ ఇవ్వకూడదన్న నిబంధనను కూడా అతిక్రమించారు. జిల్లా కలెక్టర్ హెచ్చరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పరీక్షల కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన వ్యక్తి స్థానంలో నియమించిన అధికారి కూడా పట్టించుకోవట్లేదు. ఏదైనా ఆరోపణలపై వివరణ కోరితే.. తనకేం సంబంధం లేదని, డీఈవోను అడగాలని సమాధానమిస్తున్నారు. పరీక్షల పర్యవేక్షణ నుంచి డీవైఈవో స్థాయి అధికారిని ఎందుకు తప్పించారో ఇన్విజిలేటర్లకు కూడా అర్థంకాని పరిస్థితి. కాగా, నియోజకవర్గంలో ఒక మండలంలో ఉన్న జూనియర్ కళాశాల పీఆర్వోను రెండు రోజుల క్రితం పట్టణంలోని విద్యార్థులు నిలదీశారు. తమకు పాస్ గ్యారెంటీ అని, పరీక్షల మేనేజ్‌మెంట్ అంతా తమదేనని వేల రూపాయాలు వసూలుచేసి, పరీక్షల్లో ఏమి సహాయం చేయట్లేదని నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకుని పీఆర్వోను పంపించేశారు.

నందిగామలోనూ..

నందిగామలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ పరీక్షల్లోనూ భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి మూడు పరీక్షా కేంద్రాల్లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అత్యధికులు ఇతర ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వస్తున్నారు. ఏఐ కో-ఆర్డినేటర్‌గా ఉన్న హెచ్ఎంలకు సిట్టింగ్ స్క్వాడ్‌లో అవకాశం కల్పించినట్టు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదులు రావటంతో వారిని విధుల నుంచి తొలగించాలని జిల్లా అధికారులు చూస్తున్నారు. వీరి ద్వారానే మాస్ కాపీయింగ్ జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.

మామిడి రెడీ..

(5వ పేజీ తరువాయి)

కాలంగా లోకల్ మండీ వ్యాపారులతో దిగుమతులు కొంతమేర తగ్గాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కొనుగోలుదారులతో లోకల్ మండీలు, పెద్ద రైతులు సత్సంబంధాలు కలిగి ఉండటంతో పలువురు ఇతర రాష్ట్ర కొనుగోలుదారులు నేరుగా తోటల వద్దకు వెళ్లి ఎగుమతులు చేసుకుంటున్నారు.

ఈ ఏడాదిపైనే ఆశలు

కరోనా కారణంగా దెబ్బతిన్న వ్యాపారులు ఈ ఏడాదిపై ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లపాటు వ్యాపారాలు లేక వెలవెలబోయిన దుకాణాలు గత ఏడాది కొంతమేర పుంజుకున్నాయనే చెప్పొచ్చు. ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుందనే ఆశలో వ్యాపారులు, రైతులు ఉన్నారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసు అధికారులు

అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు

» జల్సాల కోసం.. పగలు రెక్కీ. రాత్రిళ్లు చోరీలు

» మూడు రాష్ట్రాల్లో 32 వరకు కేసులు

» 25 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్లు

» ఆధారాలు దొరక్కుండా చేయటంలో సిద్ధ హస్తుడు

జగ్గయ్యపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మూడు రాష్ట్రాలు.. 32 చోరీలు, చదివింది ఇంటర్.. అయినా ఆధారాలు దొరక్కుండా చేయటంలో సిద్ధహస్తుడు. జగ్గయ్యపేట విష్ణుప్రియనగర్‌లో డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్ ఇంట్లో చోరీకి పాల్పడి, సీసీ కెమెరాల దృష్టి మార్చి, హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకుపోయిన ఘటనలో అంతర్రాష్ట మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా పాండురంగాపురానికి చెందిన సంపతి ఉమాప్రసాద్ ఆలియాస్ ఉమా(24)ను పోలీసులు అరెస్టు చేశారు. నందిగామ ఏసీపీ తిలక్ జగ్గయ్యపేట సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉమాను హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, నిందితుడు మైనర్‌గా ఉన్నపుడే తెలుగు రాష్ట్రాల్లో 25 చోరీలకు పాల్పడ్డాడని, మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్నాడని చెప్పారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చినా చోరీలు ఆపలేదని, గతనెలలో జగ్గయ్యపేట విష్ణుప్రియానగర్‌లో చోరీకి పాల్పడ్డాడని చెప్పారు. వేలి ముద్రలు దొరక్కుండా చేతికి గ్లౌజులు వేసుకుంటాడని, గ్యాస్ లైటర్ తరహాలో చిన్న గ్యాస్ కట్టర్ ఉపయోగించి తాళాలు కోయటం, స్క్రూడ్రైవర్ లాంటి చిన్న చిన్న పరికరాలతో చోరీలకు పాల్పడతాడని వివరించారు. నిందితుడిపై 32 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సూచనలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడి కదలికలను గుర్తించినట్టు చెప్పారు. నిందితుడు గరికపాడు వద్ద నందిగామలో చోరీ చేసిన బంగారాన్ని విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. అతడి నుంచి రూ.20లక్షల విలువ చేసే గ్రా.220ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

- కొద్దిరోజుల క్రితం బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలో నల్లపూసల గొలుసు తెంపుకుని వెళ్లిన ఘటనలో నిందితుడు ఖమ్మం జిల్లా ముత్తవరం గ్రామానికి చెందిన గలంజీపల్లి శేఖర్ (27)ను అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ తెలిపారు. రెండు కేసుల్లో తక్కువ సమయంలో నిందితులను పట్టుకోవటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు జి.రాజు, బీతః వెంకటేశ్వరరావులను ఏసీపీ అభినందించారు.

కుమార్తెను చూసేందుకు వచ్చి..

అడవి పందుల ఉచ్చుకు బలి!


మృతుడు రాజు

జగ్గయ్యపేట రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కుమార్తెను చూసేందుకు వచ్చి.. సరదాగా వియ్యంకుడితో కలిసి పొలానికి వెళ్లిన వ్యక్తి అడవి పందుల ఉచ్చుకు బలయ్యాడు. చిల్లకల్లు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గౌరవరానికి చెందిన కత్తుల సుధాకర్, గొర్లెపాటిరాజు వియ్యంకులు. గురువారం రాత్రి సుబాబుల్ తోటకు నీరు పెట్టేందుకు ఇద్దరూ కలిసి వెళ్లారు. ఆ ప్రాంతంలో నందిగామ డీవీఆర్ కాలనీకి చెందిన జగన్నాథం గోపి, యాటగిరి నాగార్జునలు సుబాబుల్ తోట సమీపంలో అడవి పందుల కోసం ఉచ్చులు పెట్టి దానికి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేచిఉన్నారు. విషయం తెలియని రాజు, సుధాకర్‌లు పొలంలోకి అడుగు పెట్టగానే విద్యుత్ షాక్‌తో రాజు(47) మృతి చెందగా సుధాకర్ తృటిలో తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని నిందితులను పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

రెండు కుటుంబాల్లో విషాదం

రాజు తన పెద్ద కుమార్తెకు గౌరవరానికి చెందిన కత్తుల సుధాకర్ కుమారుడితో వివాహం జరిగింది. రాజు భార్య, కుటుంబసభ్యులు గుంటూరులో జరిగే కార్యక్రమానికి వెళ్లగా రాజు కుమార్తె ఇంటికి గౌరవరం వచ్చాడు. రాత్రి భోజనానంతరం సుధాకర్ పొలం వెళుతుండటంతో రాజు కూడా వెళ్లి మృత్యువాత పడ్డాడు. రాజు మృతి రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

పురగుట్టలో పేలిపోయిన ఫ్రిజ్

» రూ. 2 లక్షల ఆస్తి నష్టం


ఇంట్లో ధ్వంసమైన సామగ్రి

మైలవరంరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందుగల శివారు పురగుట్ట కాలనీలోని మరీదు నిరంజన్‌రావు ఇంటిలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తూ ఫ్రిజ్ పేలింది. భారీ పేలుడుతో ఇంటిలోని సామగ్రి చెల్లాచెదురయ్యాయి. పేలుడు ధాటికి ఇంటి తలుపులు, కిటికీలు విరిగిపోగా, గోడలు నెర్రలిచ్చాయి. పేలుడుకు పెద్ద శబ్దం రావడంతో కాలనీలోని నివాసితులు ఉలిక్కిపడ్డారు. పేలుడు సమయంలో నిరంజన్‌రావు కుటుంబసభ్యులు బెడ్‌రూంలో ఉండి ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97,105, 116
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

వీఎంసీ డైరీ ఆవిష్కరణ

కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం ఉదయం తన చాంబర్‌లో అధికారులతో కలసి విజయవాడ నగర పాలక సంస్థ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరవాసులకు ఉపయోగపడే అన్ని ముఖ్యమైన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకటనారాయణ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే. సురేష్‌బాబు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అసిస్టెంట్ కమిషనర్లు వెంకటేశ్వరరావు, హెలెన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొట్టిపాటి రామకృష్ణ

పీబీ సిద్ధార్థలో నేడు యోగాసన భారత్

పటమట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్విట్ ఇండియా, ఖేలో ఇండియా డివిజన్ సంయుక్తంగా క్విట్ ఇండియా మహిళా వారోత్సవం, యోగాసన భారత్‌ను శనివారం పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఉద్యమాన్ని ప్రోత్సహించడం, అన్ని రాష్ట్రాల్లో ఈ నెల 6 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నామన్నారు. క్విట్ ఇండియా వెల్‌నెస్, యోగాసన స్పోర్ట్స్ అవగాహన నిమిత్తం రెండ్రోజుల నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రిస్క్ సర్టిఫికెట్ సబ్‌మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షురాలు రాధిక, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు, ప్రయాణికులకు భద్రత

రైల్వేస్టేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు, రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఎ పాటిల్ అన్నారు. శుక్రవారం విజయవాడ డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో రైల్వే మహిళా ఉద్యోగులు చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. రైల్వే శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళా ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా పనిచేస్తూ రైల్వే శాఖ పురోగతికి దోహదపడు తున్నారని తెలిపారు. తొలుత హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మై ప్రతాప్ చట్టపరమైన అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రం, మెమొంటోలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్) పి.అడ్విన్, సీనియర్ డీపీవో కట్టా ఆనంద్, సౌత్ సెంట్రల్ రైల్వే ఉమన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ బి.వీణాచందన, పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



మహిళా ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీటీసీ ఎ.మోహన్

మహిళలను గౌరవించడం మన బాధ్యత
డీటీసీ ఎ.మోహన్

ఎన్టీఆర్ కలెక్టరేట్: నిత్యం ఒత్తిడితో సతమతమవుతున్న మహిళలు క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని, ధైర్యాన్ని పొందుతారని డీటీసీ ఎ.మోహన్ తెలిపారు. బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగినులతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమానికి డీటీసీ ఎ.మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీదేవి జడ్జిగా వ్యవహరించి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మోహన్ మాట్లాడుతూ మహిళలను గౌరవించే విధంగా ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ ముందుంటు న్నారన్నారు. అనంతరం విజేతలకు డీటీసీ మోహన్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవోఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, జి.ఉషసుందరి, మహిళా ఉద్యోగినులు భవానీ, అరుణ, దివ్య, భాగ్యం, భావన, సుమ, రమాదేవి, సరస్వతి పాల్గొన్నారు.

రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో...

పటమట: రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో గురునానక్ కాలనీ రోడ్డులోని ఎనీ టైమ్ ఫిట్‌నెస్ సెంటర్లో మహిళాదినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వందనపు పావనకృష్ణ, రోటరాక్ట్ ప్రాజెక్టు చైర్మన్ నిషిత లక్ష్మి, రోటరాక్టర్స్ సంపత్ నవదుర్గా, సౌమ్య, ఉస్మాన్ పాల్గొన్నారు.

జనశిక్షణా సంస్థాన్, తరుణీ తరంగాల ఆధ్వర్యంలో...

మొగల్రాజపురం: నేటి ఆధునిక యుగంలో మహిళల పాత్ర లేకుండా ఏదీ లేదని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అన్నారు. మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్, తరుణీ తరంగాలు సంయుక్తంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళ హక్కుల సాధనకు సమాజంలో ఆడ, మగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. ఐద్వా కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ కుటుంబంలోని ఆడపిల్లలను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ, తదితరులు మాట్లాడారు.

మహిళలు స్వతంత్రంగా జీవించాలి
డీసీపీ ఉదయరాణి



మహిళా శక్తిని చాటుదాం అంటూ ఎస్ఆర్ఆర్ కళాశాల మహిళా అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీపీ ఉదయరాణి

గుణదల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలపడి స్వతంత్రంగా జీవించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని జిల్లా పోలీస్ కమిషనరేట్ టెక్నికల్ విభాగం డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయరాణి మాట్లాడుతూ అంతర్జాలాన్ని పాజిటివ్‌గా ఉపయోగించుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యతోపాటు ఇతర రంగాల్లోనూ మహిళలు ప్రతిభ కనబర్చి మహిళా శక్తిని చాటాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు డాక్టర్ అరుణ, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ రోజ్లిండ్, బాలసుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.



ముఖ్య అతిథి డాక్టర్ యద్ధనపూడి రాజాతి, ఆర్టీసీ ఉద్యోగులు

మహిళా ఉద్యోగులపై ప్రత్యేక శ్రద్ధ
జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. యేసుదానం

బస్టేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే మహిళా ఉద్యోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజారవాణ అధికారి ఎం.యేసుదానం అన్నారు. శుక్రవారం ఆర్టీసీ హౌస్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.యేసుదానం అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళల హక్కులు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సహకారాలపై అవగాహన కల్పించటమే మహిళా దినోత్సవ లక్ష్యమన్నారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ యద్ధనపూడి రాజాతి మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండటం ద్వారా మహిళలు ఎప్పటికీ ఎవరిమీద ఆధారపడే అవకాశం ఇవ్వరాదన్నారు. అనంతరం జిల్లావ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు నగదు పురస్కారాలు అందచేశారు. డిప్యూటీ సీటీఎం శ్రీనివాసరావు, పీవో వెంకట రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ హనుమంతరావు, అసోసియేషన్ నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



దుర్గామల్లేశ్వరులకు విశేష నిత్య పూజలు



ఆర్జిత సేవలో భక్తులు

ఇంద్రకీలాద్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరులకు శుక్రవారం విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన ఉచిత బస్ సదుపాయం ఉపయోగించుకుని భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దర్శనం అనంతరం దేవస్థానం అందిస్తున్న ఉచిత ప్రసాదం, నిత్య అన్న ప్రసాదాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో స్వీకరించారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్‌లో కొండపల్లిపై రాయల్ సిటీ గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్ లలో శుక్రవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదట మ్యాచ్ కొండపల్లి, రాయల్ సిటీ జట్ల మధ్య జరగగా మొదట బ్యాటింగ్ చేసిన కొండపల్లి జట్టు 21.5 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయల్ సిటీ జట్టు 16.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో రైల్వేస్, ఆంధ్రా బ్లూ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు 27.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా జట్టు 13.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి విజయం సాధించింది.

నక్షత్రాలు కనిపించకపోవడం కాలుష్యానికి సూచన
గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న హరి సుబ్రహ్మణ్యం

పటమట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో తరచూ నక్షత్రాలు కనిపించకపోవడం భూ వాతావరణంలో సంభవిస్తున్న మార్పులుగా గమనించాలని, ఇది వాతారణ కాలుష్యాన్ని సూచిస్తుందని గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత అన్నారు. శుక్రవారం సైన్స్ పర్యావరణం అనే అంశంపై నాస్తిక కేంద్రంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దట్టమైన పొగ, పొగమంచు భూమి చుట్టూ వ్యాపించడం పట్టణాల్లో నక్షత్రాలు కనిపించకపోవడానికి కారణాలు అన్నారు. ఆధునిక సైన్స్ టెక్నాలజీ మానవ అవసరాలను తీర్చేందుకు ఉరకలు వేస్తుందని, అదే సమయంలో పర్యావరణం పట్ల ప్రతి వ్యక్తి అవగాహన పెంపొందించుకోవడం కర్తవ్యంగా భావించాలన్నారు. విజేతలైన విద్యార్థులకు సోషల్ యాక్టివిస్టు హరి సుబ్రహ్మణ్యం, నకలలు బహుమతులు అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్,మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 12 వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్, పంటకాల్వరోడ్డు, 1వ క్రాస్ 2,3,4,5,6 రోడ్డు, 2వ క్రాస్ 4,5,6 రోడ్లు, 3వ క్రాస్ 5,6 రోడ్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లించకుంటే మంచినీటి కనెక్షన్ కట్

● సెలవు రోజుల్లో అందుబాటులో క్యాష్ కౌంటర్లు

కార్పొరేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పన్నుల బకాయిలు చెల్లించకుంటే ఇంటి మంచినీటి కుళాయిల కనక్షన్‌లు కట్ చేసేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ జీ. సృజన పర్యవేక్షణలో ఎక్కువ మొత్తంలో పన్నుల బకాయిలు ఉన్న పలువురి ఇంటి కుళాయి కనక్షన్‌లు నగరపాలక సంస్థ సిబ్బంది కట్ చేశారు. ముఖ్యంగా వన్‌టౌన్, కొత్తపేట, రైల్వే స్టేషన్ , గవర్నర్‌పేట, వాంబే కాలనీ, గాంధీనగర్, పటమట, కరెన్సీనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ పన్ను బకాయిలు ఉన్నవారి నీటి, డ్రెయినేజీ కనెక్షన్లు తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఈ నెల 31 వరకు సెలవు దినాలలో కూడా విజయవాడ నగర పాలకసంస్థ అన్ని క్యాష్ కౌంటర్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉన్నా యని. ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఆటోనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిడమానూరు జాతీయ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పమటకు చెందిన శ్రీరాములు నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం శ్రీరాములు ద్విచక్రవాహనంపై విధులకు బయలుదేరాడు. బెన్జ్‌సైస్ సమీపంలో అదే స్కూల్‌లో విధులు నిర్వహించే ఓ మహిళ, కుమారుడుతో కలిసి రాంగ్ రూట్లో ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు, మహిళ కుమారుడి తలకు బలమైన గాయాలయ్యాయి. శ్రీరాములు స్పృహ తప్పారు. స్థానికులు అంబులెన్సుకు కాల్ చేసి క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

17 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్ పరిధిలోని 17 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో 17 మంది లబ్ధిదా రులకు మంజూరైన రూ.18,19,622 చెక్కులను అందచేసినట్లు చెప్పారు.

గురుకుల కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం

విజయవాడ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తేనే సమాజంలో గౌరవంగా జీవించగలరని, అందుకు చదువే ఆధారమని ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకొన్నాయి. కళారూపా (క్రాఫ్ట్)ల తయారీలో హర్షిత, త్రిషలు వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధీర వనితలు!

పురుషాధిక్య ప్రపంచంలో మేము సైతం అంటున్నారు. అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో ఆకాశమంత ఎదిగి అబలలం కాదు ధీర వనితలం అని నిరూపించుకున్నారు. స్వశక్తితో ఎదిగి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజ సమూల మార్పులో సమర్థనీయ పాత్ర పోషిస్తున్నారు. విభిన్న రంగాల్లో విజయతీరాలకు చేరిన మగువలూ..మీ తెగువకు వందనం.. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

-(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/ జగ్గయ్యపేట /విజయవాడ కల్చరల్)

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- స్వశక్తితో ఎదిగి..సమాజానికి స్ఫూర్తిగా నిలిచి
- విభిన్న రంగాల్లో రాణిస్తున్న మగువలూ.. మీ తెగువకు వందనం!



హోమ్‌గార్డుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కలెక్టర్ డీకే బాలజీ సతీమణి పృథ్వీ కల్యాణి, ఎస్పీ గంగాధరరావు సతీమణి పద్మజ



ప్రసంగిస్తున్న భారతీయం చైర్మన్ సత్యవాణి

మహిళలు..దివ్యశక్తి స్వరూపిణులు

మచిలీపట్నం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు దివ్యశక్తి స్వరూపిణులని, మహిళలు లేనిదే సమాజ అభివృద్ధి లేదని భారతీయం చైర్మన్ సత్యవాణి అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అధ్యక్షతన పోలీసు కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సత్యవాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళా హోమ్‌గార్డులను సత్కరించారు. మహిళలు చేసిన వంటకాలను కలెక్టర్ డీకే బాలజీ సతీమణి పృథ్వీ కల్యాణి, ఎస్పీ గంగాధర రావు సతీమణి పద్మజ, కొల్లు నీలిమ రుచి చూశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు కొల్లు నీలిమ బహుమతులు అందజేశారు.

ఆరోగ్యకర సమాజం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సైకాలజిస్ట్ ప్రియ

స్త్రీలలో కొందరు 40 ఏళ్లు దాటిన తర్వాత కేన్సర్ బారిన పడటం సైకాలజిస్ట్ ప్రియను కలవరపరిచింది. దీంతో మహిళలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఆహారం వల్ల మనిషి ప్రవర్తన(న్యూట్రిజీనోమిక్స్), తీసుకునే ఆహారపు అలవాట్లు(న్యూట్రి జనటిక్స్) అనే అంశాలపై కేఎన్‌ఓటీఎస్ ఫౌండేషన్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పలు అవార్డులు అందుకున్నారు. ఆహారం కారణంగానే 11 నుంచి 12 ఏళ్లకే బాలికలు రజస్వల అవుతున్నారని, రక్తహీనతపై బాలికలకు, వారి తల్లులకు అవగాహన ఉండాలంటున్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.



వెయ్యి మందికి అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి మహిళా పెళ్లికి ముందే అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో నాట్స్ ఫౌండేషన్ స్థాపించి ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై పని చేస్తున్నాం. అంతర్జాతీయ సౌత్ కొరియన్ సంస్థతో కలిసి వెయ్యి మందికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రాష్ట్రంలోను, జిల్లాలోను వీటికి సంబంధించిన ఆఫీసుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

-ప్రియ, సైకాలజిస్టు, విజయవాడ

వైకల్యాన్ని లెక్కచేయని సేవా తత్పరురాలు బొప్పన రాధ

తనకు వైకల్యం ఉందన్న విషయాన్ని బొప్పన రాధ పట్టించుకోరు. నడవలేనంత మాత్రాన ఏపనీ ఆగకూడదనేని ఆమె ఆలోచన ఇప్పటి వరకు 180 మందిని వీల్‌చైర్స్ రూపంలో నడిపిస్తోంది. పోలియోతో కాలు చచ్చుబడినా ఆర్టీసీలో ఫార్మసిస్టుగా పని చేసి వాలంటరీ రిటర్మెంట్ తీసుకుని తన సంపాదనతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అమ్మమాట అమ్మాయి బాట అనే యూ ట్యూబ్ ద్వారా ఆన్‌లైన్‌లో చీరల వ్యాపారం ప్రారంభించారు. తన సంపాదనలో వచ్చిన సొమ్ముతో ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కాళ్లులేని వారికి 180కి పైగా ట్రై సైకిల్స్ వితరణ గావించారు. 34 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. నలుగురితో చిరు వ్యాపారాలు పెట్టించారు. సేవా కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళలు స్వతంత్రంగా ఎదగాలి



ప్రతి మహిళా స్వతంత్రంగా ఎదగాలి. దివ్యాంగులపై జాలి, సానుభూతి చూపడం కంటే వారిలో ధైర్యం నింపి వారి పని వారు చేసుకునేలా చూడటం మంచిది. నడవలేకపోవడం లోపమే కాదు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళా తన కాళ్ల మీద తాను నిలబడాలి ఎవ్వరి మీద ఆధారపడకూడదు.

- బొప్పన రాధ, విజయవాడ

నేడు పది మంది మహిళలకు పురస్కారాల ప్రదానం

మచిలీపట్నం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పది మంది మహిళలకు శనివారం పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని డీఆర్డీయే పీడీ వై.హరిహరనాథ్ తెలిపారు. మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో గోడ సంపత్ హేళాషరున్, ప్రధాని, రాష్ట్రపతి వద్ద వీణా వాదనం చేసిన అప్పికట్ల దీప్తి, మిద్దెతోటలు పెంచి సీఎం చంద్రబాబు నుంచి అవార్డు తీసుకున్న ముంతాజ్ బేగం, 70 ఏళ్ల వయసులో క్రీడా రంగంలో 75 పతకాలు సాధించిన క్రీడాకారిణి తోట విజయకుమారి, విద్యార్థులకు భగవద్గీత నేర్పుతూ మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి నుంచి స్వర్ణపతకం పొందిన టీటీడీ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి, ప్రముఖ కథా రచయిత్రి మేరీ కృపాబాయి, వాసవీ మహిళా మండలి ప్రతినిధి వేముల శిరీష, చిలకలపూడిలో అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న సామాజిక సంఘ సేవకురాలు కరెడ్ల సుశీలకు పురస్కారాలు అంజేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయన్నారు.

జగ్గయ్యపేటలో లీడింగ్ సీఏ సాయి సుస్మిత



పెళ్లయ్యాక కూడా చదువుకుని పిన్న వయస్సులోనే సీఏ పూర్తి చేసి, ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రాంతంలో లీడింగ్ సీఏగా ఉన్నారు పెనుగొండ సాయి సుస్మిత. విజయవాడకు చెందిన ఆమె తండ్రి మురళీకృష్ణ డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేస్తుంటారు. తల్లి రాధిక గృహిణి. ఇంటర్ ఎంఈసీ చేస్తుండగా సీఏ చేయాలని సుస్మిత నిర్ణయానికి వచ్చింది. తర్వాత సీఏ ఇంటర్, సీపీటీ పూర్తి చేశారు. సీపీలో జాతీయస్థాయిలో 11వ ర్యాంకుకు సమానమైన మార్కులు సాధించింది. సీఏ ఇంటర్ పూర్తి కాగానే జగ్గయ్యపేటకు చెందిన సీఏ పెనుగొండ బదరీ నారాయణ కుమారుడు రాజీవ్‌తో వివాహమైంది. పెళ్లయ్యాక ఏడాదిలోపే సీపీటీ పూర్తి చేసింది. అప్పుడే అమలులోకి వచ్చిన జీఎస్టీ కొత్త చట్టం సవాళ్లను అధిగమించింది. గృహిణిగాను సుస్మిత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. నాలుగేళ్ల తన కుమారుడి బాధ్యతలు తానే చూసుకుంటుంది.

నాతో పాటు 30 మందికి ఉపాధి

సీఏ బ్రహ్మపదార్థం కాదు. ఇష్టపడి చదివితే సాధించవచ్చు. వ్యాపార నిబంధనలు తెలుసుకుంటే పన్ను చెల్లింపుల వ్యవహారం క్లిష్టమేమి కాదు. నాతో పాటు 30 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

- సాయి సుస్మిత, సీఏ, జగ్గయ్యపేట

తలసేమియా బాధితుల సేవలో డాక్టర్ పిన్నమనేని కల్యాణి



జనవారధి సర్వీస్ సొసైటీలో డైరెక్టర్‌గా ఉన్న ఏకైక మహిళ డాక్టర్ పిన్నమనేని కల్యాణి. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 524 మంది తలసేమియా బాధిత పిల్లలను దత్తత తీసుకుని వారికి రక్తదానం చేయిస్తూ ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. బాధితుల రక్తం మార్పిడికి అవసరమైన రూ.1,550 విలువైన రక్త ప్యాకెటును తమ సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నారు.

రక్తం ఇప్పిస్తే మరింత మందికి సేవ చేస్తాం

ప్రభుత్వ ఆర్గనైజేషన్లకే రక్తదానం చేస్తున్నారు. మాలాంటి ప్రైవేటు ఆర్గనైజేషన్(జన వారధి సర్వీస్ సొసైటీ)కు రక్తదానం చేయడం లేదు. అయినా మేము క్యాంపులు నిర్వహించి వచ్చిన రక్తంలో 30 శాతం ప్రభుత్వ వైద్యశాలలకు అందిస్తున్నాం. రక్తదాతల నుంచి మాకు రక్తం ఇప్పిస్తే మరింత మందికి సేవ చేస్తాం. ప్రభుత్వ వైద్యశాల ముందు తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సులు పెట్టాలని ప్రయత్నిస్తున్నాం. త్వరలో సదస్సులు నిర్వహిస్తాం.

- డాక్టర్ పిన్నమనేని కల్యాణి, విజయవాడ

సమాజ సేవకి కోయ సుధ



మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తూ ఇప్పటి వరకు 11 వేల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లు పంపిణీ చేయించారు మైలవరం మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె చిన్న నాటి నుంచి సమాజానికి ఏదో చేయాలనే తపనతో ఉండే వారు. పెళ్లి అయి, పిల్లలతో బిజీగా ఉన్నా ట్రస్టు పెట్టి ఎందరో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల శిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ, బ్యూటీషియన్, పచ్చళ్ల తయారీ, మగ్గాల శిక్షణ, కారం పొడి తయారీ, స్కిల్ నేర్పించడంలో శిక్షణ ఇప్పించారు. 8 గ్రామాల్లో వేల మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. నాబార్డు, ఎన్నారై, ఇతర దాతల సాయంతో రైతులకు అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి నెలా అనాథలకు, రోగులకు ఉచితంగా భోజనం అందించడం, హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారు. పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు చెల్లిస్తుంటారు.

సేవ చేయాలనే తపన

చిన్నతనంలో నా కళ్ల ముందు జరిగిన ఓ రోడ్డు ప్రమాదం నన్ను కలచి వేసింది. అప్పటి నుంచి తోటి వారికి ఎలా సహాయం చేయాలా అని ఆలోచించాను. నా వద్ద ఉన్న దానితో పాటు దాతల సాయమూ తీసుకుని ట్రస్టు స్థాపించాను. ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించగలిగే స్థాయికి ఎదిగాను. ప్రతి మహిళా తన కాళ్ల మీద తాను నిలబడగలిగేలా ఎందులో ఒకదానిలో శిక్షణ ఇచ్చాం. ఇస్తూనే ఉన్నాం.

- కోయ సుధ, మైలవరం

స్త్రీ సమర్థతకు చిహ్నం డాక్టర్ సిరిపురపు పద్మజ



విద్య, విజ్ఞానం, మార్గదర్శకత్వం... ఈ మూడు లక్షణాలు కలిగిన మహిళ డాక్టర్ సిరిపురపు పద్మజ. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేస్తూ, దుర్గా మల్లేశ్వర మహిళా కళాశాలను ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల మేధో వికాసాన్ని ప్రోత్సహిస్తూ, వారిని విభిన్న రంగాల్లో ఉన్నతులుగా నిలిచేందుకు మంచి మార్గాన్ని చూపారు. ఆమె నిబద్ధత, కృషికి గుర్తింపుగా 2019లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు, భారత మహిళా శిరోమణి అవార్డు వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలు ఆమె ప్రతిభను చాటుతున్నాయి. కేవలం తరగతి గదిలో బోధన మాత్రమే కాకుండా, యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, హార్ట్‌ఫుల్ ఇనిస్టిట్యూట్ వంటి సంస్థలతో కలిసి విద్యార్థుల్లో సేవా భావనను పెంపొందించడంలో ఆమె పాత్ర ప్రత్యేకం. కళాశాల ప్రిన్సిపాల్‌గా, విద్యార్థుల కోసం ఉత్తమ విద్యా విధానాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రభుత్వ అవార్డులతో ప్రశంసలు అందుకున్నారు. కళాశాల అభివృద్ధికి పాటుపడటం ఆమె నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనం.

యాడ్స్ వ్యాపారంలో దూసుకెళ్తున్న మంజుల

ఎమ్ఆర్ యాడ్స్ పేరుతో ఎం.మంజుల వ్యాపార(ప్రకటనల బోర్డుల) రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం తన భర్త రాజాతో ఆలోచన పంచుకుని ఎమ్ఆర్ యాడ్స్ పేరుతో నగరంలో వ్యాపారాన్ని ప్రారంభించారామె. చిన్న వ్యాపారులు లక్షలు వెచ్చించి 10-20 సైజుల్లో హోర్డింగ్స్ పెట్టించలేరని వారి వ్యాపార సామర్థ్యం మేరకు వారు పబ్లిసిటీ చేసుకునేలా 4-3 సైజులో పోల్ యాడ్స్‌కు డిజైన్ చేసి అందులో విజయం సాధించగలిగారు. తన భర్త రాజా 2018లో కన్నుమూశారు. ఆమె ఏమాత్రం కుంగిపోలేదు. పోటీ వ్యాపార సంస్థలు ఆమెపై ప్రత్యక్ష, పరోక్ష దాడి చేసినా వాటన్నింటిని తట్టుకుని ఇప్పటికీ మార్కెట్‌లో నిలబడిగలిగారు. ఇతర దేశాలకు వెళ్లి అక్కడ హోర్డింగ్స్ వ్యాపార ప్రకటనలకు వాడే బోర్డుల తయారీలో మెళకువలు తెలుసుకుని ఇక్కడ వాటిని వైవిధ్య భరితంగా అమలుచేశారు. మంచి మహిళా వ్యాపార వేత్తగా మన్ననలు పొందుతున్నారు. ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

పని పూర్తి చేసే వరకు నిద్రపోను



ఏ విషయాన్ని నేను ఈజీగా తీసుకోను. పని పూర్తి చేసే వరకు నిద్రపోను. వ్యాపారాన్ని నా భర్త నేను కలిసి ప్రారంభించినా తొలి రోజుల్లో ప్రకటనల కోసం వచ్చే వారు మీ భర్త ఉన్నారా అని అడిగేవారు నాకు ఆశ్చర్యం వేసేది. ఆడవారు అంటే ఎందుకంత చులకన అనిపించేంది. అవుట్ డోర్ పని మీరెలా చూసుకుంటారు అనే వారు. అయినా నేను నిలబడ్డాను. సాధించాను. వినూత్న ఆలోచనలతో వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించాను. పోటీ ఎంత ఉన్నా ఎదుటి వారిని బాధించకుండానే వ్యాపారం చేశాను అదే నా విజయ మంత్రం.

-ఎం.మంజుల. ఎమ్ఆర్ యాడ్స్ అధినేత, విజయవాడ

సాంకేతిక రంగంలో సత్తా చాటుతున్న డాక్టర్ వాసవి



సాంకేతిక రంగంలో సత్తా చాటారు 27 ఏళ్ల అనుభవం కలిగిన ప్రముఖ అధ్యాపకురాలు, పరిశోధకురాలు డాక్టర్ ఎస్.వాసవి. ప్రస్తుతం ఆమె వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. ఇస్రో, డీఎస్టీ, ఐఈఈఈ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో రూ.1.5కోట్ల విలువైన నాలుగు పరిశోధన ప్రాజెక్టులు నడిపిస్తున్నారు. 109కి పైగా పరిశోధన పత్రాలు ఎస్‌సీఐ, స్కోపస్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. మూడు పేటెంట్లను ఆమె సాధించుకున్నారు. ఇల్లినాయిస్ స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయాలతో కలిసి ఆమె పనిచేస్తున్నారు. ఐఈఈఈ ఐసీవోఐపీ(సింగపూర్), ఐఈఈఈ కాన్ఫరెన్స్(పారిస్), ఐఈఈఈ ఐఈఎంసీవోఎన్(కెనడా) వంటి అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌లో కీలక పాత్ర పోషించారు. ఆమె కృషికి ఇండియన్ ఉమెన్ అచీవర్స్ అవార్డు(ఐడబ్ల్యూఏఏ 2024), ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఔట్‌స్టాండింగ్ ఉమెన్ ఇంజనీరింగ్ అవార్డు వంటి అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. వాసవి పరిశోధనలోనే కాకుండా, కొత్త తరానికి మార్గనిర్దేశం చేసే గురువుగా నిలిచారు. ఆమె సాధించిన విజయాలు సాంకేతిక రంగంలో మహిళలు సమానంగా రాణించగలరనే విషయాన్ని నిరూపిస్తున్నాయి.

డ్వాక్రా ఉత్పత్తులకు ఒకే రోజు రూ.5 కోట్ల ఆర్డర్లు

- గిన్నీస్ రికార్డులో చోటు
- అందులో జిల్లా ఉత్పత్తులు ఇమిటేషన్ జ్యువెలరీ, కలంకారీ వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, అగరొత్తులకు అగ్రస్థానం

స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ఒకే రోజు రూ.5 కోట్ల ఆర్డర్లు లభించాయని, ఇది గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందని డీఆర్డీయే నూతన ప్రాజెక్టు డైరెక్టర్ వై.హరిహరనాథ్ తెలిపారు. ఇందులో జిల్లాలోని మచిలీపట్నంలోని రోల్డుగోల్డు నగలతో పాటు పెడన కలంకారీ వస్త్రాలు, చిట్టూర్పులో తయారు చేసిన జనపనార బ్యాగులు, అగరొత్తులు, ఫినాయిల్‌కు ఆన్‌లైన్‌లో అధిక ఆర్డర్లు లభించాయని ఆయన తెలిపారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న మంత్రి అనిత, పక్కన మంత్రి సవిత, సీపీ రాజశేఖరబాబు

తండ్రుల స్ఫూర్తితో అడుగులు వేశాం

- చర్చా వేదికలో మంత్రులు అనిత, సవిత

విజయవాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తమ తండ్రులు ఇచ్చిన స్ఫూర్తితోనే రాజకీయంగా ఎదిగామని మంత్రులు అనిత, సవిత వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి చర్చావేదికను తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. సమాజంలో మహిళల గుణగణాలు తెలియకుండానే విమర్శలు చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఈ విమర్శల్లో ముందుగా వారి ప్రవర్తనపై మరకలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పని చేసుకునే మహిళ నుంచి ఉద్యోగం చేసే మహిళ వరకు అంతా గొప్ప వాళ్లేనని వ్యాఖ్యానించారు. తమ తండ్రి తర్వాత చంద్రబాబు ప్రత్యక్ష దైవమన్నారు. అనేక అవమానాలు, కేసులు ఎదుర్కొని నేడు మంత్రులుగా ఉన్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళలకు రిజర్వేషన్లు ముఖ్యం కాదని, వారు తలుచుకుంటే ఎంత వరకు అయినా వెళ్లగలరని చెప్పారు. ప్రతి తల్లి మగపిల్లలకు అమ్మాయిలు, మహిళల పట్ల ఎలా వ్యవహరించాలో బాల్యం నుంచి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్, డీసీపీ సరిత, ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీయే కృష్ణా పీడీగా వై.హరిహరనాథ్ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి కృష్ణాజిల్లా కు డీఆర్డీయే పీడీగా వచ్చిన వై.హరిహర నాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వ కంగా కలెక్టర్ బాలాజీని కలిశారు. మొక్కను అంద జేశారు. డీఆర్డీయే కార్యాలయం లో సిబ్బందితో మాట్లాడారు.



కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఆర్డీయే పీడీ వై.హరిహరనాథ్

విద్యారంగ సంస్కరణలతో మారుతున్న దేశ ముఖచిత్రం

- సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్

మొగల్రాజపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణలతో దేశ ముఖ చిత్రం మారుతోందని, ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు విశ్వ విద్యాలయాల గ్రాంట్ల సంఘం చర్యలు తీసుకుంటోందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన విద్యావిధానం 2020లో మార్పులతో విద్యార్థికి చదువుకునే కోర్సుల్లో పరిమితులు తీసేశారన్నారు. డిగ్రీ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌తో సంబంధం లేకుండా నచ్చిన పీజీ కోర్సులు తీసుకోవచ్చని తెలిపా రు. కొత్తగా వచ్చిన ప్రాంప్ట్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధ లాంటి టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని సూచించారు. దేశ అవసరాలకు అనుగుణంగా నూతనంగా ఆలోచించాలని, పరిశోధనలు పెరగాలని, పారిశ్రామిక అవసరాలకు అనుగుణం గా విద్యాసంస్థలు కొత్త కోర్సుల బోధనపై దృష్టిపెట్టాలన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థ లు ఏర్పాటై యాభై సంవత్సరాలు అవడం అభినందనీయం అన్నారు. ఎంతో మంది సిద్ధార్థ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు, బ్యూరోక్రాట్లు, న్యాయాధిపతులు, పారిశ్రామికవేత్తలు, కళాకారులు, ఇంజనీర్లు, డాక్టర్లుగా ఉండడం గర్వకారణమని సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఈరోజు డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగిందన్నారు. స్వర్ణోత్సవ లోగోను మామిడాల జగదీష్‌కుమార్ చేతుల మీదుగా అవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రొఫెసర్ మధుమూర్తి, కృష్ణాయూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉషా, రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమీషనర్ కేవీ చౌదరి పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న యూజీసీ చైర్మన్ మామిడాల జగదీష్ కుమార్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య

నగరంలో ఆటోల పరిమితి యథాతథం

- 12,600 ఆటోలు తిరిగేందుకు అనుమతి
- పాత ఉత్తర్వుల పునరుద్ధరణ
- ఇటీవల విడుదల చేసిన పరిమితి ఎత్తివేత జీవో ఉపసంహరణ
- పాత ఆటోల నగర ప్రవేశానికి అవకాశం లేకపోవడంతో ఆటోవాలాల ఆందోళన
- నిర్ణయాన్ని మార్చుకున్న ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో పరిమితికి మించి ఆటోలు తిరగరాదన్న పూర్వ నిబంధనలనే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో మాదిరిగా 8600 + 4000 ఆటోలు మొత్తం 12,600 ఆటోల రాకపోకలకు మాత్రమే పరిమితులు కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కొద్ది రోజుల కిందట ఈ ఆటోలపై ఉన్న పరిమితులను ఎత్తివేయటంతో పాటు పాత ఆటోలకు ప్రవేశంపై ఆంక్షలు విధించటంతో వివాదం రాజుకుంది. ఆటో షోరూమ్‌లకు ప్రయోజనం కల్పించే విధంగా చర్యలు ఉంటున్నాయన్న తీవ్ర విమర్శలు వచ్చాయి.

అసెంబ్లీలో ప్రస్తావించిన బొండా ఎమ్మెల్యే ఉమా

దీనిపై ఇటీవలే ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అసెంబ్లీలో గట్టిగా ప్రస్తావించారు. దీంతో రాష్ట్ర ప్రభు త్వం కూడా తిరిగి పాత ఆదేశాలనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. విజయవాడలో దశాబ్దంన్నర కిందటి 7,500 ఆటోలకు పరిమితి ఉండేది. తర్వాత మరో 1,100 ఆటోలకు అనుమతులు ఇచ్చారు. 2014-15 లో గన్నవరం, ఇబ్రహీంపట్నం, పెనమలూరు ప్రాంతాలవి మరో 4 వేల ఆటోలకు అనుమతించారు. ఇవన్నీ సీఎన్‌జీ ఆటోలుగా అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిందిగా అప్పట్లో ఆదేశాలిచ్చారు. ఇటీవల ఇచ్చిన ఆదేశాలతో నగరంలో పాత ఆటోలు తిరిగే పరిస్థితి లేకపోవటంతో ఆటోవాలాలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం తిరిగి పాత పరిమితినే కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చింది.

అలైన్‌మెంట్ మార్పులో మా ప్రమేయం లేదు

- తహశీల్దార్ వనజాక్షి మామ పొట్లూరి వెంకటేశ్వరరావు

వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి యలమర్రు సబ్ స్టేషన్ వరకు వెళ్లే 220 కేవీ లైన్ అలైన్‌మెంట్ మార్పులో తమ ప్రమేయం లేదని తహశీల్దార్ వనజాక్షి మామ, రిటైర్డ్ అధికారి పొట్లూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వనజాక్షి.. ఇదేం పని? 220 కేవీ అలైన్‌మెంట్ మాయ కథనంపై ఆయన స్పందించారు. 2003లో పెదపారుపూడి సబ్ స్టేషన్‌కు వచ్చే 110 కేవీ లైన్ సబ్ స్టేషన్ తూర్పు వైపు తమ కుటుంబ సభ్యులకు చెందిన భూములు నుంచి వచ్చాయని తెలిపారు. ఆరోజు రైతులకు ఉపయోగపడుతుందని తాము ఎలాంటి నష్టపరిహారం కోరలేదని తెలిపారు. గత ఏడాది గ్రామ మంచినీటి చెరువులో శివాలయం నిర్మించడానికి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ప్రయత్నించారన్నారు. జలవనరుల శాఖకు చెందిన ఎటువంటి కట్టడాలు నిర్మించరాదని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గ్రామంలో కొందరు కలెక్టర్‌ను సంప్రదించారని తెలిపారు. అధికారులు తనిఖీ చేసి చెరువులో శివాలయం నిర్మించడానికి అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. దీంతో కక్షతో కొందరు తమపై బురద జల్లుతున్నారని ఆయన పేర్కొ న్నారు.

త్వరలో వైసీపీ ఖాళీ

- ఆ పార్టీ కీలకనేతలు జనసేనలో చేరబోతున్నారు
- జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఉదయభాను

విద్యాధరపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో తాడు, బొంగరం లేని ఏకైక పార్టీ వైసీపీ. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తన కేసులు గురించే చూసుకుంటున్నారు. వైసీపీలో కీలక నేతలు జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వైసీపీ పని అయిపోయింది. త్వరలో ఆ పార్టీ ఖాళీ అవబోతోంది.' అని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం భవానీపురం హెచ్‌బీ కాలనీలోని వీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో భవానీపురానికి చెందిన వైసీపీ నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 200 మంది జనసేన పార్టీలో చేరారు. ఉదయభాను వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలు జగన్‌కు అధికారం ఇస్తే రావణకాష్టంగా మార్చారన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌ను ఇక ఎన్నటికీ నమ్మబోరన్నారు.

పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

బస్ స్టేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించి పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చని పేర్కొన్నారు.

12న పార్శిళ్ల బహిరంగ వేలం

విజయవాడ ఆర్టీసీ పార్శిళ్ల విభాగంలో నెలల తరబడి ఉన్న పార్శిళ్లకు, కస్టమర్లు బుక్ చేసుకుని వదిలేసిన పార్శిళ్లకు ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

10న అప్రంటీస్ మేళా

భారతీనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ మేళాను సోమవారం ఉదయం 9గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.కనకారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడ్‌లకు చెందిన శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఈ మేళాకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 7780429468 నంబరుకు ఫోన్‌చేసి సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
శనివారం ● 8 మార్చి 2025
నవ్య
కుటుంబ కదంబం

నేడు మహిళా దినోత్సవం



పొలానికి పురుగుమందులు పిచికారీ చేయడం కోసం డ్రోన్‌ను ఉపయోగిస్తూ వినూత్నమైన జీవనభృతిని ఎంచుకుంది పల్నాడు జిల్లా, అచ్చంపేటకు చెందిన, కోట సంధ్య. పొలం పనుల్లో డ్రోన్ వినియోగంతో పొందే ప్రయోజనాలు, ఆదాయాల గురించి ఆమె 'నవ్య'తో పంచుకున్న ఆసక్తికరమైన విశేషాలు...

డ్రోన్ పైలెట్ మన సంధ్య

మహిళల జీవితంలో పెళ్లి, పిల్లలతో కెరీర్‌కు బ్రేక్ పడుతుందనే విషయం అందరికీ తెలిసిందే! ఎమ్మెస్సీ బిఇడి చదివిన నేను ప్రారంభంలో అచ్చంపేటలో కస్తూర్బా స్కూల్లో ఏడేళ్లపాటు టీచర్‌గా పని చేశాను. పెళ్లయ్యాక, గర్భిణిగా ఉన్న సమయంలో వైద్యులు బెడ్‌రెస్ట్ సూచించడంతో టీచర్ వృత్తికి బ్రేక్ పడింది. అలా ఇద్దరు పిల్లల తల్లిగా, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ గృహిణిగా స్థిరపడిపోయాను. ఆ తర్వాత డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా చేరాను. ఆ సమయంలో కోరమాండల్ పురుగుమందుల కంపెనీ మమ్మల్ని సంప్రతించి, డ్రోన్ పైలట్‌గా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా డ్రోన్‌లను పంపిణీ చేస్తామని చెప్పింది. డ్రోన్‌తో పురుగుమందులు చల్లే ఆ ఆలోచన నాకు నచ్చింది. దాంతో ఏడాది క్రితం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపిఎమ్)లో ఏడు రోజుల శిక్షణ తీసుకున్నాను. మూడు రోజుల థియరీ శిక్షణలో భాగంగా డ్రోన్లలో రకాలు, డ్రోన్ల నిర్మాణం, అవి పని చేసే విధానాల గురించి తెలుసుకున్నాను. మిగతా నాలుగు రోజులు డ్రోన్‌ను ఎగరేయడమెలాగో నేర్చుకున్నాను. తర్వాత గుంటూరు, లామ్‌లో రెండుసార్లు శిక్షణ తీసుకున్నాను. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రభుత్వంతో అనుసంధానమైన కోరమాండల్ కంపెనీ నుంచి ఉచితంగా డ్రోన్‌ను అందుకున్నాను.

> మా వారు బాల యోగీంద్రబాబు ఎరువుల వ్యాపారి. మాకిద్దరు పిల్లలు. పెద్ద బాబు 6వ తరగతి, చిన్నవాడు ఒకటో తరగతి. డ్రోన్ విషయంలో మా వారు నన్నెంతో ప్రోత్సహించారు. ప్రస్తుతం ఓ పక్క డ్రోన్ పనులు చూసుకుంటూ, ఆన్‌లైన్‌లో ట్యూషన్లు కూడా చెప్తున్నాను.

రోజుకు 20 ఎకరాల మేరకు...

ప్రస్తుతం నేను 25 కిలోల డ్రోన్‌ను ఉపయోగిస్తున్నాను. ఈ డ్రోన్ అడుగున పది లీటర్ల ట్యాంక్ ఉంటుంది. ఒక ఎకరాకు సరిపడా పురుగు మందును పది లీటర్ల నీళ్లలో కలిపి, ట్యాంక్‌లో నింపి, డ్రోన్‌ను గాల్లో ఎగరేస్తూ పొలానికి పిచికారీ చేయవచ్చు. పంటకు ఎంత ఎత్తులో మందును పిచికారీ చేయాలో ముందే డ్రోన్ తెర మీద గుర్తులు పెట్టుకుని, జాయ్‌స్టిక్‌తో డ్రోన్‌ను నియంత్రిస్తూ గాల్లో ఎగరేయాలి. పురుగుమందులు పిచికారీకి డ్రోన్‌ను ఉపయోగించడంలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రమాదకరమైన పురుగుమందులకు బహిర్గతం కాకుండా, అతి తక్కువ సమయంలో పొలాలకు పిచికారీ చేయవచ్చు. అంతే కాకుండా పంట మొత్తానికీ మందు సోకేలా సమంగా పిచికారీ చేసుకోవచ్చు. సాధారణంగా ఈ పనికి కూలీలను వినియోగించుకుంటూ ఉంటారు. ఒక కూలీకి ఒక ఎకరాకు, రోజుకు 500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే పనిని డ్రోన్‌తో, 300 రూపాయలకే పూర్తి చేసుకోవచ్చు. ఒక ఎకరా పిచికారీ కేవలం 7 నుంచి 8 నిమిషాల్లోనే పూర్తయిపోతుంది. పంట ఎత్తు మీద రుసుము ఆధారపడి ఉంటుంది. అలాగే సాధారణంగా ఒక ఎకరాకు ఒక లీటరు పురుగు మందు అవసరమవుతుంది. కానీ డ్రోన్‌ను ఉపయోగిస్తే, ఒక ఎకరాకు 750 మిల్లీలీటర్ల పురుగుమందు సరిపోతుంది. ఇలా డ్రోన్‌తో ఒక రోజుకు 20 ఎకరాలకు పురుగుమందులు పిచికారీ చేసుకోవచ్చు. పైగా డ్రోన్ వాడకం వల్ల పురుగుమందు ఖర్చు కలిసొస్తుంది. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది.

డ్రోన్లతో బహుళ ప్రయోజనాలు

పురుగుమందుల పిచికారీకి డ్రోన్లను వాడుకోవడం వల్ల రైతులూ, ఆర్థిక స్వావలంబన సాధించాలనుకునే మహిళలూ.. ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. డ్రోన్‌ను నడిపించడం కూడా ఎంతో తేలిక. చదువుకోని మహిళలు సైతం దీన్నెంతో సులువుగా ఉపయోగించుకోవచ్చు. డ్రోన్ సహాయంతో పత్తి, వరి, మొక్కజొన్న, మినుము, కంది, మిరప, అరటి పంటలకు పురుగుమందుల పిచికారీ చేసుకోవచ్చు. అయితే ఈ డ్రోన్‌కు కూడా ఒకట్రెండు ప్రతికూలతలున్నాయి. ఆకారంలో పెద్దగా ఉంటుంది కాబట్టి పొలం దగ్గరకు తీసుకువెళ్లడానికి ఆటో లేదా ట్రాలీ లాంటి వాహనం అవసరమవుతుంది. పిచికారీతో పొందే ఆదాయంలో 50 శాతం ఈ వాహనానికే ఖర్చయిపోతూ ఉంటుంది. అలాగే డ్రోన్ బ్యాటరీ సహాయంతో ఎగురుతుంది. ఈ బ్యాటరీ ఒక ఎకరా పంట పిచికారీ వరకే పని చేస్తుంది. తర్వాత డ్రోన్‌ను నేల మీదకు దింపుకుని బ్యాటరీ మార్చుకోవాలి. డ్రోన్‌తో పాటు మాకు అందిన ఐదు అదనపు బ్యాటరీలను వాడుకున్నప్పటికీ ప్రతి రెండు గంటలకోసారి వాటన్నిటినీ చార్జ్ చేసుకోడానికి చాలా సమయం పడుతూ ఉంటుంది. ఈ సమయం కలిసి రావాలంటే మా దగ్గర జనరేటర్ సదుపాయం ఉండాలి. డ్రోన్‌ను తరలించడానికి వాహనంతో పాటు, జనరేటర్ సదుపాయాలను కల్పిస్తే ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చు. ఈ విషయంలో మాలాంటి వాళ్లకు ప్రభుత్వ తోడ్పాటు ఎంతో అవసరం.

● గోగుమళ్ల కవిత



మహిళ ఒక చైతన్య దీప్తి. ఆదిపరాశక్తి. సునీతా విలియమ్స్‌లా ఆకాశాన్ని అందుకోగలదు. మలాలలా ప్రపంచాన్ని కదిలించగలదు. కట్టుబాట్లను కాదని... వివక్షను దాటి... అవమానాలకు తట్టుకొని... అత్యున్నత శిఖరాలను చేరిన వనితలు ఎందరో. అలాంటి అసాధారణ మహిళల విజయాలను స్మరిస్తూ... వారి ప్రస్థానాన్ని భావితరాలకు పరిచయం చేస్తూ... 'అనుకొంటే ఏదైనా సాధించగలవు' అంటూ స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటుంది ప్రముఖ సంస్థ 'బార్బీ'. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని... ఈసారి వివిధ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఐదుగురు భారతీయుల బొమ్మలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. వీరిలో భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ప్రముఖ గాయని నీతి మోహన్, ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా, ముంబయి చెఫ్ బీనా నోరోన్హా, ఫైర్ ఫైటర్ మేఘనా సక్పాల్ ఉన్నారు. వీరంతా తమ తమ రంగాల్లో తమదైన ముద్ర వేశారు. లక్ష్యం ఎంత పెద్దదైనా, అవరోధాలు, అసమానతలు ఎన్ని ఎదురైనా అనుకున్నది సాధించి చూపించారు. యువతరానికి ప్రేరణగా నిలిచారు.

మగువా... నీకుంది ఆ తెగువ

హర్మన్‌ప్రీత్ కౌర్:

భారత మహిళల క్రికెట్ జట్టు సారథి. సమర్థవంతమైన నాయకత్వంతో దేశంలో మహిళా క్రికెట్‌కు అరుదైన విజయాలు అందించింది. అనితరసాధ్యమైన బ్యాటింగ్‌తో రికార్డులెన్నో తిరగరాసింది. అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, జట్టును ప్రభావవంతంగా నడిపించడంలో ప్రత్యేకత చాటుకున్న హర్మన్... ఔత్సాహిక మహిళా అథ్లెట్లకు స్ఫూర్తిమంత్రం.

నీతి మోహన్:

భారతీయ సంగీత పరిశ్రమలో తనకంటూ కొన్ని పేజీలు లిఖించుకున్న గాయని నీతి మోహన్. రియాలిటీ షో కంటెస్టెంట్ నుంచి దేశం గర్వించదగ్గ గాయనిగా ఎదగడం వరకు... ఆమె ప్రతి మజిలీ ప్రేరణ కలిగిస్తుంది. వృత్తిపట్ల అంకితభావం... ఎంతటి క్లిష్టమైన స్వరమైనా అలవోకగా పలికించగలగడం... ఇవే నీతి మోహన్‌ను భిన్నమైన గాయనిగా తీర్చిదిద్దాయి.



మేఘనా సక్పాల్:

ఆమె కుటుంబంలో మూడోతరం ఫైర్ ఫైటర్. మగవారికే పరిమితమనుకున్న ఈ వృత్తిని చేపట్టిన ఆమె సాహసానికి మహిళా లోకం సలాం చేస్తోంది. విధుల నిర్వహణలో అంకితభావం, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వెనుతిరగని నైజం చూస్తుంటే... అతివకు అసాధ్యమనేది లేదని చెబుతోంది. పట్టుదలగా ప్రయత్నిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపిస్తోంది.

బీనా నోరోన్హా:

స్కార్లెట్ హౌస్, లైలా, గిగీ తదితర ముంబయిలోని ప్రసిద్ధ రెస్టారెంట్లకు హెడ్ చెఫ్‌గా వ్యవహరిస్తోంది బీనా నోరోన్హా. స్కార్లెట్ హౌస్' బాలీవుడ్ భామ మలైకా అరోరా, ఆమె తనయుడు అర్హన్‌ఖాన్ కలిసి ఏర్పాటు చేసిన రెస్టారెంటు. ఈ రెస్టారెంట్లలో సంప్రదాయ భారతీయ వంటకాలకు పాశ్చాత్య హంగులు అద్ది విభిన్నంగా వడ్డిస్తోంది బీనా. తద్వారా మన రుచులను ప్రపంచ దేశాల అతిథులకు పరిచయయం చేస్తోంది. ఆతిథ్య రంగంలోకి రావాలనుకొనే మహిళలకు ఆమె ప్రయాణమే పెద్ద ప్రేరణ.

అనామికా ఖన్నా:

దేశంలోనే ప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్లలో ఒకరు అనామికా ఖన్నా. భారతీయ సంప్రదాయ వస్త్రధారణలోని గొప్పదనాన్ని చాటుతూనే... వినూత్న డిజైన్లతో ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆకర్షించిన ఘనత ఆమెది. వస్త్రశ్రేణుల్లో విలక్షణత, చేసే పనిలో నిబద్ధత, అద్భుతమైన కళాచతురత... ఫ్యాషన్ రంగంపై అనామికాది చెరగని ముద్ర.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

తెర వెనుకా తమదైన ముద్ర

మిగిలిన అన్ని రంగాల్లో అగ్రపథాన దూసుకుపోతున్న మహిళలకు చిత్రసీమలో లభిస్తున్న ప్రాతినిధ్యం తక్కువే. అయినా సరే తెరపైనే కాకుండా తెర వెనుక కూడా తమదైన ముద్ర వేసేందుకు ఎంతో మంది కృషి చేస్తున్నారు. ఒకప్పుడు నటనకు, అప్పుడప్పుడు దర్శకత్వ శాఖకు పరిమితమైన మహిళలు ఇప్పుడు చిత్ర నిర్మాణ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మగవారికి దీటుగా ఇరవై నాలుగు విభాగాల్లోనూ తమ సేవలు అందిస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. పురుషాధిక్యరంగంగా భావించే చిత్రపరిశ్రమలో అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ వడివడిగా అడుగులేస్తోన్న కొందరు నారీ మణులు మహిళా దినోత్సవం సందర్భంగా చిత్రజ్యోతితో పంచుకున్న నాలుగు మంచి మాటలు.



మహిళలు ముందుకు రావాలి

ఇండస్ట్రీలో ఒకప్పటి కన్నా ఇప్పుడే మహిళలకు అవకాశాలు ఎక్కువ. పాతికేళ్ల ముందైనా, ఇప్పుడైనా మహిళలందరికీ నేను చేప్పే మాట ఒక్కటే. ఇండస్ట్రీలో మీ ప్రతిభను చూపేందుకు ముందుకు రావాలి. తెలుగు రాష్ట్రాల్లో తొలి, దేశంలో రెండో మహిళా సినిమాటోగ్రాఫర్ నేనే. పలు భారతీయ చిత్రాలతో పాటు తెలుగులో రాజశేఖర్ నటించిన 'విలన్', జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'సుబ్బు', వడ్డే నవీన్ నటించిన 'ధనుష్', విజయశాంతి నటించిన 'శివాని'.. తదితర సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశాను. ఒక్క రోజులోనే తెరకెక్కి.. గిన్నీస్ రికార్డు సాధించిన 'స్వయంవరం' అనే తమిళ సినిమాలో భాగమయ్యాను. పాతికేళ్ల నా కెరీర్‌లో నమ్మకమే నన్ను ముందుకు నడిపిస్తోంది. ఎన్ని కష్టాలు వచ్చినా ఆగిపోలేదు. నిరాశ పడలేదు. కొత్తగా ఆలోచిస్తా. ప్రయత్నిస్తా. నిరంతరం అప్‌డేట్ అవుతుంటా. బ్లాక్ అండ్ వైట్, కలర్, డిజిటల్.. మూడు తరాలతో పనిచేసిన అనుభవం సంపాదించా.



- విజయ శ్రీ (సినిమాటోగ్రాఫర్)

సవాల్‌ను స్వీకరిస్తూ సాగిపోవాలి

ఇండస్ట్రీలో ఎవరూ ఎవరికీ సపోర్ట్ చేయరు. ఎవరి ప్రతిభ వారికి రక్ష. సత్తానే ముందుకు నడిపిస్తుంది. ప్రతి సవాల్‌ను స్వీకరిస్తూ ముందుకు సాగిపోవాలి. ఎవరైనా మనల్ని ఏదైనా పని చేయలేవు అని అంటే, కచ్చితంగా చేసి చూపించాలి. మా నాన్న రౌతు రవి రచయిత. ఆయన ద్వారానే నాకు రచనపై మక్కువ ఏర్పడింది. నిత్యామీనన్ నటించిన 'కుమారి శ్రీమతి' వెబ్ సిరీస్‌తో పాటు కొన్ని సినిమాలకు పాటలన్నీ నేనే రాశాను. ఇప్పటివరకూ 70 సినిమాల్లో 200 పాటలు రాశాను. చిన్నప్పటి నుంచి మణిశర్మ అంటే చాలా ఇష్టం. నేను రాసిన ఓ పాటను ఆయన మెచ్చుకోవడం నాకు దక్కిన అతి పెద్ద ప్రశంస. సాయిదుర్గాతేజ్, స్వాతి నటించిన 'సత్య' అనే లఘు చిత్రానికి సంభాషణలు రాశా. ప్రస్తుతం 'మహేంద్రగిరి వారాహి' చిత్రంతో పాటు మరికొన్ని సినిమాలకు పాటలు రాస్తున్నా. భవిష్యత్తులో దర్శకురాలిగా మారాలనే ఆలోచన ఉంది.



- కడలి రౌతు (గీత రచయిత్రి)

ఆ విధానంలో మార్పు రావాలి



సాధారణ కుటుంబం నుంచి వచ్చాను. మా వారికి దర్శకుడు అవ్వాలనే కోరిక ఉండేది. ఆయన కోసమని ప్రొడక్షన్‌లో అడుగు పెట్టాను. నిర్మాతగా నా మొదటి చిత్రం 'లక్కీ లక్ష్మణ్'. ఈ ప్రయాణంలో దర్శకత్వం వైపూ ఆసక్తి కలిగింది. దాంతో నా దర్శకత్వంలో 'ఫియర్' చిత్రం రూపుదిద్దుకుంది. డబ్బులు ఉంటే సినిమా తీయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, పూర్తయిన సినిమాను మార్కెట్ చేయడం పెద్ద సవాలుగా అనిపించింది. ఎవరి వద్దకు వెళ్లినా.. బ్యానర్ ఎవరిది? సినిమా తీసింది ఎవరు? డైరెక్టర్ ఎవరు, వారి బ్యాగ్రౌండ్ ఏంటి వంటి అంశాలనే చూస్తున్నారు కానీ కంటెంట్‌ను పట్టించుకోవడం లేదు. ఈ విధానంలో మార్పు రావాలి. తన ప్రొడక్ట్‌ని అమ్ముకుంటేనే కదా నిర్మాతకు లాభం వచ్చేది. ప్రొడ్యూసర్ బావుంటేనే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ మూడేళ్ల ప్రయాణంలో ఇదే నాకు అర్థమైంది. నా చిన్ననాటి నుంచే ఎన్నో ఇబ్బందులు అనుభవించా. అప్పుడు ఆదుకున్న వారు ఎవరూ లేరు. అందుకే ఎవరైనా సాయం కోరితే నాకు తోచింది చేయాలని నిర్ణయించుకున్నా. ఒక వైపు సినిమాలు చేస్తూనే సొసైటీకి సేవ చేయాలనేది నా లక్ష్యం. ముఖ్యంగా మహిళా సాధికారతకు నా వంతు కృషి చేస్తున్నా.

- హరిత గోగినేని (దర్శకురాలు)



వద్దన్న వాళ్లే ప్రశంసించారు

చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తి ఉంది. తెలిసినవాళ్ల ద్వారా ఒక సినిమాకు పనిచేసే అవకాశం వచ్చింది.. కానీ ప్రొడక్షన్ విభాగంలో. అక్కడ అన్ని విభాగాలను చక్కగా సమన్వయం చేస్తూ పనిచేయడం చూసి, 'ఇండస్ట్రీలో మహిళా మేనేజర్లు లేరు. నువ్వు ప్రయత్నం చేయవచ్చు కదా' అన్నారు. అలా మొదట్లో కొన్ని చిన్న సినిమాలకు పనిచేశాను. ప్రొడక్షన్ యూనియన్‌లో సభ్యత్వం ఉంటే అవకాశాల కోసం ప్రయత్నించవచ్చు అని అనుకున్నాను. కానీ అమ్మాయిలకు రక్షణ ఇవ్వలేమంటూ సభ్యత్వం ఇచ్చేందుకు తిరస్కరించారు. మీ సంస్థ నియమావళిలో మహిళలకు సభ్యత్వం ఇవ్వకూడదని ఉందా? అని ప్రశ్నించి, పోరాడి యూనియన్ కార్డ్ సాధించుకున్నాను. ఆ తర్వాత ఇండస్ట్రీలో అవకాశాల కోసం పెద్ద నిర్మాణసంస్థల దగ్గరకు వెళితే 'మహిళలు ప్రొడక్షన్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించలేరు' అన్నారు. ఇండస్ట్రీలో తొలి మహిళా ప్రొడక్షన్ మేనేజర్‌గా ఎదిగాను. సొంతంగా ప్రొడక్షన్ హౌస్ స్థాపించి, పదిమందికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదిగాను. వద్దన్నవాళ్ల ప్రొడక్షన్‌లోనే మేనేజర్‌గా పని చేసి, వాళ్లతోనే శభాష్ అనిపించుకున్నాను. ఇక్కడ రాత్రికి రాత్రే ఎవరూ గొప్పవాళ్లు కాలేరు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నించే అమ్మాయిలపై రాళ్లేసేవాళ్లే ఎక్కువ. వాటిని పూలబాటగా మార్చుకొని ప్రయాణం కొనసాగిస్తే విజయం తథ్యం.

- దీప్తి (ప్రొడక్షన్ మేనేజర్)

వీరు సైతం...

- ఎస్ఎస్ రాజమౌళి భార్య రమా రాజమౌళి చలన చిత్ర రంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు. స్టూడెంట్ నం.1 సినిమా ద్వారా ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. మగధీర, ఈగ, బాహుబలి-1, బాహుబలి-2, ఆర్ఆర్ఆర్ సినిమాలకు పనిచేశారు.
- దర్శకుడు త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నృత్య కళాకారిణి. నిర్మాతగా కూడా పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. 'సార్, లక్కీ భాస్కర్, డాకు మహారాజ్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు ఆమె నిర్మాతగా వ్యవహరించారు.
- కోన వెంకట్ సోదరి కోన నీరజ 'గుండె జారి గల్లంతయ్యిందే' సినిమాలో తొలిసారిగా హీరో నితిన్‌కు





స్టైలిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె పలు విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు. సమంతకు వ్యక్తిగత స్టైలిస్ట్‌గా కూడా వ్యవహరించారు. ప్రస్తుతం 'తెలుసు కదా' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

- శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన అనేక సినిమాలకు రూపా వైట్ల కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు.
- డైరెక్టర్ సుకుమార్ భార్య తబితా కూడా చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. ఇటీవలె విడుదలైన 'గాంధీ తాత చెట్టు' సినిమా నిర్మాణంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.
- దర్శకుడు వైవీఎస్ చౌదరి భార్య గీతా చౌదరి నిర్మాతగా మారారు. జానకిరామ్ తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ ఓ సినిమా తీస్తున్నారు.



నా పాట నలుగురూ పాడుకునేలా ఉండాలి

సినీ పరిశ్రమలో మహిళల సంఖ్య తక్కువ. అందులోనూ గీత రచయిత్రిలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. అలాంటిది వరుస సినిమాల్లో అవకాశం రావటం నా కష్టానికి తగిన ప్రతిఫలంగా భావిస్తున్నా. ఎనిమిదో తరగతి చదివేటప్పుడు కవిత్వం రాయడం అలవాటైంది. ఉద్యోగం చేసే సమయంలో నేను రాసిన కవితలను సోషల్‌మీడియాలో షేర్ చేయడం మొదలుపెట్టాను. వాటి ద్వారా నాకు తొలి అవకాశం వచ్చింది. నేను రాసిన రెండో పాట 'వందేమాతరం' (ప్రైవేట్ ఆల్బమ్) ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంగారు పాడటం.. నేను రాసిన ఓ పాట విని నటి గౌతమిగారు ఫోన్ చేసి అభినందించడం మరిచిపోలేని అనుభూతులు. ఇండస్ట్రీకి రావడానికి స్ఫూర్తినిచ్చిన వారు లేరు. కానీ పరిశ్రమలో నాకు దిశానిర్దేశం చేసేవాళ్లు చాలా మంది ఉన్నారు. గీత రచయితగా ప్రత్యేక లక్ష్యాలంటూ ఏమీ లేవు. నా వర్క్ అందరికీ చేరితే చాలు. నా పాట నలుగురు పాడుకునేలా ఉంటే చాలు. ఇప్పటివరకూ 70 సినిమాల్లో 100 పాటలు రాశాను. 'మా నాన్న సూపర్ హీరో' చిత్రంలో 'నాన్నా', 'గామి'లో 'అరిరారో' అనే లాలిపాట', 'హ్యాష్‌ట్యాగ్ నైన్టీస్' లోని 'మనసు మంగళం.. ప్రేమ మంగళం', 'కాలింగ్ సహస్ర'లోని 'కలా నిజమా', 'హీరామండీ' వెబ్ సిరీస్‌లోని 'మనసారా నను లాగిపోకే' వంటి పాటలతో మంచి గుర్తింపు వచ్చింది" అని గీత రచయిత లక్ష్మీప్రియాంక పులవర్తి చెప్పారు.



- లక్ష్మీప్రియాంక (గీత రచయిత)

బిజినెస్

మహిళా ఆంత్రప్రెన్యూర్ల కోసం ఎస్‌బీఐ అస్మిత

ముంబై: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల (ఆంత్రప్రెన్యూర్స్) కోసం తక్కువ వడ్డీతో కూడిన తనఖార హిత రుణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అస్మిత పేరుతో ఈ పథకాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఈ రుణ పథకం మహిళల సారథ్యంలో నడిచే సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు వేగంగా, సులువుగా ఫైనాన్స్ అందిస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. కాగా, ఎస్‌బీఐ మహిళల కోసం నారీ శక్తి పేరుతో రూపే ప్లాటినమ్ డెబిట్ కార్డ్‌ను సైతం విడుదల చేసింది.

బీఓబీ గ్లోబల్ విమెన్ ఎన్ఆర్ఈ ఖాతా

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) "గ్లోబల్ విమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఓ సేవింగ్స్ అకౌంట్" ప్రారంభించింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఒకటి ఈ రకమైన ఎస్‌బీ ఖాతా తెరవడం ఇదే ప్రథమం. కస్టమర్లు అధిక వడ్డీ రేటు పొందేందుకు వీలుగా ఆటో స్వీప్ సదుపాయంతో ఇది అందుబాటులోకి వచ్చింది. దీనికి తోడు ప్రాసెసింగ్ చార్జీలు కూడా ఇతర ఖాతాల కన్నా తక్కువగా ఉంటాయి. గృహ, ఆటో రుణాలు రాయితీ వడ్డీ రేట్లకు అందుబాటులోకి వస్తాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ను 0.05 శాతం మేరకు తగ్గించింది. ఈ మార్పు అనంతరం బ్యాంక్ ఎంసీఎల్ఆర్ 9.20% నుంచి 9.45% మధ్యలో ఉంటుంది. తక్షణం ఈ కొత్త రేట్లు అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం రెండేళ్ల కాలపరిమితికి ఎంసీఎల్ఆర్ 9.45% నుంచి 9.40 శాతానికి తగ్గింది.

హైదరాబాద్‌లో ఓక్‌ట్రీ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ క్రెడిట్ రంగంలోని ఓక్‌ట్రీ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కార్యాలయం ప్రారంభించింది. దేశంలో కంపెనీకి ఇది రెండో కార్యాలయం. మొదటి కార్యాలయం ముంబైలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీకి 24 నగరాల్లో కార్యాలయాలుండగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 9 కార్యాలయాలున్నాయి. గత ఏడాది డిసెంబరు 31 నాటికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ 20,200 కోట్ల డాలర్లు. ఇదిలా ఉండగా అజయ్ మద్దాలి హైదరాబాద్ కార్యాలయానికి మానవ వనరుల డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

పేరుకే మహిళా ఉపాధి



శ్రామిక రంగంలోనూ వివక్ష
అత్తెసరు జీతాలతోనే సరి
వర్క్‌ఇండియా నివేదిక వెల్లడి

ముంబై: బ్లూకాలర్ ఉద్యోగాల్లో (శారీరక శ్రమ అవసరమయ్యే ఉద్యోగాలు)నూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. పెద్దగా నైపుణ్యాలు అవసరం లేని తక్కువ జీతాలు ఉండే ఉద్యోగులు లేదా తాత్కాలిక ఉద్యోగులతోనే కంపెనీలు సరిపెడుతున్నాయి. కంపెనీలకు బ్లూకాలర్ ఉద్యోగుల నియామక సేవలు అందించే 'వర్క్‌ఇండియా' అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఈ నివేదిక ప్రకారం 2023లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు స్వల్పంగా 0.4 శాతం పెరిగినా, 2024 వచ్చేసరికి 5.3 శాతం పడిపోయాయి. ముఖ్యంగా క్షేత్ర స్థాయి అమ్మకాలు, మార్కెటింగ్, బ్యాక్ ఆఫీస్ జాబ్స్‌లో మహిళలకు అవకాశాలు ఏటికేటికి తగ్గిపోతున్నాయి. 2023తో పోలిస్తే 2024లో బ్యాక్ ఆఫీస్ ఉద్యోగాలు 30 శాతం, ఆఫీస్ ప్యూను ఉద్యోగాలు 64.1 శాతం తగ్గాయి. ఇదే సమయంలో టెలికాలర్ ఉద్యోగాలు 8 శాతం, మెయిడ్ జాబ్స్ 99.8 శాతం పెరిగినట్టు వర్క్‌ఇండియా నివేదిక తెలిపింది.

చెల్లింపుల్లోనూ సమస్యలు

ఏదోలా వ్యాపారాలు నిర్వహిస్తున్న ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ కస్టమర్ల నుంచి రావలసిన బకాయిల వసూళ్లలో 80 శాతం మంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక సాలెగూడులా ఉన్న నియంత్రణ నిబంధనలు అమలు చేయలేక 60 శాతం మంది సతమతమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థ ఎంతగా ఎదిగినా ప్రస్తుతం దేశంలో ఉన్న 5.85 కోట్ల వ్యాపారాల్లో మహిళల వాటా 15.4 శాతం మాత్రమే. 'యాస్పైర్ ఫర్ హర్, పేమెంట్ సేవల సంస్థ 'పేయోనిర్' అనే సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది.

పెరుగుతున్న ఆదాయాలు

కొన్ని సమస్యలు ఉన్నా చాలా మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు రుణాలతో తమ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరిస్తున్నారు. రుణాలు తీసుకున్న తర్వాత తమ ఆదాయాలు పది శాతానికిపైగా పెరిగినట్టు చెప్పారు. ఇండిఫీ టెక్నాలజీస్ అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీంతో చిన్నచిన్న నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని మహిళా వ్యాపారవేత్తలూ రుణాలతో తమ వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

స్టార్టప్స్‌కు దండిగా నిధులు

మన దేశంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించే అంకుర (స్టార్టప్స్) కంపెనీలకు నిధులూ దండిగానే లభిస్తున్నాయి. ఈ సంస్థలకు ఇప్పటి వరకు 2,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.25 లక్షల కోట్లు) నిధులు అందాయి. అమెరికా తర్వాత ప్రపంచంలో మరే దేశంలోనూ మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించిన స్టార్టప్స్‌కు ఈ స్థాయిలో నిధులు అందలేదని ట్రాక్షన్ అనే సంస్థ తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఏడు వేలకుపైగా మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించిన స్టార్టప్స్ ఉన్నాయి. దేశంలోని మొత్తం స్టార్టప్స్‌లో ఇవి 7.5 శాతానికి సమానం.

ఏపీలో ప్రీమియర్ ఎనర్జీస్ ప్లాంట్



- రూ.1,700 కోట్ల పెట్టుబడి
- నాయుడుపేట వద్ద 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్ ఏర్పాటు
- తెలంగాణలోనూ కార్యకలాపాల విస్తరణ
- కంపెనీ ఎండీ చిరంజీవ్ సలూజా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రీమియర్ ఎనర్జీస్.. ఆంధ్రప్రదేశ్‌కు తన కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఏపీలోని నెల్లూరు జిల్లా నాయుడుపేట వద్ద 4 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) సెల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సలూజా వెల్లడించారు. రూ.1,700 కోట్ల పెట్టుబడితో 169 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ 2026 జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 1,200 మందికి ఉపాధి లభిస్తుందని సలూజా చెప్పారు. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించాలన్న వ్యూహంతో పాటు నిర్వహణా వ్యయాలు తగ్గించుకోవటం, నౌకాశ్రయానికి చేరువగా ఉండాలన్న ఉద్దేశంతో ఏపీలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కంపెనీ ఇప్పటికే హైదరాబాద్, రావిర్యాల ఎలక్ట్రానిక్ సిటీలో 2 గిగావాట్ సెల్, 4గిగావాట్ మాడ్యుల్ స్థాపిత సామర్థ్యం గల ప్లాంట్లను నిర్వహిస్తోంది.

తెలంగాణలో 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్ ప్లాంట్: కార్యకలాపాల విస్తరణలో భాగంగా గత ఏడాది తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్ వద్ద 75 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,000 కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్, 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చిరంజీవ్ సలూజా తెలిపారు. అయితే భారత ప్రభుత్వ మేకిన్ ఇండియా విజన్‌కు అనుగుణంగా ఉండటంతో పాటు భౌగోళికంగా కార్యకలాపాలు విస్తరించాలన్న ఉద్దేశంతో తెలంగాణలో ఏర్పాటు చేయతలపెట్టిన 4 గిగావాట్ల సెల్ ప్లాంట్‌ను ఏపీలో నెలకొల్పాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాగా ఇప్పటికే సీతారాంపూర్‌లో ఏర్పాటు చేస్తున్న 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్ ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇది ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. మరోవైపు మహేశ్వరం వద్ద రూ.800 కోట్లతో నెలకొల్పుతున్న 1 గిగావాట్ సెల్, 1 గిగావాట్ మాడ్యుల్ ప్లాంట్ జూన్ నాటికల్లా పూర్తి కానుందని తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా 1,500 మందికి ఉద్యోగాలు రానున్నాయని సలూజా వెల్లడించారు.

ప్రపంచంలోని బలమైన బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి మూడో స్థానం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కు మరో ఘనత దక్కింది. ప్రపంచంలోని అత్యంత బలమైన బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి మూడో స్థానం దక్కింది. ఈ ఏడాదికి గాను విడుదలైన 'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100' నివేదిక ప్రకారం.. ఎల్ఐసీ 100లో 88 బ్రాండ్ స్ట్రెంత్ ఇండెక్స్ (బీఎస్ఐ) స్కోర్ సాధించింది. 94.4 బీఎస్ఐ స్కోర్‌తో పోలాండ్‌కు చెందిన పీజెడ్‌యూ ప్రపంచంలోనే అత్యంత బలమైన బీమా బ్రాండ్‌గా నిలిచింది. 93.5 స్కోర్‌తో చైనా లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో ఉంది.

బ్రాండ్ విలువలో 12వ స్థానం: ప్రపంచంలోని అత్యంత విలువైన 100 బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి 12వ స్థానం లభించింది. ఎస్‌బీఐ లైఫ్ 76వ స్థానంలో ఉంది. భారత్ నుంచి ఈ రెండింటికే చోటు జాబితాలో దక్కింది. ఎల్ఐసీ ఆర్థిక పనితీరు విషయానికొస్తే, 2024 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 17 శాతం వృద్ధితో రూ.11,056.47 కోట్లకు పెరిగింది.

లాభనష్టాల మధ్య ఊగిసలాట

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడింది. వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక సూచీలు చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 7.51 పాయింట్ల నష్టంతో 74,332.58 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 7.80 పాయింట్ల పెరుగదలతో 22,552.50 వద్ద క్లోజైంది. పరస్పర సుంకాలతో అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య అనిశ్చితి, గ్లోబల్ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30కంపెనీల్లో 14 రాణించగా..16 నష్టపోయాయి.

లోకా లోక రూ. 110 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: సింగపూర్‌లోని కుటుంబ కార్యాలయానికి చెందిన ఇన్వెస్టర్ల నుంచి 1.25 కోట్ల డాలర్లు (సుమారు రూ.110 కోట్లు) సమీకరించినట్లు ఆల్కహాల్ బెవరేజెస్ కంపెనీ లోకా లోక శుక్రవారం వెల్లడించింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), భారత్ సహా ఇతర దేశాల్లో ఉత్పత్తులను విడుదల చేసేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీని సినీ నటుడు రానా దగ్గుబాటి, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, ఆల్కహాల్ బెవరేజ్ వ్యాపారవేత్త హర్ష వడ్లమూడి కలిసి ప్రారంభించారు. వడ్లమూడి ఈ కంపెనీకి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది తమ ఉత్పత్తులను యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఇండియా, దుబాయ్, లండన్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా మార్కెట్లలో ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	85
కరీంనగర్	73	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	72
కర్నూలు	73	నెల్లూరు	77
విశాఖపట్నం	94	అనంతపురం	77
గోదావరి	95		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 8వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	443	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 66	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,160 ▼	79,900 ▼	1,08,100 ▲
విజయవాడ	88,250 ▼	84,000 ▼	99,200 ▲
విశాఖపట్నం	86,290 ▲	79,010 ▼	97,690 ▼
రాజమండ్రి	87,270 ▼	80,000 ▼	98,900 ▼
ప్రొద్దుటూరు	88,150 ▼	81,630 ▼	98,500 ▼
ముంబై	86,059 ▼	78,830 ▲	96,724 ▲

హెచ్‌పీసీఎల్ సారథిగా వికాస్ కౌశల్



తొలిసారిగా ప్రైవేట్ కన్సల్టెంట్ చేతికి పగ్గాలు

న్యూఢిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వికాస్ కౌశల్ నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదేళ్ల కాలానికి ఈ నియామకం వర్తిస్తుంది. ఆయన గతంలో మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ కెర్నీలో పని చేశారు. ప్రైవేట్ రంగానికి చెందిన కన్సల్టెంట్‌కు ఒక ప్రభుత్వ రంగ సారథిగా పగ్గాలు అప్పగించడం ఇదే ప్రథమం. వీకే జోషి పదవీ విరమణ చేయడంతో గత ఏడాది ఆగస్టు నుంచి ఈ పదవి ఖాళీగానే ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న అర్హత నిబంధనలు సడలించి వికాస్ కౌశల్‌ను (53) హెచ్‌పీసీఎల్ సారథిగా నియమించాలంటూ పెట్రోలియం, సహజ వాయువుల శాఖ చేసిన ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్‌కు చెందిన నియామకాల కమిటీ ఆమోదించింది. ప్రభుత్వ రంగ సంస్థలకు సారథులను ఎంపిక చేసే పీఈఎస్‌బీ ఆ పదవికి సరైన వ్యక్తిని గుర్తించడంలో విఫలం కావడంతో సంబంధిత మంత్రిత్వ శాఖకు చెందిన అన్వేషణ, ఎంపిక కమిటీ కౌశల్‌ను ఎంపిక చేసింది.

స్పోర్ట్స్

వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్ ప్రణవ్



పెట్రోవాక్ (మాంటెనీగ్రో): భారత గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ వెంకటేశ్ వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన ప్రణవ్.. మేటిక్ లారెన్సిక్ (స్లొవేనియా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో ఆడిన 11 రౌండ్లలో ఈ చెన్నై కుర్రాడు తొమ్మిది పాయింట్లతో అజేయుడిగా నిలిచాడు. 2008లో అభిజిత్ గుప్తా తర్వాత ఈ టోర్నీ గెలిచిన భారతీయుడయ్యాడు. ఈ క్లాసికల్ చెస్ ఓపెన్ విభాగంలో మొత్తం 157 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ప్రణవ్ విజయంపై విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశాడు. మరోవైపు గతేడాది డిసెంబరులో చెన్నైకే చెందిన గుకేశ్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

విజేత అరవింద్



'ప్రేగ్' చెస్ మాస్టర్స్ టోర్నీ

ప్రేగ్: అంతర్జాతీయ చెస్ యవనికపైకి మరో భారత యువ సంచలనం దూసుకొచ్చింది. తమిళనాడుకు చెందిన 25 ఏళ్ల అరవింద్ చిదంబరం ప్రేగ్ మాస్టర్స్ చెస్ టైటిల్ కొల్లగొట్టాడు. గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం 9 రౌండ్ల ఈ టోర్నమెంట్ .చివరి గేమ్‌ను డ్రాగా ముగించాడు. టర్కీకి చెందిన ఎడిజ్ గురెల్‌తో తొమ్మిదో రౌండ్‌లో 39 ఎత్తుల అనంతరం చిదంబరం పాయింట్ పంచుకున్నాడు. దాంతో మొత్తం ఆరు పాయింట్లతో చిదంబరం విజేతగా నిలిచాడు. అరవింద్‌కు ఇది తొలి అంతర్జాతీయ టైటిల్. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద (5) ఆఖరి రౌండ్‌లో అనిష్ గిరి చేతిలో పరాజయం చవిచూశాడు. ఐదు పాయింట్లతో ప్రజ్ఞానంద రెండో స్థానంతో టోర్నీని ముగించాడు. ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ విభాగంలో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ యకుబేవ్ టైటిల్ దక్కించుకున్నాడు. ఈ విభాగంలో తలపడిన భారత జీఎం దివ్యా దేశ్‌ముఖ్ (3 పాయింట్లు) తొమ్మిదో స్థానంతో నిరాశ పరిచింది.

దుబాయ్‌పై రచ్చ



భారత్‌కు అనుకూలతపై విమర్శలు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో ఇక మిగిలింది ఒకే ఒక్క మ్యాచ్. ఆదివారం భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఫైనల్ జరగాల్సి ఉంది. ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్నది పాకిస్థానే అయినా టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే ఆడుతోంది. అయితే భారత జట్టు ఎటూ కదలకుండా ఒకే చోట మ్యాచ్‌లన్నీ ఆడేస్తుండడంతో తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇతర జట్ల మాదిరిగా పలు వేదికల్లో ఆడేందుకు ప్రయాణం చేయాల్సిన అవసరం లేదని, ఒకే మైదానంలో ఆడడంవల్ల వారికి లబ్ధి చేకూరుతోందని అంటున్నారు. టోర్నీ ముగింపు దశకు చేరినా ఈ దుబాయ్ అనుకూలత విమర్శలు మాత్రం ఆగడం లేదు. ఇంగ్లండ్ మాజీలు మైక్ అథర్టన్, నాసిర్ హుస్సేన్ దక్షిణాఫ్రికా ఆటగాళ్లు డేవిడ్ మిల్లర్, డుస్సెన్ తదితరులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఇతర జట్ల మాదిరిగా దుబాయ్ కూడా తమకు తటస్థ వేదికని భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గంభీర్ తేల్చారు. చాలా రోజుల క్రితమే ఐసీసీ భారత్ ఆడే వేదికను ఖరారు చేసిందని, అయినా అక్కడ కూడా వివిధ పిచ్‌లపై ఆడుతున్న విషయాన్ని గమనించాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నాడు.



వరుణ్ వర్సెస్ శాంట్నర్

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అందరి చూపు భారత్-కివీస్ జట్ల స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, మిచెల్ శాంట్నర్‌లపై ఉండనుంది. దుబాయ్ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ఇద్దరు కీలకంగా మారే అవకాశం ఉంది. శాంట్నర్ ఎడమచేతి స్పిన్నర్ కాగా, వరుణ్ కుడిచేతి లెగ్ స్పిన్నర్. అలాగే ఇద్దరూ ఏడు వికెట్లతో తమ జట్లకు అండగా ఉంటున్నారు. కానీ వరుణ్‌కు కేవలం మూడు వన్డేల అనుభవం ఉంది. అటు 117 వన్డేలాడిన సీనియర్ ఆటగాడు శాంట్నర్ జట్టు కెప్టెన్‌గా కూడా రాణిస్తున్నాడు. మరోవైపు ఇద్దరూ స్పిన్నర్లే అయినప్పటికీ బంతిని వదిలే వేగంలోనూ తేడా ఉంటోంది. వరుణ్ ఏకంగా గంటకు 93.74 కి.మీ వేగంతో బంతిని విసురుతున్నాడు. అందుకే బ్యాటర్‌కు ఆ బంతిని అర్థం చేసుకునేంత సమయం ఉండదు. కివీస్‌పై తను ఆడింది ఒక్క వన్డేనే అయినా ఐదు వికెట్లు తీశాడు. ఇక శాంట్నర్ సగటు వేగం 82.90 కి.మీ. భారత్‌పై అతడు 23 వన్డేలు ఆడి 15 వికెట్లు మాత్రమే తీశాడు. ఎకానమీ మాత్రం ఓవర్ 4.75 పరుగులతో మెరుగ్గానే ఉంది. అయితే వికెట్లను తీయడం కాకుండా బ్యాటర్లను కట్టడి చేయడంలో శాంట్నర్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.



ఫైనల్‌కు హెన్రీ డౌటే!

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు ముందే కివీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. ఆ జట్టు ప్రధాన పేసర్ మ్యాట్ హెన్రీ భుజం నొప్పితో బాధపడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన సెమీస్‌లో క్యాచ్ పట్టే సమయంలో గాయపడ్డాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు (10) తీసిన హెన్రీ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేదని జట్టు కోచ్ స్టెడ్ తేల్చాడు. అయితే భారత్‌తో ఫైనల్‌కు మరో రోజు మాత్రమే ఉండడంతో అతడు ఆడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూప్ మ్యాచ్‌లో భారత్‌పై హెన్రీ ఐదు వికెట్లతో చెలరేగిన సంగతి తెలిసిందే.

చక్రవర్తితోనే మాకు ప్రమాదం: కివీస్ కోచ్

ఫైనల్లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తమకు సమస్యగా మారే అవకాశం ఉందని కివీస్ కోచ్ గ్యారీ స్టెడ్ తెలిపాడు. 'భారత్‌తో మేమాడిన గ్రూప్ మ్యాచ్‌లో వరుణ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. కాబట్టి అతడి ప్రదర్శనపై దృష్టి సారించాల్సిందే. అతనో క్లాస్ బౌలర్. వైవిధ్యంగా బౌలింగ్ చేస్తూ మా జట్టుకు ప్రధాన ముప్పుగా మారాడు. అందుకే ఫైనల్లో వరుణ్‌ను దీటుగా ఎదుర్కోవడంతో పాటు పరుగులు సాధించే విషయమై చర్చించాల్సి ఉంది' అని స్టెడ్ తెలిపాడు.

హర్లీన్ గెలిపించెన్!



హర్లీన్ డియోల్ (70 నాటౌట్)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
యూపీ x బెంగళూరు
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గుజరాత్ హ్యాట్రిక్
ప్లేఆఫ్ దిశగా అడుగు
ఉత్కంఠ పోరులో ఢిల్లీ ఓటమి

వడోదర: హర్లీన్ డియోల్ (49 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 70 నాటౌట్) అదరగొట్టడంతో మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ కీలకమైన విజయాన్ని అందుకుంది. వరుసగా మూడో గెలుపుతో ముంబై ఇండియన్స్‌ను వెనక్కునెట్టి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. తద్వారా మెగా టోర్నీలో తొలిసారి ప్లే ఆఫ్స్ దిశగా బలమైన అడుగు వేసింది. శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్లతో టేబుల్ టాపర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుజరాత్ షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 177/5 స్కోరు చేసింది. మెగ్‌లానింగ్ (57 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 92), షఫాలీ వర్మ (27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 40) మాత్రమే రాణించారు. శిఖా పాండే రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో గుజరాత్ 19.3 ఓవర్లలో 178/5 స్కోరు చేసి విజయం అందుకుంది. హర్లీన్ డియోల్ (70 నాటౌట్)తో పాటు బేత్ మూనీ (35 బంతుల్లో 6 ఫోర్లతో 44), డాటిన్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24) మెరిశారు. శిఖా పాండే, జెస్ జొనాసెన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఏ మాత్రం ఆశల్లేని పరిస్థితులనుంచి జట్టును విజయపథంలో నడిపిన హర్లీన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఇక..ఇంతకుముందే ప్లేఆఫ్స్‌కు చేరిన ఢిల్లీ..లీగ్ దశను పరాజయంతో ముగించింది. మరోవైపు గుజరాత్ విజయంతో యూపీ వారియర్స్ టోర్నమెంట్ నుంచి నాకౌట్ అయ్యింది. కాగా గుజరాత్ జట్టు తమ చివరి మ్యాచ్‌ని ముంబైతో ఈనెల పదోతేదీన ఆడనుంది.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 177/5 (మెగ్ లానింగ్ 92, షఫాలీ వర్మ 40, సదర్లాండ్ 14, మేఘనా సింగ్ 3/35, డాటిన్ 2/37)
గుజరాత్ జెయింట్స్: 19.3 ఓవర్లలో 178/5 (హర్లీన్ 70 నాటౌట్, మూనీ 44, శిఖా పాండే 2/31, జొనాసెన్ 2/38).

ప్రతిభాన్వేషణ, వసతుల కల్పన క్రీడాభివృద్ధిలో కీలకం



కేంద్ర మంత్రి మాండవ్య

షాద్‌నగర్ (ఆంధ్రజ్యోతి): 'ఒలింపిక్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా పక్కాగా అడుగులు వేస్తోంది. 2028 లాస్‌ఏంజెల్స్ విశ్వ క్రీడలకు సన్నాహకాలతోపాటు, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి బిడ్ దాఖలు చర్యలు చేపట్టిన భారత్..అందుకు సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో మేథోమథనం ప్రారంభించింది. ఈ మేరకు రెండు రోజుల చింతన శిబిరం శుక్రవారం రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో మొదలైంది. శిబిరాన్ని ప్రారంభించిన కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య..క్రీడల్లో భారత్ తిరుగులేని శక్తిగా అవతరించేందుకు అందరూ చేతులు కలపాలని పిలుపు నిచ్చారు. భారత్‌ను ప్రపంచ క్రీడా శక్తిగా నిలపాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారని చెప్పారు. 'ఈ క్రమంలో ప్రతిభను గుర్తించడం, అధునాతన శిక్షణ పద్ధతులు ఆచరించడం, మౌలిక సదుపాయాల కల్పన ముఖ్యం. తద్వారా క్రీడల్లో సమ్మిళిత అభివృద్ధి సాధించాలి' అని మంత్రి పిలుపు నిచ్చారు. శిబిరంలో రాష్ట్రాల క్రీడల మంత్రులు, క్రీడా పరిపాలకులు, సీనియర్ అధికారులు పాల్గొంటున్నారు.

రోహిత్ కెప్టెన్సీపై కఠిన నిర్ణయం?



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత రోహిత్ శర్మ కెప్టెన్సీ భవిష్యత్ కూడా తేలనుంది. 2027లో వన్డే వరల్డ్‌కప్‌తో పాటు రాబోయే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు సన్నద్ధం కావాల్సి ఉంది. అందుకు ఇప్పటి నుంచే వన్డే, టెస్టులకు నూతన సారథిని నియమించాలన్న ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. కివీస్‌తో ఫైనల్ తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించాలని బోర్డు భావిస్తోంది. అలాగే గ్రేడ్ ఎ+ కాంట్రాక్ట్‌లో మార్పులు జరగనున్నాయి. ఇందులో మూడు ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన వారికి చోటుంటుంది. కానీ రోహిత్, విరాట్, జడేజా టీ20ల నుంచి వైదొలగగా, టెస్టుల్లోనూ రాణించలేదు. దీంతో వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సెమీస్‌లో ఆయుష్ షెట్టి

పారిస్: ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ ఆయుష్ షెట్టి సెమీస్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆయుష్ 21-16, 21-23, 21-17 తేడాతో రస్మూస్ గెమ్కే (డెన్మార్క్)పై గెలిచాడు. శనివారం జరిగే సెమీస్‌లో ఆయుష్ వరల్డ్ నెంబర్ 14 ఆటగాడు లిన్ చున్ యితో తలపడతాడు.



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన దార్ల రవి సందర్భానుసారం కళాఖండాలను తయారు చేస్తుంటారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చెక్కపై మార్చి 8 అంకె, మహిళ ఆకృతిని చెక్కారు. ఈ రూపాన్ని తయారు చేయడానికి గంటన్నర సమయం పట్టిందని చెప్పారు.

- నక్కపల్లి (ఆంధ్రజ్యోతి)



సమానత్వమా నీవెక్కడ...?

రంగంపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రం రంగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత శుక్రవారం ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. అత్యాచారాలు... అసమానతలు.. ప్లీజ్ రెస్పెక్ట్ ఉమెన్.. సమానత్వమా నీవెక్కడ.. అంటూ 6 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పుతో ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు.



డీజీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో పిడికిలి బిగించిన డీజీపీ సతీమణి సీమా గుప్త, మహిళా పోలీసు ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది

అతివలకు కూటమి కానుకలు

- అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంపు
- హెల్పర్లకు 1.41 లక్షలు అందేలా చర్యలు
- సర్కారుపై ఏటా రూ.18 కోట్ల భారం
- మహిళా పారిశ్రామికవేత్తలుగా లక్ష మంది
- నేడు మార్కాపురం వేదికగా సీఎం ప్రకటన

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అతివలకు పలు కానుకలు ప్రకటించనుంది. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో సెర్ప్, మెప్మాల ద్వారా ఎంఎస్ఎంఈ విభాగంలో వారికి చేయూతను అందించనుంది. తద్వారా లక్ష మందికిపైగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దనున్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల చిరకాల డిమాండ్ అయిన గ్రాట్యుటీ పెంపుపైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన గ్రాట్యుటీ పెంపు హామీని మహిళా దినోత్సవం సందర్భంగా నెరవేర్చనుంది ప్రభుత్వ నిర్ణయం ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు రూ.1.79 లక్షల నుంచి రూ.2.32 లక్షలు వరకు వారి సర్వీసు ఆధారంగా అందనుంది. అదేవిధంగా అంగన్వాడీ ఆయాలకు రూ.1.09 లక్షల నుంచి 1.41 లక్షల వరకు గ్రాట్యుటీ అందిస్తారు. దీనిని అమలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.17.73 కోట్ల భారంపడనుంది. అంగన్వాడీల గ్రాట్యుటీ పెంపుపై శనివారం మార్కాపురంలో ప్రభుత్వం నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రకటన చేయనున్నారు.

లక్ష మందికిపైగా లబ్ధి

రాష్ట్రంలో 55,607 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,04,516 మంది అంగన్వాడీ కార్యకర్తలు(55,607), ఆయాలు(48,909) పనిచేస్తున్నారు. వీరిలో ఏటా రిటైర్ అయ్యే వారికి లేదా రాజీనామా చేసేవారికి చెల్లించే గ్రాట్యుటీ రూ.17,73,43,218 కోట్లుగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2025-26 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించింది. ప్రతి సంవత్సరం 1,218 మందికి పైగా కార్యకర్తలు, ఆయాలు పదవీ విరమణ పొందుతున్నారని అధికారులు చెబుతున్నారు.

కార్యకర్తలకు ఇలా..

గ్రాట్యుటీ అమలు విషయంలో ఉద్యోగి ఎన్ని సంవత్సరాలు సర్వీసులో ఉంటే అన్ని సంవత్సరాలు సంవత్సరానికి 15 రోజుల వేతనం చొప్పున లెక్కిస్తారు. అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లను ఉద్యోగంలోకి తీసుకోవడానికి గరిష్ఠ వయసు 35 సంవత్సరాలు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లు. అంటే గరిష్ఠ వయసు నుంచి పదవీ విరమణ వయసు వరకు 27 సంవత్సరాలు అంగన్వాడీల్లో వారు పనిచేస్తారు. అంగన్వాడీ కార్యకర్తలకు వేతనం రూ.11,500. అంగన్వాడీ కార్యకర్త ఎన్ని సంవత్సరాలు సర్వీసులో ఉంటే అన్ని సంవత్సరాలు సంవత్సరానికి 15 రోజుల వేతనం చొప్పున గ్రాట్యుటీ ఇస్తారు. కార్యకర్త 27 ఏడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే రూ.1,79,135 గ్రాట్యుటీగా వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అదే కార్యకర్త 35 ఏళ్ల వయసు కన్నా ముందే ఉద్యోగంలో చేరితే ఆమె సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ రూ.2 లక్షలు, రూ.2.50 లక్షలు ఇలా సర్వీసు కాలం ఆధారంగా పెరుగుతుంది.

ఆయాలకు ఇలా...

అంగన్వాడీ ఆయాలకు నెలకు రూ.7 వేలు వేతనంగా లభిస్తోంది. వీరు కూడా 27 ఏళ్ల సర్వీసు పూర్తి చేశారని భావిస్తే రూ.1,09,038 గ్రాట్యుటీ వస్తుంది. అదేవిధంగా గరిష్ఠ వయో పరిమితి 35 ఏళ్ల కన్నా ముందే సర్వీసులో చేరి ఉంటే దాని ఆధారంగా గ్రాట్యుటీ పెరుగుతుంది. దీని ప్రకారం రూ.1,09,038 నుంచి రూ.1.41 లక్షల వరకు గ్రాట్యుటీ లభిస్తుంది. కాగా, అంగన్వాడీ కార్యకర్తల గ్రాట్యుటీ చెల్లింపునకు రూ.10,96,30,629, ఆయాల గ్రాట్యుటీ చెల్లింపునకు రూ.6,77,12,598 మొత్తం రూ.17,73,43,218లను సంవత్సరానికి ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది.

మహిళలకు పండగే!

- ఫ్లిప్‌కార్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు.
- కేటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌తో సెర్ప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు వ్యాపార శిక్షణ అందించడంపై కేటలిస్టు మేనేజ్‌మెంట్ సర్వీసెస్ దోహద పడుతుంది.
- చిన్న తరహా హోటల్ వ్యాపారంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడానికి గాటోస్ కేఫ్‌తో సెర్ప్ ఒప్పందం కుదుర్చుకోనుంది. దీనిద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి లభించనుంది. మెప్మా, హోంట్రయాంగిల్‌తో ఒప్పందం ద్వారా సర్వీస్ ప్రొవైడర్ల జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 18,515 మహిళా సర్వీసు ప్రొవైడర్లకు ప్రయోజనం చేకూరుతుంది.
- సర్వీసు ప్రొవైడర్లలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, బ్యూటీషియన్లు, గృహోపకరణ మరమ్మతు నిపుణులు ఉంటారు.
- రాపిడో సంస్థతో మెప్మా అవగాహన ఒప్పందం ద్వారా వెయ్యి ఎలక్ట్రిక్ వాహనాలను మహిళా లబ్ధిదారులకు అందించనున్నారు.
- ప్రకాశం జిల్లా నుంచి 10 ఈ-బైక్‌లు, 10 ఈ-ఆటోలు లబ్ధిదారులకు కేటాయించారు. ఆన్‌బోర్డింగ్, నెలవారీ చార్జీలను 3 పాటు మాఫీ చేస్తుంది.
- పీఎం విశ్వకర్మ పథకం ద్వారా వెయ్యి మంది మహిళలకు రూ.లక్ష వరకు రుణాలు అందిస్తారు.
- మహిళా సంఘాల ద్వారా అరకు కాఫీ ప్రమోషన్‌కు 100 ఔట్‌లెట్‌లు, 100 కాఫీ హోటళ్లు.

నేడు ప్రకాశం జిల్లాకు చంద్రబాబు

ఒంగోలు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం 'మహిళా దినోత్సవాన్ని' నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. ఉదయం 10.45 గంటలకు హెలికాప్టర్‌లో మార్కాపురం చేరుకుని, పట్టణ శివారులో నిర్వహించే మహిళా దినోత్సవ సభలో పాల్గొననున్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అవుతారు. అదేవిధంగా జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

నాడు-నేడు.. చంద్రబాబే!

2014 నాటికి అంగన్వాడీ కార్యకర్తల జీతం రూ.4,200 కాగా చంద్రబాబు రూ.6,300కు పెంచారు. తర్వాత 2019 నాటికి రూ.10500కి పెంచారు. అంగన్వాడీ ఆయాలకు కూడా అదేవిధంగా పెంచారు. రెండు విడతలుగా అంగన్వాడీ వర్కర్లకు 150%, అంగన్వాడీ ఆయాలకు 103% జీతం పెంచారు. 2016 అంగన్వాడీలకు 'ఎండ్ సర్వీస్ బెనిఫిట్' ఇచ్చారు. ఇప్పుడు అంగన్వాడీల చిరకాల డిమాండ్ అయిన గ్రాట్యుటీని పెంచుతున్నారు. ఇలా అప్పుడు, ఇప్పుడు కూడా అంగన్వాడీల సంక్షేమానికి చంద్రబాబు పెద్ద పీట వేశారు. జగన్ సర్కార్ ఐదేళ్లు అంగన్వాడీలను వేధింపులకు గురి చేసింది. 45 రోజులు సమ్మె చేసినా వారి డిమాండ్లను పట్టించుకోలేదు. చర్చలపేరుతో కాలయాపన చేసింది. గత ఏడాది ఎన్నికలకు ముందు పలు అంశాలకు సంబంధించి జీవోలు ఇచ్చినా అవి అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో సెర్ప్, మెప్మాలు సంయుక్తంగా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మెప్మా కింద 30 వేల మంది కొత్త మహిళా పారిశ్రామికవేత్తలను ప్రకటించనుంది.

కాస్త మెరుగే.. అయినా బరువే!

(మొదటి పేజీ తరువాయి)

57.8 శాతం మంది చెప్పగా.. తమకు ఇష్టం కాబట్టి చేస్తున్నామన్న వారు 42 శాతం మంది ఉండడం విశేషం. ఉద్యోగం చేస్తున్నా తమ జీతం మీద తమకు ఎలాంటి అధికారమూ లేనివారి సంఖ్య ఏకంగా 48 శాతం దాకా ఉంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. హైదరాబాద్‌లో మూడింట రెండొంతుల మంది మహిళలు తమ జీతంపై తమకు ఎలాంటి నిర్ణయాధికారమూ లేదని చెప్పారు. ఈ విషయంలో హైదరాబాద్‌తో పోలిస్తే.. ద్వితీయ శ్రేణి నగరాల్లో మహిళల పరిస్థితే మెరుగ్గా ఉంది. అలాగే.. కార్యాలయానికి వెళ్లడానికి అనుకూలమైన రవాణా సౌకర్యాలు లేక ప్రతి వంద మందిలో 32 మంది ఇబ్బందులు పడుతున్నట్టు ఈ సర్వేలో తేలింది. ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా.. ఇప్పటికీ, పుట్టింటికి వెళ్లడానికి భర్త, అత్తమామల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నవారు దాదాపు 39 శాతం మంది దాకా ఉండడం గమనార్హం. ఆఫీసులో చాకిరీ.. ఇంటి పని భారం కూడా పూర్తిగా తామే మోస్తున్న ఉద్యోగినులు దాదాపు 27 శాతం మందికి ఉండగా.. తాము అడగకుండానే భర్త, పిల్లలు సాయం చేస్తారని చెప్పినవారు దాదాపు 57 శాతం మంది ఉన్నారు. కాగా.. కొంత మంది మగవారు ఇంకా స్త్రీలను చులకనగా చూస్తున్నారని, ఈ విషయంలో మార్పు రావాల్సి ఉందని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. మహిళలపై లైంగిక దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తేవాలని, పని ప్రదేశాల్లో మహిళలకు తగిన సౌకర్యాలు ఉండట్లేదని చాలా మంది ఉద్యోగినులు చెప్పారు. మహిళలు ఉన్నతచదువులు చదివేందుకు భర్త, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు సహకరించాలని సర్వేలో పాల్గొన్నవారిలో అత్యధికులు అభిప్రాయపడ్డారు. తాము పని సమయంలో నిలబడే ఉండాల్సి వస్తోందని నాలుగో తరగతి ఉద్యోగినులు వాపోయారు.

మీరు ఉద్యోగం చేయడానికి కారణం?

వ్యక్తిగత ఇష్టంతో	42.2	కుటుంబ అవసరాలు	57.8

మీ జీతం మీద పూర్తి నిర్ణయాధికారం మీదేనా?

అవును	52.0	కాదు	48.0

ఆఫీసుకు వెళ్లడానికి రవాణా సౌకర్యం అనుకూలంగా ఉందా?

ఉంది	67.9	లేదు	32.1

ఇంటిపనిలో భర్త, పిల్లల తోడ్పాటు ఉంటుందా?

ఉండదు	27.3	అడిగితేనే..	15.8	అడక్కుండానే..	56.9

అనారోగ్యానికి గురైతే మీ భర్త వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తారా?

తీసుకెళ్తారు	84.3	ఆలస్యం చేస్తారు	15.7

పుట్టింటికి వెళ్లడానికి మీ భర్త, అత్త, మామల అనుమతి అవసరమా?

అవును	61.3	కాదు	38.7

శ్రీవారికి 'స్త్రీ' సేవ



సేవలో గత 25 ఏళ్లలో 10.5 లక్షల మంది

(తిరుమల-ఆంధ్రజ్యోతి): టీటీడీ 'శ్రీవారిసేవ'లోనూ గత 25 ఏళ్లలో పది లక్షల మందికిపైగా మగువలు భాగస్వామ్యమయ్యారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో టీటీడీ 2000 నవంబరు 1న 'శ్రీవారిసేవ'ను ప్రారంభించింది. 195 మందితో ప్రారంభమైన ఈసేవలో ఇప్పటివరకు 15 లక్షల మంది పాల్గొనగా.. వారిలో 10.50 లక్షల మంది స్త్రీలే ఉండటం గమనార్హం. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు కూడా 'శ్రీవారిసేవ'లో పాల్గొంటున్నారు. లండన్‌లో హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్న రీతూ వక్కలంక కూడా ఇటీవల తిరుమలకు వచ్చి 'శ్రీవారిసేవ'లో పాల్గొనటం గమనార్హం. శ్రీవారి ఆలయం, లడ్డూ కౌంటర్, నిఘా, ఆరోగ్య, అన్నప్రసాదం, ఉద్యానవనాలు, వైద్య, రవాణా, కల్యాణ కట్ట, పుస్తక విక్రయశాలలు తదితర విభాగాల్లో వీరు సేవలందిస్తున్నారు. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో రద్దీని క్రమబద్ధీకరించడం, భక్తులకు అన్నపానీయాలు అందించడం, వయోవృద్ధులు, దివ్యాంగులకు సహాయకులుగా ఉండటం తదితర సేవల్లో మహిళా సేవకులు ముందుంటున్నారు. గోవిందనామస్మరణ చేసుకుంటూ, భక్తుల్లో భగవంతుడిని చూస్తూ సేవ చేస్తున్నారు.


గ్యాలరీల్లోని భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న మహిళా సేవకురాలు

శ్రమదానం 'దారి'లో గిరిజనం

- 8 కి.మీ. రోడ్డు వేసుకుంటున్న అల్లూరి జిల్లా దొరగూడ గ్రామస్థులు
- రూ.10లక్షలు పోగేసుకుని పనులు

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ దొరగూడకు పక్కా రహదారి లేదు. ఇంటి అవసరాల నుంచి ఎమర్జెన్సీ వైద్యం వరకు... ఏ పని కోసం ఊరు దాటాలన్నా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఉబ్బెంగుల గ్రామం నుంచి తమ గ్రామం వరకూ సుమారు ఎనిమిది కిలోమీటర్లు పక్కా రహదారి నిర్మాణం చేపట్టాలని గత కొన్నేళ్లుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వినతులు అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో సొంతంగా రహదారి నిర్మించుకునేందుకు పూనుకున్నారు. తమ వద్ద ఉన్న బంగారం, భూములు, మేకలు, ఆవులు, గేదెలు, కోళ్లను విక్రయించి సుమారు రూ.10 లక్షలు పోగేశారు. బండరాళ్లను తొలగించేందుకు ఒక ప్రొక్లయినర్‌ను మాట్లాడుకున్నారు. మరోవైపు శ్రమదానంతో మట్టి రహదారి పనులను చేస్తున్నారు. శుక్రవారం శ్రమదానం చేస్తున్న గ్రామానికి చెందిన లక్ష్మణ్, లైకోన్, బుద్ర, గస్సు, మంగ్రీ, కాడి తదితరులను స్థానిక విలేకరులు కలవగా.. ఈ వివరాలు తెలిపారు. గత మూడు నెలలుగా శ్రమదానంతో పనులు చేపడుతున్నామని, మరికొద్ది రోజుల్లో తాత్కాలిక రహదారి పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.

- ముంచంగిపుట్టు, ఆంధ్రజ్యోతి


రహదారి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన గ్రామస్థులు

మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా ఏపీ

- మహిళా సాధికారత కోసం కట్టుబడి ఉన్నాం
- అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో చంద్రబాబు


విజయవాడలో జరిగిన మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల భాగస్వామ్యం లేకుండా ప్రగతి అసాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో పురుషులతో సమానంగా మహిళల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడం, రాష్ట్రాన్ని మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. విజయవాడలో మహిళా పారిశ్రామికవేత్తల సంఘం.. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా (ఎలీప్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. అనకాపల్లిలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటవుతున్న తొలి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇప్పుడు మహిళలు కూడా అపారమైన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తూ సంపాదనలో పురుషులను మించిపోతున్నారని తెలిపారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 ప్రకారం శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. అందుకే మహిళల కోసం వర్క్‌ ఫ్రం హోం (ఇంటి నుంచే పని) విధానాన్ని కూడా తీసుకువస్తున్నామని తెలిపారు. మహిళలు ఇంట్లో కూర్చునే మగవాళ్ల కంటే ఎక్కువ సంపాదించే పరిస్థితులను తీసుకువస్తామని తెలిపారు.

టాటా ఇన్నోవేషన్ సెంటర్స్ ద్వారా సహకారం

భారతీయ మహిళలు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉండాలనే తమ ఆకాంక్షను నిజం చేసి చూపిస్తామని చంద్రబాబు చెప్పారు. మహిళా సాధికారతకు తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా 45 శాతం ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అద్భుతమైన పారిశ్రామిక పాలసీలను అమలు చేస్తున్నామని వివరించారు. వ్యాపార ఆలోచనలతో ముందుకు వచ్చే వారి ఎవరికైనా రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్స్ ద్వారా అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనుమతులు

పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకొచ్చే మహిళా పారిశ్రామికవేత్తలు రిజిస్ట్రేషన్లు, అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా గంటల వ్యవధిలోనే ధ్రువపత్రాలు సెల్‌ఫోన్లకు వస్తాయని చెప్పారు. మొత్తం 1000 రకాల ప్రభుత్వ సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే అందించబోతున్నట్లు చంద్రబాబు వివరించారు. 30 ఏళ్ల క్రితం వంటింటికే పరిమితమైన మహిళలకు సాధికారత కల్పించడం కోసం తాను డ్వాక్రా సంఘాలు ప్రారంభించానని చంద్రబాబు గుర్తు చేశారు. వంట చేయడానికి తన తల్లి పడిన కష్టాలే 'దీపం' పథకం ప్రారంభించడానికి తనకు స్ఫూర్తి అని తెలిపారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి 'దీపం-2' పథకం ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

పెద్ద ఆర్మీగా మహిళా శక్తి

డ్వాక్రా సంఘాల్లో చేరిన సామాన్య మహిళలు కూడా నాయకత్వ లక్షణాలను పెంచుకుని ఆర్థిక స్వావలంబనతో అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా, మెప్మా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న 1.50 కోట్ల మహిళలతో అది పెద్ద ఆర్మీగా మహిళాశక్తి రూపుదిద్దుకుందని తెలిపారు. డ్వాక్రా మహిళలను ఎంఎస్ఎంఈల వైపునకు మళ్లించి.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. బ్యాంకు లింకేజీలతో స్వయం సహాయక సంఘాలకు రూ.14వేల కోట్ల మేర రుణాలు అందించేందుకు బ్యాంకులతో త్వరలోనే ఒప్పందాలు చేసుకుంటున్నామని చంద్రబాబు వెల్లడించారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి, ఈ మహిళా సదస్సు కన్వీనర్ జ్యోతి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎంపీ కేశినేని శివనాథ్, పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్, డైరెక్టర్ అభిషిక్త్ కిశోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

హైకోర్టులో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టు న్యాయవాదులు సంఘం, ఉద్యోగుల సంఘం వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించాయి. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ బీఎస్. భానుమతి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతిలను సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎన్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీహరి, మహిళా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరావు, కార్యవర్గం మహిళా న్యాయమూర్తులను సన్మానించారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళ న్యాయమూర్తులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జస్టిస్ తిల్హరి మాట్లాడుతూ కలలను సాకారం చేసుకున్నప్పుడే మహిళలకు నిజమైన సాధికారత లభించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎం.బబిత, ఏపీ హైకోర్టు న్యాయసేవా సంఘం కార్యదర్శి జి.మాలతి, న్యాయసేవాధికార సంస్థ ఉపకార్యదర్శి అమర రంగేశ్వరరావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ మరణాలకు కారణాలేంటో వెలుగులోకి తెస్తాం: మంత్రి అనిత

విజయవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య తర్వాత జరిగిన మరణాల్లో ఏ ఒక్కటీ మిస్టరీగా ఉండిపోదని.. ప్రతి మరణం వెనకున్న కారణాలను కచ్చితంగా వెలుగులోకి తీసుకొస్తామని హోం మంత్రి అనిత చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. వివేకా హత్య కేసులో ఎవరు తప్పు చేసినా శిక్ష తప్పదని హెచ్చరించారు.



ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా నాగబాబుతో లోకేశ్ కరచాలనం, చిత్రంలో నాదెండ్ల మనోహర్, పల్లా శ్రీనివాస్ తదితరులు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా కె.నాగబాబు నామినేషన్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరఫున జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అసెంబ్లీకి వచ్చిన ఆయన నామినేషన్ పత్రాలను అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిణి శ్రీమతి వనితారాణికి అందించారు. ఆయన నామినేషన్ పత్రాలు అందించే సమయంలో మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ నుంచి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉన్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా కూటమి ఎమ్మెల్యేలు నాగబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నామినేషన్ దాఖలకు 10వ తేదీ వరకూ సమయం ఉంది.

జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే దొరబాబు

▸▸ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన అధినేత పవన్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జనసేన పార్టీలో చేరారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా దొరబాబుకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు పిఠాపురం నియోజకవర్గంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి, గొల్లప్రోలు మార్కెట్ కమిటీ చైర్మన్ వీర వెంకట సత్యనారాయణ తదితరులు జనసేనలో చేరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పిఠాపురానికి చెందిన మరికొంత మంది వైసీపీ సర్పంచులు, నాయకులకు పార్టీ కండువా కప్పారు.

వైసీపీ నేతల వ్యాఖ్యల్ని పట్టించుకోరు: పురందేశ్వరి



చిత్తూరు సెంట్రల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల వ్యాఖ్యల్ని రాష్ట్ర ప్రజలు పట్టించుకోవడం మానేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. శుక్రవారం చిత్తూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఓట్లు వేసి గెలిపించిన ప్రజల పట్ల ఎమ్మెల్యేగా బాధ్యతను విస్మరించి, అసెంబ్లీకి రాకుండా జగన్ వ్యవహరిస్తున్న తీరు సరికాదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా. వైసీపీ నేతలు గత ఐదేళ్ల అసెంబ్లీలో ఎలా వ్యవహరించారో గుర్తు చేసుకోవాలి. మహిళలను అగౌరవపరిచే సంస్కృతి వైసీపీదే. గౌరవ సభను కౌరవ సభగా మార్చింది వైసీపీ కాదా? నిండు సభలో మహిళలను కించపరిన విషయం ప్రజలు గుర్తించే తగిన బుద్ధి చెప్పారు' అని పురందేశ్వరి అన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు పురందేశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం చిత్తూరులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై పలు సూచనలు చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి పార్టీలతో కలసి నడుస్తూనే బీజేపీని ప్రజలకు దగ్గర చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణంపై చిత్తశుద్ధి లేదు

▸▸ షరతులు విధించడం మోసం చేయడమే: షర్మిల

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏరు దాటేంతవరకూ ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లుగా కూటమి ప్రభుత్వం తీరు ఉందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. మహిళలకు ఉచిత ప్రయాణంపై శుక్రవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ... ఫ్రీ అంటూ ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఊదరగొట్టాయి. మహిళలతో ఓట్లు వేయించుకుని ఇప్పుడు షరతులు వర్తిస్తాయంటూ చెప్పడం దారుణం. జిల్లా స్థాయి వరకే పథకాన్ని పరిమితం చేస్తామని చెప్పడం మోసం. ఆదిలోనే యూటర్న్ తీసుకోవడం అంటే ఇదే మరి. కమిటీల పేరుతో కాలయాపన చేశారు. పథకం అమలుకు ముందే ఇన్ని నిబంధనలు పెట్టే ప్రభుత్వం.. రేపు అమల్లోకి తెచ్చే సరికి నియోజకవర్గం, మండల స్థాయి వరకే ఫ్రీ అంటారేమో?' అని ఎద్దేవా చేశారు.

దృశ్యం సినిమాలా వివేకా హత్య కేసు: శ్రీనివాసుల రెడ్డి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును దృశ్యం సినిమాలా సాగదీస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. 'వివేకా హత్య జరిగి ఏళ్లు గడుస్తున్నా.. ఈ కేసులో దోషులకు ఇప్పటికీ శిక్ష పడలేదు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి, వాచ్‌మెన్ రంగన్న మృతి చెందటం అనుమానాలకు తావిస్తోంది. పరిటాల రవి హత్య కేసులో వరుస మరణాలు చూసినట్లే.. వివేకా హత్య కేసులోనూ నిందితుల మరణాలు కొనసాగుతున్నాయి. హత్యలు చేయడం, కట్టుకథలు అల్లడం జగన్‌రెడ్డికి అలవాటు. పోలీసులు రంగన్నను వేధించారన్న మాట శుద్ధ అబద్ధం. రంగన్న మృతదేహానికి పూర్తి స్థాయిలో పోస్టుమార్టం జరగాలి. ఈ కేసులో నిజమైన దోషులను పట్టుకుని శిక్షించాలి. అధికారం కోసం సొంత బంధువులే వివేకాను హత్య చేశారనే విషయం రాష్ట్రమంతా తెలుసు. వివేకా కుమార్తె సునీత న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు. వివేకా హత్య కేసులో నిందితులు, సాక్షుల మరణాల వెనుకున్న వాస్తవాలను బహిర్గతం చేయాలి' అని శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే చదలవాడపై సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్ఠను దిగజార్చేలా ఉందని భావిస్తోంది. శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి వచ్చిన వెంటనే చంద్రబాబు ఎమ్మెల్యే గొడవపై పార్టీ నేతల నుంచి సమాచారం తెప్పించుకున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి.. తాను చెప్పినవారినే నియమించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయడమే కాకుండా ఎక్సైజ్ కమిషనరేట్‌లో ఆయన ప్రవర్తన.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు. ఎమ్మెల్యే నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకోవాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. వివరణపై సంతృప్తి చెందకపోతే క్రమశిక్షణ కమిటీ ముందుకు రప్పించాలని సూచించారు.

పోసానికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

▸▸ విజయవాడ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళి విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3)కు అనుగుణంగా నడుచుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విజయవాడ, సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ పోసాని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సాయిరోహిత్ స్పందిస్తూ.. ఈ కేసులో పీటీ వారెంట్ అమలుకాలేదని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ పిటిషనర్ విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఓ టీవీ చానల్, ఆ సంస్థ యజమాని, అందులోని ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అసభ్యకర పదజాలంతో దూషించారంటూ విజయవాడకు చెందిన పావులూరి రమేశ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సూర్యారావుపేట పోలీసులు తనపై నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ పోసాని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

చీకటి నుంచి వెలుగుల్లోకి..!



▸▸ తాడేపల్లిగూడెంలో 'అక్షరం అండగా..' వీధి దీపాల సమస్యకు పరిష్కారం

▸▸ 'ఆంధ్రజ్యోతి'కి స్థానికుల కృతజ్ఞతలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఏపీ నిట్ వరకు ఉన్న రహదారిలో అలముకున్న చీకట్లకు చెక్ పడింది. 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం సహకారంతో వీధి దీపాలు వెలుగులు విరజిమ్మాయి. ఈ రోడ్డులో రాత్రి వేళల్లో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ ఏడాది జనవరి 28న తాడేపల్లిగూడెంలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై వీధి దీపాల ఏర్పాటుతోపాటు పలు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు సిబ్బంది దీపాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలు ప్రస్తావించిన ఎస్వీ రంగారావు విగ్రహం నుంచి గణేశ్ నగర్ వరకూ రోడ్డు విస్తరణ, ఎఫ్‌సీఐ కాలనీలోని చిరంజీవి పార్కు అభివృద్ధి పనులు మొదలుకానున్నాయి. రద్దీగా వుండే నిట్ రహదారిలో చీకటిలో ప్రయాణించాలంటే ఎంతో భయంగా ఉండేదని, 'ఆంధ్రజ్యోతి' చొరవతో లైట్లు వేయడం ఆనందంగా ఉందని మోదుగగుంటకు చెందిన కామన మణిబాబు కృతజ్ఞతలు తెలిపారు. లైట్లు వేయడంలో కీలకంగా వ్యవహరించిన 'ఆంధ్రజ్యోతి'కి, ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లకు తాడేపల్లిగూడెంకు చెందిన ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



వీధి లైట్ల వెలుగులో నిట్‌కు వెళ్లే రహదారి

అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన, ఈ కేసులో ప్రధాన సాక్షి, వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగన్న మృతిని ప్రస్తావించారు. సచివాలయంలో శుక్రవారం కేబినెట్ సమావేశం జరిగింది. వివేకా హత్య తదనంతర పరిణామలపై మంత్రులతో సీఎం చర్చించారు. వివేకా హత్య జరిగిన నాటి నుంచి చోటుచేసుకున్న పరిణామాలను, వివేకా కేసులో కీలక వ్యక్తులు వరుసగా మృతి చెందుతున్న తీరును, ఆ మరణాల వెనుక ఉన్న అనుమానాలను మంత్రులకు డీజీపీ హరీశ్ గుప్తా వివరించారు. చంద్రబాబు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు మీడియాలో వస్తున్న వార్తలు చూసి గుండెపోటని అనుకున్నాం. హత్య జరిగిన రోజున హైదరాబాద్‌లో ఉన్న జగన్‌కు ఉదయం 5 గంటలకే విషయం తెలిసినా ఏమాత్రం చలించకుండా అజయ్ కల్లం తదితరులతో కలిసి వైసీపీ మేనిఫెస్టో తయారీలో నిమగ్నమైపోయారు. సొంత చిన్నాన్న చనిపోతే అంత కూల్‌గా ఎవరైనా ఉండగలరా? మాజీ ఎంపీ స్థాయి వ్యక్తి అర్ధరాత్రి ఎప్పుడో హత్యకు గురైతే ఉదయం 10.30 గంటల వరకూ ఎస్పీతోసహా పోలీసు ఉన్నతాధికారులు ఎవ్వరూ అక్కడికి వెళ్లలేదు. ఇప్పుడేమో ఈ కేసులో కీలక వ్యక్తులు, సాక్షులు వరుసగా అనుమానాస్పదరీతిలో మరణిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే ఎంత పక్కాగా వివేకా హత్య జరిగిందో అర్థమవుతోంది. ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీనిగ్గుతేల్చాల్సిందే" అని సీఎం అన్నారు.

జగన్ అరాచకాలు తిప్పికొట్టాలి

వివేకా హత్య, జగన్ కుట్ర రాజకీయాలు, సొంత మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారంపై మంత్రులకు సీఎం వివరిస్తూ.. రాజకీయాల ముసుగులో కరుడుగట్టిన నేరగాళ్లు రాష్ట్రంలో ఉన్నారని వ్యాఖ్యానించారు. సొంత ప్రయోజనాల కోసం రాజకీయాలను మాజీ సీఎం జగన్ నేరపూరితంగా మార్చేశారన్నారు. ప్రజలను ఏమార్చేందుకు జగన్ సొంతంగా టీవీ, పత్రిక ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. జగన్ చేస్తున్న అరాచకాలను తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. స్వప్రయోజనాల కోసం వివేకాను హత్య చేసి ఎన్నికల సమయం కావడంతో దాని నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు తనపై నీచమైన ఆరోపణలు చేశారని మండిపడ్డారు. "నేను వివేకాను హత్య చేసినట్లు వాళ్ల పత్రికలో 'నారాసుర రక్తచరిత్ర' అంటూ రాసుకొచ్చారు. ముందు గుండెపోటు అని చెప్పి, తర్వాత గొడ్డలి వేటన్నారు. వివేకా హత్యపై ఎవ్వరూ మాట్లాడకుండా గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. చివరికి బాధితురాలైన చెల్లెలు సునీతను నిందితురాలిగా చూపించేందుకు జగన్ ప్రయత్నించారు." అని వివరించారు. ఇలాంటి నేర మనస్తత్వం ఉన్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వారు చేసే ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. వివేకా హత్య సమయంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులకు వైసీపీ అధికారంలోకి రాగానే పదోన్నతులు కల్పించడం, సీబీఐ అధికారి రాంసింగ్‌పై ఎదురుకేసు పెట్టడం.. అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయనివ్వకుండా అడ్డుకోవడం వంటి అంశాలన్నిటినీ వివరిస్తూ.. జగన్ నేర మనస్తత్వాన్ని విశ్లేషించారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసులోనూ కీలక వ్యక్తులందరూ వరుసగా అనుమానాస్పద రీతిలో మృతి చెందారని గుర్తుచేశారు. వివేకా హత్య జరిగిన రోజు జగన్, భారతిని హైదరాబాద్ నుంచి పులివెందులకు తీసుకొచ్చిన డ్రైవర్ కూడా చనిపోవడంపై చర్చ జరిగింది.

జగన్ మీడియా ఉన్నదే అందుకు...

రంగన్న మృతిని మసిపూడి మారేడు కాయ చేసేందుకు జగన్ మీడియా ప్రయత్నించిందని సీఎం అన్నారు. పోలీసులు చంపారంటూ తొలుత జగన్ మీడియాలో ప్రసారం కావడం గురించి మంత్రివర్గ సహచరులకు ఆయన వివరించారు. ఏ దురుద్దేశం లేకపోతే జగన్ మీడియాలో రంగన్న మృతిని పోలీసుల మెడకు చుట్టాలని ఎందుకు చూస్తారని, ఆయన మృతి ముమ్మాటికీ అనుమానాస్పదమేనని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. జగన్ మీడియా ఉన్నదే అందుకు.. అన్నారు. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి వచ్చిన బెదిరింపులపై కూడా కేబినెట్‌లో చర్చించారు. రంగన్నకు 1+1 భద్రత ఉన్నా కూడా రక్షించలేకపోయామని మంత్రులు వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు సీబీఐ పరిధిలో ఉన్నా, ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, అప్రూవర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఇకపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని మంత్రులు అభిప్రాయపడ్డారు.

చెక్ పెట్టాల్సిందే..

వివేకా హత్య కేసులో కీలకవ్యక్తులు వరుసగా అనుమానాస్పదరీతిలో మృతి చెందడం దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. హత్యారాజకీయాలు పునరావృతం కాకుండా చెక్ పెట్టాల్సిందేనన్నారు. ఈ మరణాలను సీరియస్‌గా తీసుకోకపోతే మరొకరు ఇదే తరహాలో తయారవుతారని పవన్ అభిప్రాయపడ్డారు.

డీపీవోల కేడర్ క్రమబద్ధీకరణకు ఓకే

▸▸ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం.. కుప్పంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారుల కేడర్ క్రమబద్ధీకరణకు రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఇప్పటి వరకు ఉన్న జిల్లా పంచాయతీ అధికారి, దానితో సమానమైన అన్ని హోదాలను అనుసంధానిస్తూ డీపీవో, విస్తరణ శిక్షణ కేంద్రాల ప్రిన్సిపాళ్ల స్థాయిని పెంచడం ద్వారా ఆ శాఖలో డూప్లికేషన్ ఆఫ్ కేడర్‌ను రూపుమాపడానికి.. తద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సర్వీసు రూల్స్(2001)లో చేసిన సవరణలకు ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. చిత్తూరు జిల్లాలో సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో రూ.5.34 కోట్ల బడ్జెట్‌తో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ) ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. కొత్తగా 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు/పీజీ లీన్ పోస్టుల కల్పనకు సమ్మతించింది.

కేబినెట్ మరిన్ని నిర్ణయాలివీ..

- ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు మన్యం జిల్లా సీతంపేట మండలంలో 27.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయింపు.
- విజయనగరం జిల్లా గాజులరేగలో జిల్లా టీడీపీ కార్యాలయం నిర్మాణానికి 33 ఏళ్ల కాలపరిమితితో 2 ఎకరాల భూమి కేటాయింపు.
- రాజమండ్రి అర్బన్‌లో అగ్రికల్చర్ కాలేజీకి 10.72 ఎకరాలు కేటాయింపు.
- రాజమండ్రిలో గోదావరి నదిపై ఉన్న హేవ్‌లాక్ వంతెనను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఏపీటీడీసీకి 116.974 ఎకరాలు.
- పర్యాటక అభివృద్ధికి కాకినాడ జిల్లా బీచ్ సమీపాన తమ్మవరంలో 66.12 ఎకరాలు ఏపీటీడీసీకి కేటాయింపు. కాంపెన్సేటరీ ఫారెస్టేషన్ కింద ఏలూరు జిల్లాలో 5.75 ఎకరాలు అటవీ శాఖకు ఉచితంగా కేటాయింపు.
- చిత్తూరు జిల్లా జంగాలపల్లిలో సెయింట్ గాబ్రియేల్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థ నిర్మాణానికి 2019లో జీవో 106 ద్వారా కేటాయించిన 4.64 ఎకరాల్లో చేపట్టిన కట్టడాల పూర్తికి గడువు మరో ఏడాదిన్నర పొడిగింపు.
- సీఎం ఇచ్చిన హామీ మేరకు గీత కులాలకు 335 మద్యం దుకాణాలను కేటాయించారు. వాటిలో సొండి కులానికి 4 మద్యం దుకాణాలను కేటాయిస్తూ జారీ చేసిన జీవో 22, ప్రకాశం జిల్లా ఎన్‌జీపాడు మండలం మద్దిరాలపాడులో ఓ దుకాణాన్ని ఏ.శ్రీనుకు కేటాయిస్తూ ర్యాటిఫికేషన్‌కు ఆమోదం.
- ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో కాంట్రాక్టు ప్రాతిపదికన 22 మంది సిబ్బంది నియామకం.
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన పర్యాటక కేంద్రాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి రూపొందించిన పాలసీ (2024-29)కి ఆమోదం
- రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు రూ.9 వేల కోట్ల సమీకరణకు అంగీకారం.
- విశాఖలోని 'సెంచూరియన్ స్కూల్ ఆఫ్ రూరల్ ఎంటర్‌ప్రైజెస్ మేనేజ్‌మెంట్ ట్రస్ట్, భువనేశ్వర్' పేరును 'సెంచూరియన్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ట్రస్టు, విశాఖపట్నం'గా మార్చాలని నిర్ణయం. దీనికి సంబంధించి రూపొందించిన బిల్లు(2025)కు ఆమోదం.

రాష్ట్రంలో 'టాటా ఎనర్జీ' భారీ పెట్టుబడులు

▸▸ 49 వేల కోట్లతో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి

▸▸ ఎన్ఆర్ఈడీసీఏపీతో ఒప్పందం



మంత్రులు లోకేశ్, గొట్టిపాటి, సీఎస్ విజయానంద్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో టాటా, ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.49,000 కోట్ల పెట్టుబడితో పునరుత్పాదక విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు టాటా రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ)తో ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థకు భూములు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం సహకారం అందిస్తుంది. వెలగపూడి సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్ సమక్షంలో టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సీఈఓ, ఎండీ దీపేశ్ నందా, ఎన్ఆర్ఈడీసీఏపీ ఎండీ కమలాకరబాబు శుక్రవారం ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా టాటాతో ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగంలో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు, 160 గిగావాట్ల పునరుద్పాదక శక్తి సామర్థ్యంతో ప్రాజెక్టులు ఏర్పాటు కావాలన్నదే లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో క్లీన్ ఎనర్జీరంగంలో 7.5లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర పునరుద్పాదక విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీ లక్ష్యాలను అధిగమించేందుకు ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయాలని ఎన్ఆర్ఈడీసీఏపీని లోకేశ్ ఆదేశించారు.

రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం సంతోషం: టాటా

పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం తమకు సంతోషంగా ఉందని టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సీఈవో దీపేశ్ నందా చెప్పారు. పునరుత్పాదక విద్యుత్తు రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఏడు గిగావాట్ల వరకూ స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం వల్ల రాష్ట్రం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కేంద్రంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

ఏఐతో పాలన మెరుగుపరుస్తాం: లోకేశ్

ఏఐ వినియోగం ద్వారా పౌర సేవలు, పాలనా సామర్థ్యాలను మెరుగుపరచుకుంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. పాలనలో సాంకేతికత వినియోగాన్ని వేగవంతం చేస్తామన్నారు. ఉండవల్లి నివాసంలో మంత్రి సమక్షంలో సాంకేతిక సహకారంపై వాద్వానీ ఫౌండేషన్ తరఫున వాద్వానీ సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సీఈవో ప్రకాశ్‌కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని లోకేశ్ అన్నారు. ఏఐ ఆధారిత పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను నిర్మించడానికి, సేవలు అందించడాన్ని మెరుగుపరచడానికి, అధునాతన డిజిటల్ నైపుణ్యాలతో కూడిన శ్రామికశక్తిని తయారు చేయడానికి వాద్వానీ ఫౌండేషన్ సహకరిస్తుందని వెల్లడించారు. ఏఐతో పాలనలో పరివర్తన తీసుకురావడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని వాద్వానీ ఫౌండేషన్ అధికారి ప్రకాశ్ కుమార్ చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంచడం ద్వారా వేగవంతమైన సేవలు అందుతాయన్నారు. డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా అత్యాధునిక ఏఐ కోర్సులు అందిస్తామన్నారు.

విక్రాంత్‌రెడ్డికి ముందస్తు బెయిల్

▸▸ షరతులతో మంజూరుచేసిన హైకోర్టు



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని కేవీఆర్ గ్రూపు వాటాలు అరబిందోకు బదలాయింపు వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసులో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు వై.విక్రాంత్‌రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టంచేసింది. దర్యాప్తునకు సహకరించాలని, కోరినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించింది. కేసుతో సంబంధం ఉన్న, కేసు వివరాలు తెలిసిన వ్యక్తులను ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ బెదిరించడం, భయపెట్టడం వంటివి చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు ఇచ్చారు. తనను బెదిరించి, భయపెట్టి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని రూ.3,609కోట్ల విలువైన వాటాలు అరబిందోకు బదలాయించుకున్నారని కేవీఆర్ గ్రూపు అధినేత కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీ రావు) గత డిసెంబరు 2న ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దానిపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. శుక్రవారం తీర్పు వెలువరించారు.

పేర్ని నానికి షరతులతో ముందస్తు బెయిల్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుండి రేషన్ బియ్యం మాయం చేశారనే ఆరోపణలతో పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి పేర్ని నానికి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని.. దర్యాప్తునకు సహకరించాలని, కోరినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని ఆయన్ను ఆదేశించింది. కేసుతో సంబంధం ఉన్న, కేసు వివరాలు తెలిసిన వ్యక్తులను ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ బెదిరించడం, భయపెట్టడం వంటివి చేయడానికి వీల్లేదని తేల్చిచెబుతూ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మచిలీపట్నంలో వైసీపీ నేత పేర్ని నాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాల శాఖకు లీజుకిచ్చారు. ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయమయ్యాయని పేర్కొంటూ చింతం కోటిరెడ్డి అనే అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా పేర్ని నానిని కూడా 6వ నిందితుడిగా చేర్చారు. దాంతో ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో నిర్ణయాన్ని వాయిదా వేసిన న్యాయమూర్తి.. తాజాగా తీర్పు వెలువరించారు. 'ఈ కేసు మొత్తం సహనిందితుడి నేరాంగీకార వాంగ్మూలం, రెండో నిందితుడిగా ఉన్న గోడౌన్ మేనేజర్ మానసతేజ బ్యాంకు ఖాతా నుంచి పేర్ని నాని ఖాతాకు సొమ్ము బదిలీ అయిందనే విషయాలపై ఆధారపడి ఉంది. మానసతేజ 2016 నుండి రూ.10 వేల జీతానికి పిటిషనర్ వద్ద పనిచేస్తున్నారు. గోడౌన్‌లో నిల్వ చేసిన బియ్యం బస్తాల తగ్గుదలకు బాధ్యత వహిస్తూ ఏ-1గా ఉన్న పిటిషనర్ భార్య కార్పొరేషన్‌కు రూ.1,70,56,800 చెల్లించారు. ఇది ఆమె చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. బియ్యం గోడౌన్ రోజువారీ వ్యవహారాల్లో పేర్ని నాని జోక్యం ఉందని ఎఫ్ఐఆర్‌లో గానీ, రిమాండ్ రిపోర్ట్‌లో గానీ ఎలాంటి ప్రస్తావనా లేదు. సొమ్మును ఇప్పటికే కార్పొరేషన్‌కు చెల్లించినందున కస్టోడియల్ విచారణ అవసరం లేదు. ఆయనకు స్థిరనివాసం ఉంది. విదేశాలకు పారిపోయే అవకాశం లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని అందులో స్పష్టం చేశారు.

పోసానికి బెయిల్ ఇవ్వొద్దు


- ఆయన వాడిన పదజాలం తీవ్రమైనది
- ఆదోని కోర్టులో ప్రాసిక్యూషన్ వాదనలు
- మరో కేసులో బెయిల్ ఇచ్చిన కడప కోర్టు
- రెండు రోజుల పోలీస్ కస్టడీకి పోసాని

కర్నూలు లీగల్/కడప రూరల్/నరసరావుపేట లీగల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళి బెయిల్ పిటిషన్‌పై ఆదోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం సాయంత్రం వాదనలు ముగిశాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న పోసాని కృష్ణమురళి తరఫున ఆయన న్యాయవాదులు జీవన్‌సింగ్, పి.సువర్ణ రెడ్డి వాదనలను వినిపించారు. రాజకీయ దురుద్దేశంతో పోసానిపై అక్రమంగా కేసులు బనాయించారన్నారు. పోసాని వయస్సు, ఆరోగ్య కారణాలను దృష్టిలో పెట్టుకుని ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మహేశ్వరి వాదనలు వినిపించారు. నిందితుడు పోసాని వాడిన పదజాలం చాలా తీవ్రమైనవని, అవి బాధితుల ప్రాథమిక హక్కులను హరించేలా ఉన్నాయనీ, అతనిని బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని చెప్పారు. దీంతో రాతపూర్వక అభ్యంతరాలను కోర్టులో దాఖలు చేయాలని తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేస్తూ ఆదోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ అపర్ణ ఆదేశాలు జారీ చేశారు. కాగా, పోసానిని కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు 10న ఆదేశాలు జారీ చేస్తారనీ పోసాని తరఫు న్యాయవాది పి.సువర్ణ రెడ్డి తెలిపారు. కాగా, అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో పోసానికి కడప మొబైల్ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా, పోసానిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టు న్యాయాధికారి రెడ్డి ఆశీర్వాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు పోసాని దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది.

వంశీ బ్యారక్ మార్పుపై 10లోగా కౌంటర్ వేయండి

▸▸ జైలు అధికారులకు కోర్టు ఆదేశం

విజయవాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బ్యారక్ మార్పు పిటిషన్‌పై ఈ నెల 10లోగా కౌంటర్ దాఖలు చేయాలని విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు జైలు అధికారులను ఆదేశించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉంటున్న తనను ఇతర ఖైదీలున్న బ్యారక్‌లోకి మార్చాలని, లేనిపక్షంలో ఇతర ఖైదీలను తన బ్యారక్‌లో ఉంచాలని వంశీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని జైలు అధికారులను న్యాయాధికారి హిమబిందు శుక్రవారం ఆదేశించారు.



పాలన చేతకాని పాలకపక్షం.. ప్రశ్నించలేని ప్రతిపక్షం: పీడీఎఫ్



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'పాలించడం చేతకాని పాలకపక్షం, ప్రశ్నించ లేని ప్రతిపక్షం విశ్వసనీయత కోల్పోయాయి' అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇల్లా వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'మద్యపాన నిషేధం పేరుతో గత ప్రభుత్వం పెద్ద వ్యాపారం చేసింది. ఇప్పటి ప్రభుత్వం మద్యం పాలసీ పేరుతో అదే చేస్తోంది. ఉద్యోగుల పీఆర్సీ, ఐఆర్ అమలు చేస్తామన్న కూటమి నేతలువాటి ఊసెత్తడం లేదు' అని విమర్శించారు. టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి... ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు, బకాయిలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

ఆరోగ్యశాఖను అప్పుల్లోకి నెట్టారు

- రూ.6,500 కోట్లు అప్పులు చూపించారు
- వైసీపీ ప్రభుత్వం మందులకూ బకాయి పెట్టింది
- ఆరోగ్య శాఖను పూర్తిగా గాడిలో పెట్టాం..
- అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్



అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ సేవా రంగమని, ఖర్చు పెట్టడమే కానీ ఆదాయం వచ్చేది ఉండదని... అలాంటి ఆరోగ్యశాఖను కూడా గత వైసీపీ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. తాను రూ.6,500 కోట్ల అప్పులతో ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నానని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో వైద్యఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు, మందుల సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు.. ఇలా ప్రతి విభాగాన్నీ వైసీపీ అప్పుల్లో ముంచేసిందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఆరోగ్యశాఖకు రూ.2700 కోట్లు మూలధన వ్యయం కింద ఇచ్చారని చెప్పారు. 2025-26 బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు రూ.19,264 కోట్లు కేటాయించడం అభినందనీయమని, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిబంధనల ప్రకారం ఏ దేశం, రాష్ట్రంలోనైనా జీడీపీ లేదా జీఎ్‌స్‌డీపీలో 6 శాతం నిధులు ప్రజారోగ్యానికి కేటాయించాలని, అప్పుడే ఆరోగ్య వ్యవస్థ పటిష్టమవుతుందని మంత్రి చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 సాకారం కావాలంటే రాబోయే రోజుల్లో ఆరోగ్యశాఖకు బడ్జెట్ పెంచాలని కోరారు. ఈ తొమ్మిది నెలల్లో ఆరోగ్యశాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. గిరిజన ప్రాంతాలైన బుట్టాయిగూడెం, పార్వతీపురం, రంపచోడవరం, పార్వతీపురం, డోర్నాల ప్రాంతాల్లో రూ.250 కోట్లు వ్యయంతో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. మాజీ సీఎం జగన్ రాష్ట్రంలో 4 శాతం మాత్రమే స్పెషలిస్ట్‌ల కొరత ఉందని అన్నారని, వాస్తవానికి రాష్ట్రంలో 26 శాతం వైద్య సిబ్బంది కొరత ఉందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మందులకు రూ.1000 కోట్లు బకాయిలు పెట్టిందని, వాటిని చెల్లిస్తేనే తాము మందులు సరఫరా చేస్తామని సరఫరాదారులు చేతులెత్తేశారని చెప్పారు. దీంతో రూ.750 కోట్లు మందులకు విడుదల చేశామని, ఇప్పుడు ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్యశాఖను పూర్తిగా గాడిలో పెట్టామని వెల్లడించారు. అంతకుముందు సభలో సభ్యులు మాట్లాడారు. విశాఖపట్నంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అధిక ధరలతో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు.

అసెంబ్లీ నుంచి డ్రాపౌట్

మండలి నుంచి వాకౌట్



- త్వరలో ప్రజాజీవితం నుంచి కూడా..
- వైసీపీ సభ్యులపై పయ్యావుల కేశవ్ ఫైర్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో డ్రాపౌట్లు, మండలిలో వాకౌట్లు చేస్తున్నారంటూ వైసీపీ సభ్యుల తీరుపై రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే త్వరలోనే ప్రజాజీవితం నుంచీ డ్రాప్ అవుతారని హెచ్చరించారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. బక్కోడి బువ్వను లాక్కుని బలిసిపోదామనుకున్నారని, అందుకే 11 సీట్లకే జనం పరిమితం చేశారని వైసీపీని ఉద్దేశించి మంత్రి అన్నారు. ప్రజల మంచి కోసం వైసీపీ సభ్యుల సద్విమర్శలు స్వీకరిస్తామని తెలిపారు. "సూపర్ సిక్స్ వాగ్దానాలు నిలబెట్టుకునేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆర్థిక విధ్వంసం చోటుచేసుకుంది. దీనివల్ల రాష్ట్రానికి వచ్చే ఆదాయమంతా ఉద్యోగుల జీతభత్యాలకు, అప్పులకు వడ్డీల చెల్లింపులకే సరిపోతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడమే దీనికి కారణం. అదంతా చూస్తే విధ్వంసం అనేది చిన్న మాటలా అనిపిస్తుంది. మేం చేసిన అప్పులను సంపద సృష్టి కోసం ఖర్చుపెడుతున్నాం. మా విధానాల వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతోంది. మా సంపద సృష్టి అంతా సమాజం, ప్రజల కోసం వెచ్చిస్తాం. కానీ, వైసీపీ వారి సంపద సృష్టి అంతా రుషికొండ ప్యాలెస్‌లు, ఎస్టేట్‌ల కోసమే ఖర్చుపెట్టారు. బోత్ ఆర్ నాట్ 'సేమ్'" అని కేశవ్ స్పష్టం చేశారు. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించడానికి ముందంతా రాయలసీమ, కృష్ణా డెల్టా రైతుల మధ్య గొడవలు జరిగేవని, చంద్రబాబు ప్రయత్నంతో వారంతా సఖ్యతతో ఉంటున్నారన్నారు. ఇంకా ఏమన్నారంటే..

తక్కువ వడ్డీ, ఎక్కువ ఈఎంఐలు ఉండేలారుణాల సర్దుబాటుకు యత్నం

"నీళ్లు తోడేందుకు సెట్టింగులు ఏర్పాటుచేసి కుప్పంలో ఆనాడు జగన్ ప్రాజెక్టు ప్రారంభించారు. ఆయన హెలీప్యాడ్ వద్దకు వెళ్లేలోపు నీళ్లు అయిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం 141 కార్పొరేషన్ల ద్వారా గరిష్ఠంగా 13.4 శాతం అత్యధిక వడ్డీలతో అప్పులు తెచ్చింది. ఏపీ పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా 150 కోట్ల అప్పును 13.4 శాతం వడ్డీకి తీసుకుంది. కార్పొరేషన్ల నుంచి, బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీని 9 శాతానికి తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే రాష్ట్రం కుప్పకూలే పరిస్థితి. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల అప్పు కట్టలేని, తీసుకోలేని పరిస్థితిలో ఉన్నాం. వాటినితక్కువ వడ్డీ, ఎక్కువ ఈఎంఐలు ఉండేలా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అభివృద్ధి పనులకు కేంద్రం 27,200 కోట్లను ఇస్తే వాటిని నాటి పాలకులు మళ్లించారు. ఏ శాఖలో తీసుకున్నా వైసీపీ ప్రభుత్వం విగిల్చి పోయిన బకాయిలు భయపెడుతున్నాయి. ఖజానాకు రిజర్వుబ్యాంక్ ఇండియా తాళం వేసే పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించింది. చిట్‌ఫండ్ లాంటి ఏపీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏర్పాటు చేసి బోర్డు తిప్పేసే ప్రయత్నం చేసింది. జగన్ బొమ్మల కోసం నాడు చేసిన రూ.650 కోట్లు ఎవరి సొమ్ము అనేది చెప్పాలి? జగన్ విలాసం ఎలా ఉంటుందో చూపించాలంటే సామాన్యులకు విశాఖ రుషికొండ ప్యాలెస్ చూపించాలి."

'బ్రాండ్ బాబు' వల్లే తిరిగి పెట్టుబడులు

"రాష్ట్ర సంపదను పెంచి ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి కేశవ్ చెప్పారు. బ్రాండ్ చంద్రబాబును చూసి పారిశ్రామికవేత్తలు నమ్మకంతో తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారు. గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో 95 పథకాలను కేంద్రం ఆపేసింది. గత ప్రభుత్వం 40 శాతం నిధులు ఇవ్వకపోగా కేటాయించిన 60 శాతాన్ని మళ్లించడంతో పథకాలు ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తొమ్మిది వేల కోట్లు నిధులు కేటాయించి 77 కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. త్వరలోనే ప్రారంభిస్తున్న తల్లికి వందనం పథకం వల్ల 73 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. అన్నదాతా సుఖీభవ పథకం కోసం రాష్ట్రం రూ. 6,300 కోట్లు, కేంద్రం మరో 3,700 కోట్లు చొప్పున.. మొత్తం రూ. 9,400 కోట్లు ఖర్చు చేయనున్నాం" అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

జగన్ జమానాలో భారీ 'ఫ్రీ హోల్డ్' స్కాం

- 8,452 ఎకరాల అక్రమ రిజిస్ట్రేషన్: అనగాని



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ పేరిట భారీ కుంభకోణం జరిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. జీవో వస్తుందని చెప్పి ఎన్నికలకు ఆరు నెలల ముందు తమ అనుయాయుల ద్వారా ముందుగానే ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశారని తెలిపారు. శుక్రవారం శాసన మండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'జగన్ సర్కారు రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల 59 వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసింది. వాటిలో 11 లక్షల 56 వేల ఎకరాల్లో రీ వెరిఫికేషన్ పూర్తయింది. ఇందులో 5 లక్షల 8 వేల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారు. వాటిలో 25,214 ఎకరాల రిజిస్ట్రేషన్ జరిగింది. అందులో 8,452 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్ అయ్యాయి. ఫ్రీ హోల్డ్, 22 ఏలో చేసిన అక్రమాలన్నింటిపైనా విచారణ జరుగుతుంది. వాటికి సంబంధించిన సమస్యలన్నీ సత్వరమే పరిష్కరిస్తాం' అని వెల్లడించారు. టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. తన ఇంటినీ 22ఏ జాబితాలో పెట్టారని, ఆ ఇంటిపై బ్యాంకులో రుణం కూడా తీసుకున్నామని.. అయినా కక్షకట్టి కావాలని 22ఏలో పెట్టారని చెప్పారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ప్రస్తుతానికి ఎటువంటి ప్రతిపాదనలు లేవన్నారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజన్లను సవరించి.. అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆ జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలంటూ ఆ జిల్లా కలెక్టర్ నుంచి కూడా నివేదిక వచ్చిందన్నారు. ఎమ్మిగనూరు, ఉదయగిరి కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని స్థానిక ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు అందాయని తెలిపారు.

మద్య నిషేధంపై మీరా మాట్లాడేది?

- ఆ హక్కువైసీపీ నేతలకు లేదు: మంత్రి కొల్లు



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ మద్య నిషేధం చేస్తామన్న వైసీపీకి మద్యం గురించి మాట్లాడే హక్కులేదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నపై ఆయన స్పందించారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 66,967 బెల్టు షాపులు కొనసాగాయని మంత్రి తెలిపారు. నాడు జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 42 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. 25 ఏళ్ల పాటు వచ్చే మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. కుటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలను నియంత్రించామని, అందువల్లనే మద్యంపై ఆదాయం పెరిగిందని మంత్రి కొల్లు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో డిస్టిల్లరీలను స్వాధీనం చేసుకుని నాసిరకం బ్రాండ్లను తెచ్చి, భారీగా ధరలు పెంచి దోచుకున్నారని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యం తాగి ప్రజల లివర్, బ్రెయిన్ చెడిపోవడం వల్ల పెద్ద సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుతం కల్తీ మద్యాన్ని నియంత్రించి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తున్నామని మంత్రి కొల్లు వివరించారు. గతంలో తెలంగాణ నుంచి రాష్ట్రంలోకి మద్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా జరిగేదని దానిని పూర్తిగా నియంత్రించామని దాంతో రాష్ట్రంలో 14.43 శాతం అమ్మకాలు పెరిగాయని రవీంద్ర చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యంలో జరిగిన దోపిడీపై సీబీసీఐడీ దర్యాప్తు కొనసాగుతోందని, అక్రమార్కులు ఎవరూ తప్పించుకోలేరని మంత్రి స్పష్టం చేశారు.

ఇసుక, లిక్కర్‌పై వైసీపీ సభ్యులు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది: అచ్చెన్న

లిక్కర్, ఇసుక, గనులు, భూముల మీద వైసీపీ నేతలు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు. వీటి గురించి శాసనమండలిలో ప్రశ్నలు వేసి గౌరవం తగ్గించుకోవద్దని సూచిస్తున్నామన్నారు. గతంలో అక్రమ రవాణా, నాసిరకం మద్యం వల్ల ప్రభుత్వానికి ఆదాయం తక్కువగా ఉండేదని, నాసిరకం మద్యం నియంత్రించడం సహా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రతిపైసా ప్రభుత్వానికి జమ అవుతుందని అచ్చెన్న తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వస్తుందో లేదో అని ఎన్నికల ముందు డిస్టలరీలు ఎక్కువ స్టాకు తెచ్చిపెట్టారని, సొంత డిస్టిలరీల నుంచి తయారు చేసిన బ్రాండ్లను రాబోయే 8 నెలలకు సరిపడా స్టాక్ పెట్టారని, ఆ స్టాక్‌ను ఏం చేయాలో తెలియక వాటిని విక్రయిస్తున్నామని అచ్చెన్నాయుడు అన్నారు.

టీడీఆర్ బాండ్ల అక్రమాల నిగ్గు తేలుస్తాం: మంత్రి నారాయణ

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల అక్రమాలపై మూడు నెలల్లో నిగ్గు తేలుస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విశాఖలో టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విజిలెన్స్, సీఐడీ విచారణ జరుగుతోందని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వంలో విశాఖ, తణుకు, తిరుపతిలో కూడా టీడీఆర్ బాండ్లపై భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. టీడీఆర్ బాండ్ల అవకతవకలపై సభ్యులు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, కన్నబాబు, కొండబాబు, రాధాకృష్ణ సభ దృష్టికి తెచ్చారు. కాగా, 2007లో ఎంఐజీ ఇళ్ల అభివృద్ధి చేసేలా రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు అమలు చేశారని, అనంతపురం, కర్నూలులో ప్రాజెక్టు పూర్తి అయిందని, మిగిలినచోట్ల పెండింగ్‌లో ఉందని మంత్రి నారాయణ తెలిపారు. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, వెలగపూడి రామకృష్ణ తమ నియోజకవర్గాల్లో రాజీవ్ స్వగృహలో జరిగిన అవకతవకలను వివరించారు.

1000 కోట్లతో 'ఆదరణ': మంత్రి సవిత

బలహీన వర్గాల కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సమాధానమిచ్చారు. రూ.1,000 కోట్లతో ఆదరణ పథకం పునఃప్రారంభం కానుందని, శనివారం లక్ష మంది మహిళలకు కుట్టుశిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతపురం చేనేత సహకార సంఘాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టిందని మంత్రి సవిత తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జయనాగేశ్వరరెడ్డి సభలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2014-19 నాటి పథకాలను మళ్లీ అమలు చేస్తామన్నారు.

కర్నూలులో వలసలు ప్రత్యక్షంగా చూశాను: లోకేశ్

కర్నూలు పార్లమెంట్ పరిధిలో ప్రజలు వలసలు వెళ్లడం యువగళంలో ప్రత్యక్షంగా చూశానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సీజనల్ హాస్టళ్లపై ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. యువగళం పర్యటనలో ఉన్నప్పుడు ఒకేరోజు 200 బండ్లలో వలస వెళ్లడం చూశామన్నారు. దీంతో ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగు, తాగు నీరు ఇస్తామని హామీ ఇచ్చామని, కర్నూలుకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గోరుకల్లు జలాశయంపై గౌరు చరితరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిస్తూ గత ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పూర్తిచేసినట్లు ప్రకటించిందని ఆరోపించారు.

క్రీడాకారులకు 7.5కోట్లు విడుదల: రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఇన్సెంటివ్‌ల కింద ఇవ్వాల్సిన రూ.7.5 కోట్లు కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో క్రీడాశాఖ బడ్జెట్ ఆమోదం కోసం జరిగిన చర్చపై ఆయన సమాధానమిచ్చారు. ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారుల రిజర్వేషన్లు 3 శాతానికి పెంచామని గుర్తు చేశారు. రాష్ట్రంలో గతంలో నియమించిన క్రీడా సంఘాలను మార్చాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ కోరారు.

శాఖలకు నిధుల మంజూరుకు ఆమోదం

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖకు రూ.19,263 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,317 కోట్లు, సమాచార శాఖకు రూ.334 కోట్లు, క్రీడాశాఖకు రూ.199 కోట్లు, రవాణా శాఖకు రూ.345 కోట్లకు ఆమోదం కోసం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సభ ముందు ఉంచారు. ఈ కేటాయింపులకు సభ్యులంతా ఆమోదం తెలపడంతో ఆయా శాఖలకు నిధులు మంజూరు చేసేందుకు సభ అంగీకరించింది.

ఎమ్మెల్యేగానూ జగన్ ఫెయిల్: జనసేన

మాజీ సీఎం జగన్‌పై జనసేన ఎమ్మెల్యేలు మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే సహించేది లేదంటూ హెచ్చరించారు. శుక్రవారం పలువురు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత హోదా అడుగుతున్న వైఎస్ జగన్ ఎమ్మెల్యేగానూ ఫెయిల్ అయ్యారని మండిపడ్డారు.

ప్రతిపక్ష హోదా వైసీపీ హక్కు: బొత్స

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రతిపక్ష హోదా పొందటం వైసీపీ హక్కు అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. 'సభలో సంఖ్యాపరంగా టీడీపీ తర్వాత జనసేనకు ఎక్కువ సీట్లు వచ్చాయంటున్న పవన్ కల్యాణ్‌కు అసలు దీని గురించి అవగాహన లేదు. కూటమి ప్రభుత్వంలో జనసేన భాగస్వామిగా ఉన్నప్పుడు వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి. ఒక వేళ ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పుడు పవన్ కల్యాణ్ కూటమి నుంచి బయటకు రావాలి.' అని అన్నారు.

పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు

- జగనన్న కాలనీల పేరిట 18వేల కోట్ల దుర్వినియోగం: మంత్రి కొలుసు



అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి 2029 నాటికి మెరుగైన, సౌకర్యవంతమైన ఇళ్లు నిర్మిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో గృహనిర్మాణం పద్దుపై చర్చ సందర్భంగా ఆయన సమాధానం ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం 33 లక్షల మందికి స్థలాలు ఇస్తున్నామని ప్రకటించి, జగనన్న కాలనీల పేరిట రూ.18వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి టిడ్కో, హౌసింగ్ శాఖ కలిపి 5 లక్షల ఇళ్లు పూర్తిచేసి, ప్రారంభోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. జగనన్న కాలనీల్లో అవకతవకలపై విజిలెన్స్ విచారణ నివేదిక సిద్ధమైందని,బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పేటలో అవినీతి మంత్రి: ప్రత్తిపాటి

వైసీపీ హయాంలో చిలకలూరిపేట నుంచి మంత్రిగా పనిచేసిన వ్యక్తి అవినీతి మంత్రిగా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. అప్పట్లో ప్రతి పనిలో వసూళ్లు చేశారని, అవినీతి మంత్రిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆయన అక్రమాల్లోనే 'తోపు': పరిటాలసునీత

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరోపించారు. రాక్రీట్ సంస్థ ద్వారా ఇళ్లు నిర్మించి ఇస్తానని రూ.100 కోట్లు దోపిడీ చేశారని తెలిపారు. ఆయన పేదలకు ఇళ్లు కట్టడం అటుంచి అక్రమాలు చేయడంలోనే తోపుగా గుర్తింపు పొందారని విమర్శించారు.

వారికి తిరిగి అవకాశం ఇవ్వాలి: కూన రవికుమార్

ఇందిరమ్మ ఇళ్లు కట్టకుండానే కట్టినట్లుగా బిల్లులు డ్రా చేశారని, రాష్ట్రవ్యాప్తంగా 12లక్షల మంది ఈ తరహాలో మోసపోయారని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. వారందరి పేర్లు ఇళ్లు నిర్మించుకున్నవారి జాబితాలో ఉండటంతో ఇప్పుడు కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే అనర్హుల జాబితాలో చూపుతోందని, వారికి ఇళ్లు కట్టుకునేందుకు తిరిగి అవకాశం కల్పించాలని కోరారు. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్నట్లుగా ఉన్న వారి జాబితా నుంచి ఆ 12లక్షల మంది పేర్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయండి: యార్లగడ్డ



విజయవాడ జర్నలిస్టులు 17 సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా ఈ నిరీక్షణకు ముగింపు పలికి వారి సొంతింటి కలను సాకారం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. విజయవాడ వర్కింగ్ జర్నలిస్టు మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నున్న మ్యాంగో మార్కెట్‌కు ఎదురుగా 3.5ఎకరాల ప్రభుత్వ మిగులు భూమిని కేటాయించిందని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన బైపాస్‌లో 1.3 ఎకరాలు కలిసిందన్నారు. మిగిలిన 2 ఎకరాల 15 సెంట్లలో టిడ్కో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని 2019లో చంద్రబాబు ప్రభుత్వం జీవో జారీచేసిందని గుర్తుచేశారు. ఈ సొసైటీలో 150మంది జర్నలిస్టులు ఉండగా కరోనా సమయంలో 14 మంది, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయారని, ఆ కుటుంబాలకు కూడా న్యాయం చేయాలని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు గ్రామాల్లో 4సెంట్లు, పట్టణాల్లో 3సెంట్లు చొప్పున స్థలాలు కేటాయించాలని యార్లగడ్డ కోరారు. దీనిపై మంత్రి పార్థసారథి స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

పంచాయతీకో మోడల్ స్కూల్

- మొదటి విడతలోనే పది వేల పాఠశాలలు
- ఈ నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్.. 16,347 టీచర్ పోస్టులు భర్తీ: లోకేశ్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూలును ఏర్పాటుచేస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. తొలి విడతలోనే 10 వేల పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మార్చాలనేది తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలపై శుక్రవారం శాసనసభలో అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. '1994 నుంచి 2004 వరకు రాష్ట్రంలో 2,53,000 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. వాటిలో 1,80,272 (71శాతం) టీడీపీ హయాంలోనే భర్తీ చేశారు. ఈ ప్రభుత్వంలోనూ 16,347 పోస్టులతో డీఎస్సీపైనే సీఎం తొలి సంతకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నియమించడం వల్ల కొంత జాప్యం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో 22,776 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం. వాటిలో 16,347 ఖాళీలను భర్తీ చేస్తాం. ఎయిడెడ్ పాఠశాలల్లో 4,557 ఖాళీలు ఉన్నాయి' అని తెలిపారు. జీవో 117ను రద్దుచేసి, ప్రత్యామ్నాయం తీసుకొస్తామన్నారు. 'మేం అందరి అభిప్రాయాలు తీసుకుంటాం. మాది పరదాలు కట్టుకుని, 144 సెక్షన్లు విధించే ప్రభుత్వం కాదు. అందుకే 117జీవోపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాం. అందులో వైసీపీ ఉపాధ్యాయ సంఘం కూడా పాల్గొంది. ఎలాంటి సూచనలు చేయకపోయినా నాతో ఫొటో దిగి వెళ్లారు. ఉపాధ్యాయులకు సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నాం. జగన్‌కు ఆత్మలతో మాట్లాడే అలవాటు ఉంది. ఒక రోజు నిద్రలేచి ఐబీ సిలబస్ పెడదాం అంటాడు. దాని రిపోర్టు కోసమే రూ.5 కోట్లు ఖర్చు చేశారు. మరొక రోజు ఆత్మలతో మాట్లాడి ఉదయాన్నే టోఫెల్ అంటాడు. అదీ సక్రమంగా అమలుకాలేదు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్నద్ధం చేయకుండా వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ పెట్టారు. ఎందుకైనా మంచిదని మేం మాక్ పరీక్ష నిర్వహిస్తే 90శాతం మంది ఫెయిలయ్యారు. మహిళల పట్ల గౌరవం పెంచేలా కరిక్యులమ్‌లో మార్పులు తీసుకొస్తున్నాం. మహిళలను తక్కువ చేసేలా గాజులు తొడుక్కున్నారా? చీరలు కట్టుకున్నారా లాంటి వ్యాఖ్యలు కూడా వినపడకుండా చేయాలని ఆదేశించా. మహిళలను తక్కువ చేయడం సరికాదు. చిన్న వయసులోనే నాకు, బ్రాహ్మణికి వివాహం జరిగింది. అమెరికా వెళ్లి ఇద్దరం కలిసి పనిచేసుకున్నాం. ఇందులో ఒకరు ఎక్కువ.. ఒకరు తక్కువని చూడకూడదు' అని స్పష్టం చేశారు. చిక్కీలలో 36 శాతం నిధులు ఆదా చేసినట్లు లోకేశ్ చెప్పారు. 'స్టూడెంట్ కిట్లలో 8 నుంచి 9శాతం ఆదా అవుతాయి. మొత్తంగా ఐదేళ్లలో కనీసం రూ.వెయ్యి కోట్లు ఆదా చేసి చూపిస్తాం. పిల్లల బ్యాగులు బరువుగా ఉండకూడదనే ఉద్దేశంతో సెమిస్టర్ల వారీగా పుస్తకాలు తయారుచేస్తున్నాం. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ఏర్పాటుచేస్తాం. జూన్ నాటికి విద్యాశాఖలో సంస్కరణలు పూర్తిచేస్తాం' అని తెలిపారు.



విశ్రాంతి తీసుకుంటారా.. సస్పెండ్ చేయించాలా?

- నిమ్మలతో లోకేశ్ సరదా హెచ్చరిక

మంత్రి నిమ్మల రామానాయుడుపై మంత్రి లోకేశ్ శాసనసభలో సరదా వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం సరిగా లేకపోయినా ప్రశ్న ఉందని సభకు వచ్చారని.. ఆయన ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని ఉపసభాపతి రఘురామకృష్ణరాజును కోరారు. స్వల్ప అస్వస్థతతో ఉన్న నిమ్మల.. చేతికి ఫ్లూయిడ్స్ ఎక్కించే కాథెటర్‌తో శుక్రవారం సభకు హాజరయ్యారు. వచ్చిన ప్రశ్నకు సుదీర్ఘంగా సమాధానం చెప్పారు. వెంటనే లోకేశ్ స్పందిస్తూ.. ఆయన తీవ్రంగా పనిచేస్తున్నారని, అందుకే ఆరోగ్యం బాగాలేకపోయినా సభకు వచ్చారని, ఆయన్ను ఇంటికి పంపాలని అన్నారు. ఆరోగ్యం సరిగా లేకపోయినా రావడం సబబు కాదని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. అనంతరం లాబీల్లోనూ నిమ్మల ఎదురుపడినప్పుడు లోకేశ్ ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. 'మీరు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారా? లేకపోతే సస్పెండ్ చేయించమంటారా' అని అన్నారు.

విద్యుత్ ట్రూ అప్ పాపం వైసీపీదే

- మండలిలో అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
- వాస్తవ విరుద్ధమైన బడ్జెట్: బొత్స ఆరోపణ
- మాట్లాడనివ్వడం లేదంటూ వాకౌట్





అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్‌పై ట్రూ అప్ చార్జీల భారం మోపడంలో కర్త, కర్మ, క్రియా అంతా గత వైసీపీ సర్కారుదేనని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మండలిలో మండిపడ్డారు. లక్షల కోట్లు అప్పులు చేసిన గత ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, రోడ్లపై గోతులు కూడా పూడ్చలేదని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిందని ధ్వజమెత్తారు. రోడ్లపై గోతులు పూడ్చామని చెబుతున్నారని కానీ, వాస్తవానికి ఎక్కడి గోతులు అక్కడే ఉన్నాయని మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపైనా అచ్చెన్నాయుడు దీటుగా బదులిచ్చారు. 'మీ జిల్లాలో ఏదైనా రోడ్డు మీరే ఎంపిక చేసుకోండి. అక్కడ గతానికి ఇప్పటికీ తేడా ఎంటో చూపిస్తాం' అని బొత్సకు అచ్చెన్న సవాలు విసిరారు. విపక్ష నేతగా బడ్జెట్‌పై మాట్లేడేందుకు బొత్సకు సమయం ఇస్తే అవాస్తవాలు, అసత్యాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతకుముందు బొత్స మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపిందని అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వాస్తవాలు మాట్లాడుతుంటే తమను అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ అందుకు నిరసనగా బొత్స, వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు.

విద్యుత్తు చార్జీలు పెంచబోం

విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. జగన్ పాలనలో 2022-23, 23-24 కాలంలో ఏపీఈఆర్సీ ప్రతిపాదించిన ట్రూ అప్ భారం రూ.15 వేల కోట్లపై ప్రజలను వైసీపీ తప్పుదోవ పట్టిస్తోందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను మీ బిడ్డ భువనమ్మను!

- నన్ను మేడం.. మేడం అని పిలవొద్దు
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా కలిసి అడుగులేద్దాం
- కొమరవోలు వాసులతో నారా భువనేశ్వరి



గ్రామస్తులతో మాట్లాడుతున్న భువనేశ్వరి, పక్కన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా తదితరులు

పామర్రు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'నన్ను మేడం.. అంటూ పిలవొద్దు. నన్ను మీ బిడ్డ భువనమ్మగానే ఆదరించండి' అని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కొమరవోలు వాసులను కోరారు. గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భువనేశ్వరి తన తల్లి బసవతారకం స్వగ్రామం, తన దత్తత గ్రామమైన కృష్ణా జిల్లా పామర్రు మండలం కొమరవోలు శివాలయంలో ప్రత్యేక పూజల నిమిత్తం శుక్రవారం గ్రామానికి వచ్చారు. తొలుత గ్రామ ముఖ ద్వారం వద్ద తన తల్లిదండ్రులు ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదేళ్ల నుంచి దరఖాస్తు చేసుకుంటున్నా పింఛన్లు అందడం లేదని, గ్రామంలో సీసీ, డొంక రోడ్లు గత టీడీపీ హయాంలో నిర్మించినవే తప్ప నూతనంగా నిర్మించినవి లేవని పలువురు గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. కల్యాణ మండపం అవశ్యకతను తెలిపారు. భువనేశ్వరి మాట్లాడుతూ ఇవి చిన్న సమస్యలేనని, ఇలాంటి వాటిని పరిష్కరించేందుకు సీఎం కంకణబద్ధులై ఉన్నారని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. భవిష్యత్తులో గ్రామంలో మరిన్ని మంచి కార్యక్రమాల అమలుకు కలసికట్టుగా పనిచేద్దామని పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణ, ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పాల్గొన్నారు.

బోరుగడ్డ బొంకులు!

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలున్నందున... ఆమెకు చికిత్స చేయించాలంటూ బోరుగడ్డ అనిల్ బెయిలుకోసం హైకోర్టును ఆశ్రయించాడు. మానవీయ కోణంలో పరిశీలించిన న్యాయస్థానం... ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 28వరకు అనిల్‌కు బెయిలు మంజూరు చేసింది. బోరుగడ్డ తల్లి పద్మావతికి అనారోగ్యం నిజమే! ఆమెకు చెన్నై అపోలోలో శస్త్ర చికిత్స జరగడమూ నిజమే! అయితే... బోరుగడ్డ అనిల్‌కు బెయిలు రావడానికి రెండు రోజుల ముందే, అంటే గతనెల 12వ తేదీనే ఆమె ఆస్పత్రిలో చేరారు. 18వ తేదీన ఆమెకు శస్త్రచికిత్స జరిగింది. 23న డిశ్చార్జి అయ్యారు. బోరుగడ్డ 28 వరకు బెయిలుపైనే ఉన్నాడు.

మళ్లీ రెండోసారి...

హైకోర్టు ఆదేశాల మేరకు గతనెల 28న బోరుగడ్డ అనిల్ రాజమండ్రి జైలులో లొంగిపోయాడు. అయితే... ఈనెల 1న తన మధ్యంతర బెయిలు పొడిగించాలంటూ మళ్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన తల్లికి శస్త్రచికిత్స జరిగినందున కొన్నాళ్లపాటు ఆమె బాగోగులు చూసుకోవాలని నిజాయితీగా కోరితే సరిపోయేది! కానీ... ఇక్కడ తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. గత నెల 23నే ఆమె డిశ్చార్జి అయినప్పటికీ... 'ఆమె ఇంకా చెన్నై అపోలోలో చికిత్స పొందుతున్నారు' అని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అంతేకాదు... 'ఆమె పరిస్థితి క్షీణిస్తోంది. అత్యవసరంగా ఆమెను చెన్నై అపోలో ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందించాలి' అంటూ గుంటూరు లలితా హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ ఇచ్చినట్లుగా ఒక నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టు ముందుంచాడు. అది అసలుదే అనే సమాచారం తనకు లేదని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అప్పుడే చెప్పారు. అయితే... మానవీయ కోణంలో చూసిన హైకోర్టు, బోరుగడ్డ అనిల్‌కు ఈనెల 11వ తేదీ వరకు మధ్యంతర బెయిలును పొడిగించింది. సర్టిఫికెట్ నకిలీదని తేలితే చర్యలు తీసుకోవాలని బెయిలు ఉత్తర్వుల్లోనే స్పష్టం చేసింది.

బెయిల్ రద్దుకు పోలీసుల పిటిషన్

కోర్టుకు నకిలీ సర్టిఫికెట్ అందించి బెయిల్ పొడిగింపు పొందినట్లు తేలడంతో అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన బెయిల్ రద్దు చేయాలని శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు నుంచి వచ్చే ఉత్తర్వుల కోసం గుంటూరు, అనంతపురం జిల్లాల పోలీసులు ఎదురుచూస్తున్నారు. దీనిపై క్రిమినల్ చర్యలకు హైకోర్టు ఆదేశిస్తే బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు నమోదయ్యే అవకాశముంది. దీంతోపాటు డాక్టర్ లెటర్ హెడ్ సృష్టించిన వ్యక్తులు, రబ్బర్ స్టాంపు తయారు చేసిన వారిని కూడా ఇందులో నిందితులుగా చేర్చడం ఖాయమని తెలుస్తోంది.

ఆ సర్టిఫికెట్ నకిలీదే

తాను ఇచ్చినట్లుగా హైకోర్టుకు బోరుగడ్డ అనిల్ సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నకిలీదే అని ప్రముఖ వైద్యులు, లలితా హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాఘవ శర్మ పోలీసులకు స్పష్టం చేశారు. సర్టిఫికెట్‌లోని సంతకం తనది కాదని ఆయన పోలీసులకు తెలిపారు. అనిల్ సృష్టించిన సర్టిఫికెట్‌లోని తేదీ ఉన్న రోజుకు సంబంధించిన ఆసుపత్రి సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు క్షుణ్నంగా పరిశీలించారు. అనిల్ గాని, ఆయన తల్లి గాని ఆస్పత్రికి రాలేదని నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం బోరుగడ్డ అనిల్ ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. గుంటూరులోని ఆయన ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఆయన కదలికలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఎవరికి చెప్పారు సార్?

- బోరుగడ్డ విడుదలపై జైలు అధికారి దబాయింపు

బోరుగడ్డ అనిల్‌ను 'అలా వదిలేస్తారా?' అని ప్రశ్నించడంపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ స్పందించారు. తాము బెయిలు నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని, విడుదల సమయంలో మీడియాకు చెప్పాల్సిన అవసరం లేదని తెలిపారు. సంబంధిత జిల్లాల పోలీసులకు మాత్రం సమాచారమిచ్చామని పేర్కొన్నారు. కానీ... రెండు జిల్లాల ఎస్పీలు, అనంతపురం నాలుగో పట్టణ పోలీసులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, అనిల్ విడుదలపై రాజమండ్రి సెంట్రల్‌జైలు నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని స్పష్టం చేశారు. బెయిలుపై ఉన్న వ్యక్తి కదలికలు గమనించేందుకు స్థానిక పోలీసులకు, కేసు నమోదైన పోలీసు స్టేషన్‌కు జైలు అధికారులు సమాచారమివ్వాలి. కానీ... రాహుల్ ఎవరికి, ఏ రూపంలో సమాచారం పంపారో మరి!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.